




www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

సోమవారం
17-06-2024

సంపుటి : 01 | సంచిక : 44 | పేజీలు : 12 | వెల : 5/-

తెలంగాణ / ఆంధ్రప్రదేశ్

V3 NEWS



## నల్లగొండ ఖాకీల్లో వణుకు

**ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇరుకుంటున్న ఖాకీలు**

- మునుగోడు ఉప ఎన్నిక వ్యవహారంలో బిగుస్తున్న ఉచ్చు
- డబ్బుల అక్రమ రవాణ, సెటిల్ మెంట్లు చేసినట్లు వెలుగులోకి..
- ఫోన్ ట్యాపింగ్ చేసి భారీగా డబ్బులు వసూలు
- ఓ డీఎస్పీ ఆదేశంతోనే అంతా చేసినట్లు వెల్లడి
- సిట్ ఎదుట టాస్క్ ఫోర్స్ కానిస్టేబుల్ వాంగ్మూలం
- ప్రస్తుతం జైల్లో ఉన్న అధికారులంతా జిల్లాలో పని చేసినవారే..
- నల్లగొండ ఎస్పీగా పని చేసిన ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు
- సిట్ దర్యాప్తులో బయటపడుతున్న జిల్లా పోలీసుల పాత్ర

2




## కేసీఆర్‌కు ఊహించని షాక్?

### మండలిలో బీఆర్ఎస్ ఖాళీ? పక్కా స్కెచ్ వేసిన కాంగ్రెస్ పార్టీ

- బీఆర్ఎస్ఎల్పీ కాంగ్రెస్ పార్టీలో విలీనం?
- ఇప్పటికే ఓ ఎమ్మెల్సీతో చర్చలు పూర్తి
- మండలిలో ఇబ్బంది లేకుండా రేవంత్ వ్యూహం
- గద్వాల ఎమ్మెల్యే సైతం హస్తం గూటికి..
- మంత్రి జూపల్లితో సంప్రదింపులు కంప్లీట్
- గులాబీ పార్టీని కోలుకోలేని దెబ్బ తీయనున్న హస్తం పార్టీ

**విశ్వంభర, హైదరాబాద్:** బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షనాయకులను మొత్తం తమ పార్టీలోకి లాగేసుకుంది. కాంగ్రెస్, టీడీపీ, వైసీపీ అనే తేడా లేకుండా అందరిని గుంజుకుంది. కాంగ్రెస్ శాసనసభ పక్షాన్ని ఏకంగా బీఆర్ఎస్‌లో విలీనం చేయించింది. వారిలో కొందరికి మంత్రి పదవులను కట్టబెట్టింది. దీనిపై అప్పట్లో ఎన్ని విమర్శలు వచ్చినా కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇక ఇప్పుడు రేవంత్ రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మిగతా2లో...

## ముస్లింలకు సీఎం శుభాకాంక్షలు

విశ్వంభర, హైదరాబాద్ : త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ (ఈద్ ఉల్ అజ్ ) పండుగ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఇస్లాం ప్రవక్తల్లో ఒకరైన ఇబ్రహీం అస్సలామ్, అల్లాహ్ ఆజ్ఞను శిరసావహించి తన కుమారుడిని సైతం బలి ఇచ్చేందుకు సిద్ధం కావడాన్ని స్మరిస్తూ ఈ పండుగ జరుపుకుంటున్నారని గుర్తు చేశారు. ప్రవక్తల అచంచలమైన దైవ భక్తి, త్యాగ నిరతికి బక్రీద్ పండుగ అద్దం పడుతుందన్నారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు భయపడకుండా, దేవుని పై విశ్వాసంతో సన్మార్గంలో జీవనం సాగించాలని బక్రీద్ పండుగ మానవాళికి గొప్ప సందేశాన్ని ఇస్తుందన్నారు. తమకు ఉన్న దాంట్లో నుంచే ఇతరులకు పంచిపెట్టడాన్ని మించిన దాతృత్వం మరొకటి లేదనే స్ఫూర్తిని చాటిచెపుతోందని సీఎం అభిప్రాయపడ్డారు.

## మోడీ సర్కార్‌లో స్పందనేది?

- నీట్ ఎగ్జామ్‌పై ఆరోపణలు వస్తే మౌనం ఎందుకు?
- నిమ్మకు నీరెత్తినట్టు కేంద్ర ప్రభుత్వం తీరు
- అత్యంత నిర్లక్ష్య వైఖరిని అనుసరిస్తోంది
- విద్యార్థుల భవిష్యత్‌ను ప్రమాదంలోకి నెట్టారు
- నీట్ పేపర్ లీక్ ఆరోపణలపై సమగ్ర విచారణ చేయాలి
- కేంద్ర ప్రభుత్వానికి మాజీ మంత్రి కేటీఆర్ లేఖ

3

## టాటా గ్రూప్ మరో కొత్త వ్యాపారంలోకి అడుగులు

- మొబైల్ కంపెనీ స్థాపనకు ప్లాన్
- వివోను కొనుగోలు చేసేందుకు సన్నద్ధం
- ఇప్పటికే రెండు కంపెనీల మధ్య చర్చలు పూర్తి
- చైనా కంపెనీలో 51 శాతం వాటా తీసుకోనున్న టాటా




11



## కాంగ్రెస్ పార్టీ అంటనే ప్రజలపై భారం

- ఎన్నికలు ముగియగానే ఇంధన ధరలు పెంచుతారా..?
- కర్ణాటక ప్రభుత్వంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఫైర్

2

## మొన్న వేలు.. నిన్న జెర్రీ!

ఐస్‌క్రీమ్‌లో షాకింగ్ ఘటనలు.. కొంతముంచుతున్న ఆన్‌లైన్ ఆర్డర్లు




9

## మైన్స్ వేలం వేస్తారా.. మేమే వేయాలా?

తొమ్మిదేళ్ల నుంచి ఒక్క మైన్‌కు వేలం వేయరా..?

జూన్ 30 వరకు ఆరు మైన్స్‌కు వేలం వేయాల్సిందే..

రాష్ట్రానికి డెడ్ లైన్ విధిస్తూ హెచ్చరించిన కేంద్రం

**విశ్వంభర, ఢిల్లీ:**

కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి డెడ్ లైన్ ఇచ్చింది. జూన్ 30 వరకు మైన్స్ వేలం వేయాలని సూచించింది. లేదంటే మేమే రంగంలోకి దిగాల్సి ఉంటుందని లేఖ ద్వారా హెచ్చరించింది. తొమ్మిదేళ్ల నుండి తెలంగాణ ప్రభుత్వం కనీసం ఒక్క మినరల్ బ్లాక్ కి కూడా ఆక్షన్ నిర్వహించలేదని కేంద్ర గనుల శాఖ వెల్లడించింది.

మిగతా2లో...



మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి

## నేటి చికెన్ ధరలు



| ఫామ్ ధర | రిటైల్ |
| --- | --- |
| ₹ 139 | ₹ 161 |
| **స్కిన్** | **స్కిన్‌లెస్** |
| ₹233 | ₹266 |

## మస్క్ వర్సెస్ బీజేపీ

- ఈవీఎంలపై రచ్చ రచ్చ
- మస్క్‌కు కౌంటర్ ఇచ్చిన బీజేపీ కేంద్ర మంత్రులు
- మస్క్‌కు మద్దతు ఇచ్చిన రాహుల్ గాంధీ



**విశ్వంభర, ఢిల్లీ:**

ఇప్పుడు దేశంలో ఎలాన్ మస్క్ వర్సెస్ బీజేపీ రగడ సాగుతోంది. అది కూడా ఈవీఎంల మీద. ఎందుకంటే మొన్న ఎలన్ మస్క్ సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టారు. ఇండియాలో ఈవీఎంలను రద్దు చేయాలంటూ ఆయన పోస్టు పెట్టారు. ఎందుకంటే మిగతా2లో...




# మైన్స్ వేలం వేస్తారా.. మేమే వేయాలా?

(మొదటి పేజీ తరువాయి)
జూన్ 30 వరకు కనీసం ఆరు బ్లాకులైనా వేలం వేయాలని ఆదేశించింది. ఇప్పటికే ప్రభుత్వానికి 11 బ్లాకుల జియలాజికల్ రిపోర్ట్ పంపినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. కాగా, వీటిలో ఐదు ఇనుప ఖనిజం బ్లాకులు, ఐదు సున్నపురాయి బ్లాకులు, ఒక మాంగనీస్ బ్లాకు ఉన్నట్లు పేర్కొన్నాయి. అయితే కేంద్ర గనుల శాఖ తెలంగాణ ప్రభుత్వానికి పలుసార్లు వేలం వేయమని గుర్తు చేసినప్పటికీ ఒక్క బ్లాకుని కూడా వేయలేదు. దీంతో జూన్ నెలాఖరులోగా కనీసం ఆరు బ్లాకులకు ఆక్షన్ నిర్వహించాలని కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ సూచించింది. అలా జరగకుంటే ఆ ప్రక్రియను కేంద్రమే నిర్వహిస్తుందని లేఖలో వార్నింగ్ ఇచ్చింది.

**సీఎం రేవంత్ రెడ్డి అనుమతి రాగానే..**

కాగా, 2015లో మినరల్ బ్లాకుల వేలం ప్రక్రియ ప్రారంభమైంది. 2021లో నిబంధనలు సవరించగా... ఆ నిబంధనల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన డెడ్ లైన్ లోపు వేలం ప్రక్రియని పూర్తి చేయాల్సి ఉంటుంది. అలా చేయనట్లయితే వేలం నిర్వహించే అధికారం కేంద్రం చేతుల్లోకి వెళ్తుంది. ఈ విధానం అమల్లోకి వచ్చిన నాటి నుంచి దేశంలోని 354 ప్రధాన మినరల్ బ్లాకులను వేలం వేశారు. 48 చోట్ల ఉత్పత్తి కూడా ప్రారంభమైంది. దీంతో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకి ఆదాయం పెరిగింది. తెలంగాణలో మేజర్, మైనర్ మినరల్ బ్లాకులను వేలం పద్ధతిలో కేటాయించేందుకు గనులశాఖ సిద్ధమైందని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు ఈమధ్యనే వెల్లడించాయి. ఖనిజాల వారీగా ప్రతిపాదనల్ని ప్రభుత్వానికి పంపినట్లు తెలిపాయి. ఇందులో 3 సున్నపురాయి బ్లాకులు కాగా, మరో 12 చిన్నతరహా ఖనిజాలని సమాచారం. సీఎం రేవంత్ రెడ్డి ఆమోదం రాగానే వేలం ప్రక్రియను ప్రారంభించాలని మంత్రిత్వ శాఖ భావిస్తున్నట్లు తెలుస్తోంది. వేలంలో అర్హత సాధించిన వారికి ఆయా గనుల్ని 20 ఏళ్ల పాటు లీజుకు ఇవ్వనున్నట్లు సమాచారం.

# మస్క్ వర్సెస్ బీజేపీ

(మొదటి పేజీ తరువాయి)
వాటిని మనుషులు లేదంటే ఏఐ హ్యాక్ చేసే ప్రమాదం ఉందని.. కాబట్టి వాటిని ఎన్నికల్లో వాడకపోవడం బెటర్ అంటూ తెలిపారు. అమెరికా నియంత్రణలోని ప్యూర్టో రికోలో ఇటీవల నిర్వహించిన ప్రైమరీ ఎన్నికల్లో అవకతవకలు చోటు చేసుకొన్నాయన్న ఆరోపణల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే ఆయన వ్యాఖ్యలపై బీజేపీ భగ్గుమంటోంది. తాజాగా మస్క్ పోస్టు మీద కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ఫైర్ అయ్యారు. అసలు సురక్షితమైన డిజిటల్ హార్డ్‌వేర్‌ను తయారు చేయలేరన్నారు. ఇండియాలో వాడే ఈవీఎంలకు కస్టమ్ డిజైన్ చేయబడినవి. సురక్షితమైనవి, ఏదైనా నెట్‌వర్క్ లేదా మీడియా నుంచి వేరుచేయబడి ఉంటాయి. పైగా వీటికి ఎలాంటి కనెక్టివిటీ లేదు. బ్లూటూత్, వైఫై, ఇంటర్ నెట్ లాంటివి లేవు. కాబట్టి వాటిని హ్యాక్ చేయడం అసాధ్యం. అంతే కాకుండా అవి రీప్రోగ్రామ్ చేయలేని ఫ్యాక్టరీప్రోగ్రామ్ చేసిన కంట్రోలర్‌లు. కాబట్టి వాటి గురంచి మస్క్ పూర్తిగా తెలుసుకుని మాట్లాడితే బెటర్ అంటూ ఆయన ఘాటుగా హెచ్చరించారు. ఇక ఇదే విషయంపై రాహుల్ గాంధీ మరోలా స్పందించారు. ఆయన మాట్లాడుతూ.. ఈవీఎంలు హ్యాకింగ్‌కి గురవుతున్నాయని విపక్షాలు ఎన్నో ఏళ్లుగా ఆరోపిస్తున్నాయి. ఇక ఇప్పుడు.. ఎలాన్ మస్క్ సైతం అలాంటి వ్యాఖ్యలే చేశారు. కానీ దాన్ని ఈ దేశంలో విమర్శించడానికి వీల్లేదు. కానీ మన దేశంలో ఎన్నికల పారదర్శకతపై తీవ్ర స్థాయిలో ఆందోళన వ్యక్తం అవుతోంది. వ్యవస్థలు జవాబుదారీ తనంగా లేకపోతే మాత్రం.. కచ్చితంగా ప్రజాస్వామ్యం మోసానికి గురవుతున్నట్టే అని రాహుల్ మస్క్ కు మద్దతుగా మాట్లాడారు.

## కాంగ్రెస్ పార్టీ అంటనే ప్రజలపై భారం

**విశ్వంభర, హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే అధిక ఇంధన ధరలు, అధిక ద్రవ్యోల్బణం, సామాన్య ప్రజలపై భారం అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. కర్నాటకలో ఇంధన ధరలపై పన్ను పెంచడంపై కిషన్ రెడ్డి ఆదివారం ఎక్స్(ట్విట్టర్) వేదికగా స్పందించారు. ఎన్నికలు ముగియగానే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఇంధన ధరలు పెరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్నాటకలో లీటర్ పెట్రోల్ ధర రూ.103.44 ఉంటే తెలంగాణలో రూ.109.41 ఉందని అదే బీజేపీ పరిపాలిస్తున్న గుజరాత్ లో లీటర్ పెట్రోల్ ధర రూ.94.44 , యూపీలో రూ.94.70, ఉత్తరాఖండ్ లో రూ. 93.82, హర్యాణాలో రూ.95.46, గోవాలో రూ.95.36 ఉందని అన్నారు. కాగా కర్నాటక ప్రభుత్వం జూన్ 15 నుంచి పెట్రోల్, డీజిల్‌పై పన్ను పెంచింది. దీంతో ఇంధన ధరలు రూ.3 పెరిగాయి. కొత్త ధరలు తక్షణమే అమల్లోకి వస్తాయని కర్ణాటక ప్రభుత్వం అధికారిక ప్రకటన రిలీజ్ చేసింది. ఈ నిర్ణయాన్ని బీజేపీ తప్పుబడుతోంది. ఎన్నికలు ముగియగానే ప్రజలపై కాంగ్రెస్ ప్రభుత్వం భారం మోపుతోందని మండిపడింది.

## మాజీ మంత్రి జగదీష్ చేస్తే కమిషన్ ఏర్పాటు!

- ఏ తప్పు చేయనట్లైతే విచారణకు హాజరైతే తప్పేంటి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**విశ్వంభర, హైదరాబాద్:** ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోళ్లు, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్ల నిర్మాణానికి సంబంధించిన ఎంక్వైరీ కమిషన్‌కు కేసీఆర్ ఇచ్చిన రిప్లై లేఖ హాట్ టాపిక్‌గా మారింది. కమిషన్ విచారణను కేసీఆర్ తప్పుబట్టడంపై కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఫైర్ అవుతున్నాయి. ఈ క్రమంలోనే కేసీఆర్ లేఖపై తాజాగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించారు. విచారణ కమిషన్‌పై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. కేసీఆర్ ఏ తప్పు చేయనట్లైతే కమిషన్ ముందు విచారణకు హాజరైతే వచ్చే నష్టమేంటని ప్రశ్నించారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి కోరడంతోనే గత ప్రభుత్వంలోని విద్యుత్ కొనుగోళ్లపై కమిషన్ ఏర్పాటు చేశామని తెలిపారు. గతంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ కూడా కమిషన్ ముందు హాజరయ్యారని గుర్తు చేశారు. అలాంటిది తప్పు చేయనప్పుడు కేసీఆర్ కమిషన్ ముందు దర్యాప్తుకు హాజరు కావడానికి వచ్చిన సమస్య ఏంటని భట్టి విక్రమార్క నిలదీశారు.

## ముస్లింలకు సీఎం చంద్రబాబు బక్రీద్ విషెస్



**విశ్వంభర, విజయవాడ:** బక్రీద్ సందర్భంగా పేదలకు ఆహార వితరణ చేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. రంజాన్ తర్వాత ముస్లింలు జరుపుకునే అతి పెద్ద పండుగ బక్రీద్. బక్రీద్ అంటే బకర్ ఈద్ అని అర్థం. ఇక బక్రీద్ సందర్భంగా ముస్లింలకు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ 'త్యాగగుణాన్ని ప్రబోధించే బక్రీద్‌ను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలి అని ప్రజల్లో స్వార్థం, రాగద్వేషాలు ఉండకూడదు. మానవుల్లో త్యాగనిరతిని పెంచడమే బక్రీద్ ఉద్దేశం. సమైక్యత, సమానత్వం గురించి ప్రతి ఒక్కరూ ఆలోచించాలి.' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# నల్లగొండ ఖాకీల్లో వణుకు

**విశ్వంభర, నల్లగొండ:**




సంచలనంగా మారిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఉమ్మడి నల్లగొండ జిల్లా పోలీసులను వణికిస్తోంది. మునుగోడు బై పోల్ సమయంలో అప్పటి అధికార బీఆర్ఎస్ కు పోలీసులు అనుకూలంగా వ్యవహరించి పెద్ద మొత్తంలో డబ్బును చేరవేసినట్లు సిట్ విచారణలో బయట పడుతోంది. సిట్ దర్యాప్తు.. బీఆర్ఎస్‌కు వంతపాడిన పోలీసు అధికారుల్లో వణుకు పుట్టిస్తోంది. దీంతో మునుగోడు ఉప ఎన్నిక జిల్లా పోలీసుల మెడకు ఉచ్చుగా మారుతోంది. సిట్ విచారణలో వెలుగు చూస్తున్న అక్రమాల మకిలీ జిల్లా పోలీసు యంత్రాంగం మొత్తానికి అంటుకుంటోంది.

**ఆ ఐదుగురికి జిల్లాతో అనుబంధం**

రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సిట్ దర్యాప్తులో రోజుకో కొత్త అంశం వెలుగులోకి వస్తోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ అభ్యర్థులకు అనుకూలంగా పోలీస్ పెద్దలు డబ్బులు చేరవేశారని విమర్శలు ఉన్నాయి. ఫోన్ టాపింగ్ కేసులో నిందితులుగా ఉన్న ఐదుగురు అధికారులు గతంలో ఉమ్మడి నల్గొండ జిల్లాలో పనిచేసిన వారే. ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు 2015లో నల్లగొండ జిల్లా ఎస్పీగా పనిచేశారు. టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ రావు నల్లగొండలో ఓఎస్డి గా పనిచేశారు. ఏఎస్పీలు తిరుపతన్న, భుజంగరావులు కూడా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలు ప్రాంతాల్లో పనిచేశారు. డిఎస్పి ప్రణీత్ రావు.. ఎస్సైగా జిల్లాలో పలు ప్రాంతాల్లో పనిచేశారు. సీఐ గట్టు మల్లు కూడా నల్గొండ జిల్లాలో పనిచేశారు.

**పోలీసుల మెడకు 'మునుగోడు ఉపఎన్నిక' ఉచ్చు..**

ఫోన్ ట్యాపింగ్‌పై సీట్ చేపట్టిన విచారణలో అనేక విస్తుపోయే అంశాలు వెలుగు చూస్తున్నాయి. అప్పటి అధికార బీఆర్ఎస్‌తో అంటకాగినందుకు జిల్లాలో పనిచేసిన పోలీస్ అధికారుల మెడకు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఉచ్చు బిగిస్తోంది. ఉన్నతాధికారుల ఓరల్ ఆదేశాలతో అప్పటి అధికార బీఆర్ఎస్‌కు రాత్రి వేళల్లో పోలీసులు పెద్ద మొత్తంలో డబ్బును చేరవేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మునుగోడు బై పోల్‌లో డబ్బు చేరవేసిన వ్యవహారం బయటపడటంతో అధికారులను చిక్కుల్లో పడేసింది. స్పెషల్ బ్రాంచ్ వ్యవహారాలను పర్యవేక్షించిన డీఎస్పీ ఆదేశాలతోనే తాను డబ్బులు చేరవేసిన వాహనానికి ఎస్కార్ట్ వ్యవహరించిన ఓ కానిస్టేబుల్ వాంగ్మూలం ఇవ్వడం అధికారుల్లో వణుకు పుట్టిస్తోంది.

**టాస్క్ ఫోర్స్ కానిస్టేబుల్స్‌ను విచారించిన సిట్..**

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో నిందితులుగా ఉన్న పోలీస్ అధికారులు అందరూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పనిచేశారు. దీంతో ఫోన్ ట్యాపింగ్‌పై దర్యాప్తు చేస్తున్న సిట్.. రెండు నెలల కిందటే జిల్లా కేంద్రంలోని టాస్క్ ఫోర్స్‌లో పనిచేస్తున్న ముగ్గురు పోలీసులను విచారించింది. ఇందులో ఒకరి వాంగ్మూలం ఆధారంగా మునుగోడు బైపోల్‌లో ఫోన్ ట్యాపింగ్ ద్వారా ఎవరి డబ్బును పట్టుకున్నారు? ఎవరిని బెదిరించి వసూళ్లకు పాల్పడ్డారు? అనే అంశాలపై విచారణ చేపట్టింది. అయితే కానిస్టేబుల్ వాంగ్మూలం పోలీస్ అధికారుల మెడకు చుట్టుకుంటోంది.

**డబ్బు తరలించిన వాహనంపై సిట్ ఆరా?**

మునుగోడు ఉపఎన్నికల సమయంలో డబ్బును చేరవేసిన వాహనం ఎవరిదన్న కోణంలోనూ స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం (సిట్) విచారణ జరుపుతోంది. టాస్క్ ఫోర్స్ కానిస్టేబుల్ ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా డబ్బు చేరవేత అంశాన్ని లోతుగా దర్యాప్తు చేస్తోంది. డబ్బు తరలింపుకు ఉపయోగించింది. పోలీసు అధికారులు వాహనమా? అన్న కోణంలో విచారిస్తున్నట్లు తెలిసింది. మునుగోడు ఉప ఎన్నికల్లో డబ్బు చేరవేతకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలిస్తే ఫోన్ ట్యాపింగ్ కేసుకు మరింత బలం చేకూరే అవకాశం ఉంది.

**మరిన్ని అరెస్టులు తప్పవా..?**

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం (సిట్) దర్యాప్తును ముమ్మరం చేసింది. ఫోన్ ట్యాపింగ్ ఆధారంగా ప్రతిపక్షాల డబ్బు పట్టుకోవడం, వ్యాపారులను బ్లాక్ మెయిల్ చేయడం వంటి అంశాలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటే మరిన్ని అరెస్టులు ఉండే అవకాశం ఉంది. అవసరమైతే అప్పుడు పనిచేసిన ఉన్నతాధికారుల అరెస్టులు ఉండే అవకాశాన్ని కొట్టిపారేయలేమని పోలీసు శాఖకు చెందిన ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో రోజురోజుకు కొత్త కోణాలు వెలుగు చూస్తుండడంతో అటు పోలీసు శాఖలో, ఇటు రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం సృష్టిస్తోంది.

### ఫోన్ ట్యాపింగ్ సమాచారంతో అక్రమ వసూళ్లు..

ఫోన్ ట్యాపింగ్ పాల్గొన్న పోలీసులు జిల్లాలో బెదిరింపులు, వసూళ్లకు పాల్పడినట్లు వెలుగులోకి వచ్చింది. విపక్ష నేతల ఫోన్లతోపాటు రైస్ మిల్లర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, గంజాయి వ్యాపారులు, ఇతర పరిశ్రమల యజమానుల ఫోన్లు ట్యాపింగ్ చేసినట్లుగా దర్యాప్తు బృందం గుర్తించింది. ఫోన్ ట్యాపింగ్ ఆధారంగా మిల్లర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, గంజాయి వ్యాపారులను బెదిరించి కానిస్టేబుళ్లు భారీ అక్రమాలకు పాల్పడ్డారట. అక్రమ దందాలు చేసే రైస్ మిల్లర్ల నుంచి నెలవారీ మామూళ్లు, పేకాట శిబిరాల నిర్వాహకుల నుంచి వసూళ్లు చేసేవారనే ఆరోపణలున్నాయి. రౌడీ షీటర్‌తో కలిసి టాస్క్ ఫోర్స్ పోలీసులు భూ దందాలు, సీటిల్మెంట్లు చేసినట్లు అధికారులు నిర్ధారించారు.

# కేసీఆర్‌కు ఊహించని షాక్?



(మొదటి పేజీ తరువాయి)
కొలువుదీరింది. ప్రస్తుతం ఆనాడు కేసీఆర్ అనుసరించిన వ్యూహాలనే తాజాగా రేవంత్ రెడ్డి అమలు చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను, కీలక నేతలను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. త్వరలో బీఆర్ఎస్ఎల్పీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేసే దిశగా వర్కవుట్ చేస్తున్నారు. మరోవైపు త్వరలో మండలిలో బీఆర్ఎస్ ఖాళీ కాబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. కారు పార్టీ సభ్యులు ఎవరెవరు హస్తంవైపు చూస్తున్నారు? గులాబీ పార్టీలో ఉండే ఎమ్మెల్సీలు ఎవరు? పోయేదెవరు? అనే అంశాలపై ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర చర్చ జరుగుతుంది.

**ఎమ్మెల్సీ లాబీయింగ్**

తెలంగాణలో ఇప్పటికే అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీ.. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటుకూడా గెలుచుకోలేకపోయింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీలు పార్టీమారుతున్నారన్న ప్రచారంతో గులాబీ పార్టీకి మరో టెన్షన్ మొదలైంది. మెజార్టీ ఎమ్మెల్సీలు హస్తం పార్టీలో చేరుతారన్న ప్రచారంతో బీఆర్ఎస్ పార్టీలో గుబులు మొదలైంది. గతంలో కాంగ్రెస్, టీడీపీ నుంచి కారెక్కిన వారంతా ఇప్పుడు హస్తం పార్టీ వైపు చూస్తున్నారన్న ప్రచారం జరుగుతుంది. ఓ ఎమ్మెల్సీ ద్వారా కాంగ్రెస్ పార్టీ ఆపరేషన్ చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది.బీఆర్ఎస్ పార్టీకి శాసనమండలి గండం వెంటాడుతోంది. ఈ బడ్జెట్ సమావేశాల్లోపు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు కాంగ్రెస్ గూటికి చేరుతారన్న ప్రచారం జోరుగా జరుగుతుంది. రాష్ట్రంలో అధికారం దక్కించుకున్న కాంగ్రెస్ పార్టీకి శాసన మండలిలో సభ్యుల బలం లేదు. అధికారికంగా నలుగురు సభ్యులు మాత్రమే శాసన మండలిలో కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం శాసనసభలో బిల్లులకు ఆమోదం తెలిపినా.. శాసన మండలిలో మెజార్టీ ఉన్న బీఆర్ఎస్ సభ్యులు ఆమోదం తెలిపే అవకాశం ఉండదు. అందుకే గులాబీ పార్టీ ఎమ్మెల్సీలను చేర్చుకునేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు చర్చజరుగుతుంది. ఇప్పటికే కొంతమంది బీఆర్ఎస్ ఎమ్మెల్సీలతో కాంగ్రెస్ నేతలు చర్చలు జరిపారని సమాచారం.

**నేడో, రేపో గద్వాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాంగ్రెస్‌లో చేరిక?**

గద్వాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. కార్యకర్తలతో చర్చించి ఎమ్మెల్యే నిర్ణయం ప్రకటించనున్నారు. ఈమేరకు కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్ పెద్దలతో చర్చించినట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు ముందే కృష్ణమోహన్‌రెడ్డిని రేవంత్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించినట్లు తెలిసింది. నియోజకవర్గంలోని సీనియర్ నాయకులు, కార్యకర్తలు పార్టీ మారాలని ఇది వరకే ఎమ్మెల్యేకు వినతులు చేసినట్లు తెలిసింది. జిల్లా మంత్రి జూపుడి సైతం బండ్లను పార్టీలోకి ఆహ్వానించినట్లు సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతుంది. ఇప్పటికే బండ్ల సహచర నాయకులు, అనుచరులతో చర్చలు జరిపినట్లు సమాచారం. ఇక అధికారికంగా నేడో, రేపో ప్రకటించి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్లు తెలుస్తోంది.

### బీఆర్ఎస్‌కు ఊహించని షాక్ ఇచ్చేలా ప్లాన్

రెండుమూడు నెలల క్రితమే వరంగల్ జిల్లాకు చెందిన బసవరాజు సారయ్య హస్తం పార్టీలో చేరేందుకు రెడీ అయ్యారని చర్చ జరిగింది. అదే జిల్లాకు చెందిన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ పదవీకాలం ముగుస్తుండటంతో ఆమె కాంగ్రెస్ పార్టీవైపు మొగ్గుచూపే అవకాశాలు ఉన్నాయని గులాబీ శ్రేణుల్లో చర్చ జరుగుతుంది. ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ కు రాజకీయంగా మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి అండదండలు ఉండటంతో ఆమె చేరిక లాంఛనమే కావొచ్చన్న వాదనకూడా వినిపిస్తోంది. మండలి చైర్మన్ గా ఉన్న గుత్తా సుఖేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ లో చేరారు. గులాబీ పార్టీలో ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీచేసేందుకు అవకాశం దక్కకపోవడం, ఉమ్మడి నల్గొండ జిల్లా నేతలతో సమన్వయం లేకపోవటంతో గుత్తా బీఆర్ఎస్ పార్టీలో కొనసాగడం దాదాపు అసాధ్యమన్న ప్రచారం ఉంది. ఎమ్మెల్సీలుగా ఉన్న పట్నం మహేందర్ రెడ్డి, కూచుకుళ్ల దామోదర్ రెడ్డిలు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో వారిపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తుంది. కానీ, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి దీనిపై నిర్ణయాన్ని పెండింగ్ లో ఉంచుతూ వస్తున్నారు. ఇలాంటి పరిణామాలన్నింటిని బేరీజు వేసుకుంటున్న హస్తం పార్టీ శాసన మండలిలో బీఆర్ఎస్ కు షాకిచ్చే ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. మండలి సభ్యులపై అనర్హత వేటు పడకుండా ఒకేసారి బీఆర్ఎస్ శాసనసభ మండలి సభాపక్షాన్ని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేసుకునే దిశగా పావులు కదుపుతున్నట్లు టాక్. మెజార్టీ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలను హస్తం పార్టీలో చేరేందుకు సమన్వయం చేసే బాధ్యతలు ఓ ఎమ్మెల్సీకి అప్పగించినట్లు తెలుస్తోంది. మరికొద్దిరోజుల్లోనే మండలి సభ్యుల వలసలపై స్పష్టం వచ్చే అవకాశం కనిపిస్తుంది.

## జస్టిస్ నరసింహారెడ్డి నిజాయితీగా ఉంటే కమిషన్ బాధ్యత నుంచి వైదొలగాలి : జగదీశ్‌రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్ :** రాష్ట్రంలో గత సర్కార్ జరిపిన విద్యుత్ కొనుగోళ్లపై జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి కమిషన్ విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. ఈ కమిషన్‌పై మాజీ విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పుపై ప్రభుత్వాలకు విచారణ చేసే అధికారం ఉండదని అన్నారు. జస్టిస్ నరసింహారెడ్డి వైఖరిలో మార్పు వచ్చిందని, ఆయన తీరుతో ప్రజల్లో తప్పుడు సమాచారం వెళ్లేందుకు ఆస్కారం ఉందని మండిపడ్డారు. ఆయన నిజాయితీగా ఉంటే కమిషన్ బాధ్యత నుంచి వైదొలగాలని సూచించారు. జస్టిస్ నరసింహారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి ఆరోపించారు. ఈ నెల 15 వరకు నోటీసులో గడువు ఇచ్చి 11న జరిగిన మీడియా సమావేశంలో ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారని అలా చేయడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. ఆయన ప్రవర్తనతో ప్రజల్లో తప్పుడు సమాచారం వెళ్లేందుకు ఆస్కారం ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ సంస్థల నిర్మాణంలోని ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు అంశంలో న్యాయ విచారణ పట్ల తమకు ఎలాంటి అభ్యంతరం లేదని జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ రంగంలో మొదటిసారిగా యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మిస్తోందని పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పే విషయంలో అన్ని రకాల చట్టాలను, నిబంధనలు పాటిస్తూ కేంద్ర, రాష్ట్ర అనుమతులను సాధిస్తూ ముందుకు వెళ్లామని తెలిపారు.

## మెదక్ అల్లర్లపై కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరా

**విశ్వంభర, కరీంనగర్:** మెదక్ ఘటనపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరా తీశారు. తెలంగాణ పోలీస్ ఉన్నతాధికారులకు ఫోన్ చేసి మెదక్ పట్టణంలో చోటుచేసుకున్న అల్లర్ల ఘటనపై పూర్వాపరాలను అడిగి తెలుసుకున్నారు. సమాజంలో అశాంతిని నెలకొల్పే విధంగా ఎవరు వ్యవహరించినా వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. బాధితుల పక్షాన పోలీసులు నిలబడటమే కాకుండా, తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ ఘటనలో బాధితులపై అక్రమ కేసులు బనాయించడం కానీ, అమయాకులను ఇబ్బందులకు గురిచేసే చర్యలను కానీ చేపట్టొద్దని బండి సంజయ్ స్పష్టం చేశారు. మెదక్ ఘటనలో పోలీసులు తీసుకునే చర్యల ఆధారంగానే పరిస్థితులు చక్కబడతాయని వెల్లడించారు. శాంతిభద్రతలను కాపాడే విషయంలో ఏ ఒక్కరికీ కొమ్ముకాయకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని బండి సంజయ్ కోరారు.



## పేదలకు ఉన్నత విద్యను దూరం చేస్తున్నారు

**తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్**

**విశ్వంభర, తమిళనాడు:**



నీట్ వివాదంపై తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ స్పందించారు. మెరిట్‌కు కొలమానమైన నీట్ పరీక్షి పేపర్ లీక్ ఆరోపణలతో దేశవ్యాప్తంగా నిరసనలు జరుగుతున్న క్రమంలో స్టాలిన్ స్పందిస్తూ నీట్ పరీక్ష జరుగుతున్న విధానం అసమానతలను ఎత్తిచూపుతుందన్నారు. వేల సంవత్సరాలుగా విద్య నిరాకరించినబడిన సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం మరిన్ని అవకాశాలు కల్పించాల్సిన సమయంలో దీనికి విరుద్ధంగా నీట్ పరీక్షల్లో అవకతవకలు పేదలకు ఉన్నత విద్యను దూరం చేస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ విద్యార్థి వ్యతిరేక , సామాజిక న్యాయం , పేదల వ్యతిరేక నీట్ వ్యవస్థను సమర్థించడం ఆపాలని స్టాలిన్ అన్నారు.

**సుప్రీంకోర్టు ఏం చెప్పిందంటే!**

నీట్ యూజీ పరీక్ష నిర్వహణలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై సీబీఐ విచారణకు దాఖలైన పిటిషన్ ను సుప్రీంకోర్టు శుక్రవారం స్వీకరించింది. కేంద్రం, నేషనల్ టెస్టింట్ ఏజెన్సీ(ఎన్ టీఏ) కి నోటీసులు జారీ చేసింది. అయితే కౌన్సెలింగ్ ప్రక్రియను నిలిపివేయడానికి నిరాకరించింది. నీట్ యూజీ వివాదంపై అన్ని కేసులను హైకోర్టుల నుంచి తనకు బదిలీ చేయాలని ఎన్టీఏ చేసిన అభ్యర్థనను జూలై 8న విచారించడానికి కోర్టు అంగీకరించింది.

## సీఎం, డిప్యూటీ సీఎం ఎందుకు స్పందించడం లేదు

**బీజేపీ ఎల్పీ నేత, ఎమ్మెల్యే మహేశ్వర్**



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో గత రెండు రోజుల నుంచి ఛతీస్ గడ్ విద్యుత్ కొనుగోళ్లు, యాదాద్రి, భద్రాచలం థర్మల్ ప్లాంట్ల నిర్మాణానికి సంబంధించిన ఎంక్వైరీ కమిషన్ కి మాజీ సీఎం రాసిన లేఖ సంచలనంగా మారింది. కేసీఆర్ 12 పేజీలు రాసిన లేఖలో కమిషన్ చైర్మన్ తప్పుకోవాలని కోరడం గమనార్హం. కమిషన్ విచారణను కేసీఆర్ తప్పుబట్టడంపై కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఫైర్ అవుతున్నాయి. ఈతరుణంలోనే కేసీఆర్ లేఖపై బీజేపీ ఎల్పీ నేత, ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి స్పందించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలకు సంబంధించి విచారణ చేపడుతోన్న జస్టిస్ నర్సింహా రెడ్డి కమిషన్ కి కేసీఆర్ రాసిన లేఖ అప్రజాస్వామికమని ఫైర్ అయ్యారు. ప్రభుత్వం అపాయింట్ చేసిన పవర్ కమిషన్ పై కేసీఆర్ ఎదురు దాడి చేస్తుంటే.. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించకుండా ఎందుకు సెలైంట్ ఉన్నారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జరిగిన విద్యుత్ కొనుగోళ్లలో జరిగిన అక్రమాలు బయటకు రావాలంటే కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు మహేశ్వర్ రెడ్డి.

## కేసీఆర్ నేరాన్ని అంగీకరించినట్టే..

**ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి**



**విశ్వంభర, జగిత్యాల:** ఛతీస్ గడ్ నుంచి విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు.. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్ నిర్మాణాలకు సంబంధించిన అంశాలపై విచారణకు తెలంగాణ ప్రభుత్వం జస్టిస్ నరసింహారెడ్డి నేతృత్వంలో పవర్ కమిషన్ ను నియమించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే జస్టిస్ నర్సింహా రెడ్డి కమిషన్ అప్పటి సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కి సమన్లు జారీ చేసింది. ఈ అంశాలకు సంబంధించిన వివరణ ఇవ్వాలని కోరింది. జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ నోటీసులకు కేసీఆర్ ఘాటు రిప్లై ఇచ్చారు. కమిషన్ విచారణ సరిగ్గా లేదని.. జస్టిస్ నర్సింహా రెడ్డి విచారణ నుండి తప్పుకోవాలని కేసీఆర్ లేఖలో పేర్కొన్నారు. కేసీఆర్ రాసిన రిప్లై లేఖ రాష్ట్ర రాజకీయాల్లో కాక రేపుతోంది. బీజేపీ, కాంగ్రెస్ కేసీఆర్ తీరుపై మండిపడుతున్నాయి. కేసీఆర్ లేఖపై తాజాగా కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి స్పందించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ తీరు దొంగే పోలీసులను బెదిరించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. పవర్ కమిషన్ విచారణకు కేసీఆర్ సహకరించకపోవడం అంటే ఆయన నేరాన్ని అంగీకరించినట్టేనని కీలక వ్యాఖ్యలు చేశారు. పవర్ కమిషన్ అధికారిని కేసీఆర్ నేరుగా భయపెడుతున్నారని ఫైర్ అయ్యారు. న్యాయ వ్యవస్థను కేసీఆర్ కించపరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ అరెస్ట్

- మెదక్ అల్లర్ల నేపథ్యంలో పోలీసుల ముందస్తు చర్యలు
- శంషాబాద్ ఎయిర్ పోర్టులో పోలీసులు అదుపులోకి



**విశ్వంభర, హైదరాబాద్:** బీజేపీ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మరోసారి అరెస్టయ్యారు. మెదక్ అల్లర్లను దృష్టిలో పెట్టుకుని ఆయనను ముందస్తు అరెస్ట్ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.ఇప్పటికే తాను మెదక్ వెళ్లనున్నట్లుగా రాజాసింగ్ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, ఆయన ముంబై నుంచి హైదరాబాద్ చేరుకోగానే శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఆదివారం పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు. ముందుగా పోలీసులు రాజాసింగ్‌ను పోలీసులు మియాపూర్ ఆస్పత్రికి వైద్య పరీక్షల నిమిత్తం తరలించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, మెదక్ జిల్లా కేంద్రంలో జంతువధకు సంబంధించి రెండు వర్గాల మధ్య వివాదం నెలకొంది. ఓవర్గం దాడిలో రాజ్ అరుణ్ అనే యువకుడు కత్తిపోట్లకు గురయ్యాడు. నార్సింగ్ అనే యువకుడు రాళ్ల దాడిలో గాయపడ్డాడు. దీంతో బక్రీద్ పండుగ వేళ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ అల్లర్లలో పలు దుకాణాలు, వాహనాలు ధ్వంసమయ్యాయి. ఈ నేపథ్యంలో ఐజీ రంగనాథ్, ఎస్పీ బాలస్వామిలు బందోబస్తును పర్యవేక్షించారు. బీజేపీ వర్గాలు ఆదివారం మెదక్ పట్టణ బంద్‌కు పిలుపునివ్వడంతో పోలీసులు భారీ బందోబస్తు చేపట్టినట్లు తెలుస్తోంది. అందులో భాగంగా రాజాసింగ్‌ను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు.

## జగన్ ఇంటి నిర్మాణం కూల్చివేతలో కమిషనర్‌పై వేటు!

**విశ్వంభర, హైదరాబాద్:** లోటస్ పాండ్‌లో ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు ఇంద్రభవనం లాంటి ఇల్లు ఉన్న సంగతి తెలిసిందే. అయితే ఈ ఇంటి ముందు సిబ్బంది గదులను శనివారం ఉదయం జీహెచ్ఎంసీ అధికారులు కూల్చివేశారు. రోడ్డును ఆక్రమించి కట్టారని.. రాకపోకలకు ఇబ్బంది అవుతోందనే ఫిర్యాదులు అందటంతో అందుకే కూల్చి వేస్తున్నారు తెలిపారు అధికారులు. దీంతో ఆ వార్త నిన్నటి నుంచి ఓ రేంజ్ లో సోషల్ మీడియాలో వైరల్ అయింది. జగన్‌కు అప్పుడే చిక్కులు మొదలయ్యాయని, చంద్రబాబు సూచనతోనే రేవంత్ సర్కార్ చర్యలు తీసుకుంది అంటూ పెద్ద ఎత్తున వార్తలు వచ్చాయి. అయితే ఈ కూల్చివేతలో తాజాగా ఓ అధికారిపై వేటు పడింది. ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ హేమంత్‌పై వేటు వేశారు జీహెచ్ ఎంసీ ఇన్చార్జి కమిషనర్ ఆమ్రపాలి. ఉన్నతాధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కూల్చివేసినందుకు గాను ఆయనపై చర్యలు తీసుకున్నారు. ఆయన్ను జీఏడీ సాధారణ పరిపాలన విభాగంకు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు ఆమ్రపాలి. అయితే ఇలా చర్యలు తీసుకోవడం వెనుక ఎవరి ఒత్తిడి అయినా ఉందేమో అనే అనుమానాలు కలుగుతున్నాయి.

# మోడీ సర్కార్‌లో స్పందనేది..?

**విశ్వంభర, హైదరాబాద్:** అత్యంత ప్రతిష్టాత్మకమైన నీట్ ఎగ్జామ్‌పై ఇన్ని ఆరోపణలు, అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, మోడీ సర్కార్ ఇప్పటి వరకు స్పందించకపోవడం దారుణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. కష్టపడి చదివే తమ పిల్లలు డాక్టర్ కావాలని, తల్లిదండ్రుల కన్న ఆశలపై గందరగోళంగా మారిన నీట్ పరీక్షా వ్యవహారం నీళ్లు చల్లిందని విమర్శించారు. ఓవైపు బీహార్‌లో రూ.30 లక్షల చొప్పున నీట్ ప్రశ్నాపత్రాలు విక్రయించారని, ఇప్పటికే పదుల సంఖ్యలో అరెస్టులు జరుగుతున్నాయని వార్తలొస్తున్నా కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం దారుణమని మండిపడ్డారు. ఆది నుంచి నీట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం అత్యంత నిర్లక్ష్య వైఖరిని అనుసరిస్తోందని విమర్శించారు.



**పూటకో మాట మాట్లాడుతున్నారు**

లక్షలాది మంది విద్యార్థులు ఎన్ని ఫిర్యాదులు చేసిన కేంద్రం స్పందించలేదని, పలువురు ప్రముఖులు సుప్రీం కోర్టులో కేసు వేసినా ఒక్క వివరణ కూడా కేంద్ర ప్రభుత్వం ఇవ్వలేదని కేటీఆర్ అన్నారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకునేంత వరకు కూడా కేంద్రం ఈ అంశాన్ని పట్టించుకోకపోవటం అందరికీ ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. సుప్రీంకోర్టు ప్రశ్నించిన తర్వాత కూడా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) చాలా చిత్రమైన సమాధానాలు చెప్పిందన్నారు. ఈ ఏడాది 1563 మందికి గ్రేస్ మార్కులు కలిపినట్లు చెబుతోందని, అసలు నీట్ లాంటి ఎగ్జామ్‌లకు గ్రేస్ మార్కులు కలిపే విధానమే లేదని, అయినప్పటికీ ఎందుకిలా చేశారో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. 1563 మంది విద్యార్థులకే ఎందుకు గ్రేస్ మార్కులు ఇచ్చారో.. దానికి ఏ ప్రాతిపదికను తీసుకున్నారో స్పష్టం చేయటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. +4, 1 విధానం ఉండే ఈ ఎగ్జామ్‌లో సాధ్యం కాని విధంగా కొంతమంది విద్యార్థులకు 718, 719 మార్కులు రావటం కూడా మొత్తం గ్రేస్ మార్కుల విధానంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. ఈ మొత్తం అంశం వివాదం కావటంతో ఇప్పుడు ఎన్టీఏ 1563 మందికి విద్యార్థులకు గ్రేస్ మార్కులు ఇచ్చామని వాటిని ఉపసంహరించుకున్నట్లు ప్రకటించిందన్నారు. గ్రేస్ మార్కులు పొందిన విద్యార్థులకు వాటిని తొలగించి మళ్లీ ఎగ్జామ్ రాయిస్తామని లేదంటే గ్రేస్ మార్కులు లేకుండా ఉన్న ర్యాంకింగ్‌నే జత చేస్తామని పూటకో మాట మాట్లాడుతోందని మండిపడ్డారు.. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్ ను ప్రమాదంలోకి నెట్టి ఇప్పుడు వాస్తవాలు బయటకు రాకుండా నానాతంటాలు పడుతున్నారని మండిపడ్డారు. ఒక్క గ్రేస్ మార్కుల అంశమే కాకుండా నీట్ పేపరే లీకైందంటూ వస్తున్న ఆరోపణల పై సమగ్ర విచారణ జరిపించాల్సిన అవసరం ఉందని కేటీఆర్ స్పష్టంచేశారు. దీనికి బలం చేకూరే విధంగా గుజరాత్, బీహార్ లో పోలీసులు నీట్‌లో అవకతవకలు పాల్పడిన కొంతమందిని అరెస్ట్ చేశారని, వరుసగా బయటపడుతున్న వివాదస్పద వ్యవహారాల కారణంగా నీట్ ఎగ్జామ్ తీరుపై విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులకు కూడా అనుమానాలు బలపడుతున్నాయని అన్నారు.

**కేంద్రం ఎందుకు తీసుకోలేదో చెప్పాలి**


తెలుగు రాష్ట్రాల నుంచి కూడా నీట్ ఎగ్జామ్‌ను పెద్దసంఖ్యలో విద్యార్థులు రాశారని, నీట్ లో జరిగిన గ్రేస్ మార్కులు, పేపర్ లీకేజీ ఆరోపణల కారణంగా తెలంగాణ విద్యార్థులు కూడా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. వారికి ఎలాంటి అన్యాయం జరగకుండా ఉండేందుకు మన రాష్ట్ర ఎంపీలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించే విధంగా రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు, ఎంపీలు ఎన్డీఏ సర్కారుపై ఒత్తిడి తేవాలని కోరారు. ఇంత జరుగుతున్నా ఇప్పటి వరకు ఒక్కరిపై కూడా కేంద్రం చర్యలు ఎందుకు తీసుకోలేదో చెప్పాల్సిన అవసరముంది. లక్షలాది విద్యార్థుల భవిష్యత్ కు సంబంధించిన ఈ అంశంలో వెంటనే కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, వెంటనే ప్రధాని దీనిపై స్పందించి మొత్తం అవకతవకలకు బాధ్యులెవరన్నది దేశ ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.. నీట్ లో జరిగిన అవకతవకల కారణంగా నష్టపోయిన విద్యార్థులకు ఇబ్బంది లేకుండా, వారికి న్యాయం చేసే విధంగా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఇందులో ఎన్టీఏ NTA - పాత్ర పై అత్యున్నత దర్యాప్తు సంస్థతో సమగ్ర విచారణ జరిపించాలని, పేపర్ లీకేజీలకు పాల్పడిన వారితోపాటు.. అక్రమంగా లబ్ధిపొందిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అత్యంత ప్రతిష్టాత్మక నీట్ ఎగ్జామ్ మాత్రమే కాదని, దేశంలోని ఎన్నో కాంపిటేటివ్ ఎగ్జామ్స్ ఎన్టీఏ ఆధ్వర్యంలోనే జరుగుతున్నందున తాజాగా బయటపడ్డ వివాదస్పద అంశాల కారణంగా దానిపై విద్యార్థులు నమ్మకం కోల్పోయే పరిస్థితి వచ్చిందన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాల్సిన అవసరముందన్నారు. నీట్‌లో అక్రమాల కారణంగా కష్టపడి చదివిన మన విద్యార్థులకు ఎలాంటి నష్టం జరిగినా అసలు ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. వారి తరఫున బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు.

**67 మందికి ఫస్ట్ ర్యాంక్ రావడం ఎన్నో అనుమానాలు**

ప్రతిసారి విద్యార్థులతో పరీక్షా పే చర్చా కార్యక్రమాన్ని నిర్వహించే ప్రధాని కీలకమైన నీట్ పరీక్షపై మాత్రం మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, విద్యార్థులకు, లక్షలాది మంది తల్లిదండ్రులకు భరోసా ఇవ్వాలని కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వానికి రాసిన బహిరంగ లేఖలో డిమాండ్ చేశారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా నీట్ ఎగ్జామ్‌లో ఏకంగా 67 మందికి ఫస్ట్ ర్యాంక్ రావటం ఎన్నోరకాల అనుమానాలకు తావిస్తోందన్నారు. అందులోనూ ఒకే సెంటర్ నుంచి ఎనిమిది మంది విద్యార్థులు ఏకంగా 720 మార్కులు సాధించడం చూస్తే.. పేపర్ లీకేజీ వ్యవహారం ఏ స్థాయిలో జరిగిందో అర్థమవుతోందని అన్నారు. ఒక్క మార్కు తేడాతోనే విద్యార్థుల ర్యాంకులు మారిపోతాయని, ఎంతోమంది అవకాశాలు కోల్పోతారని గుర్తుచేశారు. అలాంటిది.. ఇంత ఒకే సెంటర్‌లో ఇంతమంది విద్యార్థులకు పెద్దమొత్తంలో మార్కులు రావడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. అలాగే ఫలితాలను 10 రోజులు ముందుకు జరిపి సరిగ్గా ఎన్నికల ఫలితాల రోజే ప్రకటించటం కూడా అనేక సందేహాలకు తావిచ్చిందన్నారు.. అసలు ఈ వ్యవహారం బయటకు రాగానే పూర్తిస్థాయిలో విచారణకు ఆదేశించాల్సిన కేంద్రం ప్రభుత్వం ఎందుకు ఈ అంశాన్ని ఇప్పటిదాకా పట్టించుకోలేదని నిలదీశారు. పైగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రదాన్ అంతా సవ్యంగానే జరిగిందంటూ కప్పిపుచ్చే ప్రయత్నం చేయటం విడ్డూరంగా ఉందని ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## వెబ్ సైట్‌లో గ్రూపు-1 అభ్యర్థుల ప్రిలిమ్స్ ఓఎంఆర్ షీట్స్!

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెండు సార్లు గ్రూపు 1 పరీక్షను నిర్వహించిన విషయం తెలిసిందే. తొలిసారి నిర్వహించిన తరువాత పేపర్ లీకేజీ కారణంగా మళ్లీ ఎగ్జామ్ నిర్వహించారు. మళ్లీ నిర్వహించినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో బయోమెట్రిక్ నిర్వహించలేదనే కారణంతో కొందరూ హైకోర్టులో పిటిషన్ వేయడంతో మళ్లీ పోస్ట్ పోన్ చేశారు. అంతలోనే ప్రభుత్వం మారింది. ఈ తరుణంలో గత ప్రభుత్వం ఇచ్చిన గ్రూప్ 1 పరీక్షను రద్దు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ గ్రూప్ 1 నోటిఫికేషన్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో గ్రూప్ 1 ప్రిలిమ్స్ జూన్ 9వ తేదీన నిర్వహించిన విషయం తెలిసిందే. ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రాథమిక కీ, మాస్టర్ ప్రశ్నపత్రం కూడా రిలీజ్ చేశారు. తాజాగా అభ్యర్థుల డిజిటలైజ్డ్ ఓఎంఆర్ ఆన్సర్ షీట్లను కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ మేరకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. అభ్యర్థులు వారి లాగిన్ వివరాలతో OMR ఆన్సర్ షీట్లను కూడా పొందవచ్చని పేర్కొంది. ప్రిలిమినరీ కీ సంబంధించిన ఏమైనా అభ్యంతరాలు ఉంటే జూన్ 17వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఆన్ లైన్ లో పంపాల్సి ఉంటుందని టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. https://www.tspsc.gov.in/ వెబ్ సైట్ నుంచి డిజిటలైజ్డ్ ఓఎంఆర్ ఆన్సర్ షీట్లను పొందవచ్చు.



## జొమోటోలో సినిమా టికెట్స్ బుక్?




**విశ్వంభర, ముంబై:** ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫారమ్ జొమాటో ఇప్పుడు పేటీఎం వ్యాపారంపై దృష్టిసారిస్తోంది. మీడియా నివేదికల ప్రకారం.. దీపేంద్ర గోయల్ నేతృత్వంలోని కంపెనీ జొమోటో పేటీఎంకు చెందిన సినిమా టిక్కెట్ వ్యాపారాన్ని కొనుగోలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొత్తం ఒప్పందం కోసం రెండు కంపెనీలు చర్చలు జరుపుతున్నాయి. పేటీఎం ఈ వ్యాపార ఒప్పందం 1500 కోట్ల రూపాయలుగా తెలుస్తోంది. జొమాటో కాకుండా అనేక ఇతర కంపెనీలు కూడా పేటీఎంకు చెందిన ఈ వ్యాపారాన్ని కొనుగోలు చేయడానికి ప్రయత్నిస్తున్నాయని తెలుస్తోంది.

**బ్లింకిట్ తర్వాత రెండవ పెద్ద ఒప్పందాన్ని చూడండి**

జొమాటోకు సినిమా టిక్కెట్ల వ్యాపారం సరైనది. పేటీఎంతో కొనసాగుతున్న చర్చలు దాని ముగింపునకు చేరుకోవడంలో ఒక వేళ విజయవంతమైతే బ్లింకిట్ తర్వాత జోమాటో కొనుగోలు చేసిన రెండవ వ్యాపారం అవుతుంది. 2022లో జొమాటో బ్లింకిట్‌ను రూ.4447 కోట్లకు కొనుగోలు చేసింది. అయితే, ఈ వ్యాపారం కొనుగోళ్ల విషయంలో జోమాటో గానీ, పేటీఎం నుంచి గానీ ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. పేటీఎం మూవీస్ తన సెగ్మెంట్ లో బుక్ మైషోకి గట్టి పోటీనిస్తోంది. రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు వెంచర్ క్యాపిటల్ ఫండ్స్ యాక్సెల్, ఎలివేషన్ కూడా బుక్‌మైషోలో పెట్టుబడి పెట్టాయి. 2023 ఆర్థిక సంవత్సరంలో ఈ కంపెనీ ఆదాయం 976 కోట్ల రూపాయలు. కాగా ఈ కాలంలో కంపెనీ రూ. 85.72 కోట్ల లాభం వచ్చింది.

## నిందితుడిని వదిలే ప్రసక్తే లేదు


- చిన్నారి హత్య దురదృష్టకరం
- ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా శిక్ష విధిస్తాం
- చిన్నారి అత్యాచార ఘటనపై సీతక్క, శ్రీధర్ సీరియస్
- బాధిత కుటుంబానికి పరామర్శ
- రూ. 2. 50 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటన



**విశ్వంభర, పెద్దపల్లి:** పెద్దపల్లి రైస్ మిల్లులో చిన్నారిని చిదిమేసిన వాడిని వదిలేది లేదని మంత్రులు సీతక్క, శ్రీధర్ బాబు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. ఈ మేరకు పెద్దపల్లి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో వారు మీడియాతో మాట్లాడారు. ఈ ఘటనపై ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉందని వారు వివరించారు. బాధితులతో మాట్లాడామని, వారికి అన్ని విధాలుగా న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా నిందితుడికి శిక్ష పడేలా చూస్తామన్నారు. ఇక రైస్ మిల్లులో పనిచేస్తున్న వారి పూర్తి వివరాలు తెలుసుకునేందుకు ఇప్పటికే పోలీసులను ఆదేశించామని, త్వరలోనే పూర్తి వివరాలతో సమగ్ర నివేదిక వస్తుందని తెలిపారు. తల్లిదండ్రుల వద్ద నిద్రిస్తున్న ఆరేళ్ల చిన్నారిని ఎత్తుకెళ్లి అత్యాచారం జరపడంతో పాటు అతి కిరాతకం అన్నారు. సంఘటన సమాచారం అందగానే పోలీసులు స్పందించి గంట వ్యవధిలోని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారని, అయితే అప్పటికే చిన్నారి మృతి చెందడం బాధాకరమన్నారు. సంఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి నిందితుడిని వెంటనే పట్టుకోవడంతోపాటు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపేలా ఆదేశించారన్నారు. ఇక భవిష్యత్ లో తెలంగాణలో ఇలాంటి దారుణమైన ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని వివరించారు మంత్రులు. బాధిత కుటుంబాన్ని కూడా ఆదుకుంటామని తెలిపారు. ప్రభుత్వం తరఫున రూ.2.50 లక్షలు, రైస్ మిల్లు తరఫున రూ.5లక్షలు అందిస్తామని తెలిపారు సీతక్క. దాంతో పాటు ఒకరికి ఉద్యోగం, ఇల్లు, ఉన్న చిన్న పాప చదువులకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. ఇలాంటి అఘాయిత్యాతకు గంజాయి, డ్రగ్స్ కారణం అని వివరించారు. ఇలాంటి ఘటనలు జరగకుండా రాత్రి వేళల్లో పోలీసుల గస్తీ ఇంకా పెంచుతామని మంత్రి సీతక్క చెప్పారు.

## గురుకులాల్లో ఉద్యోగాలు.. తేదీలు ప్రకటన

- హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ లేడీ సూపరింటెండెంట్ పోస్టులు
- జూన్ 24 నుంచి 29వ తేదీ వరకు పరీక్షలు



**విశ్వంభర, హైదరాబాద్:** టీజీపీఎస్సీ కీలక ప్రకటన చేసింది. తెలంగాణలోని గురుకులాల్లో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్ 1,గ్రేడ్2, వెల్ఫేర్ అండ్ లేడీ సూపరింటెండెంట్ సహా పలు ఉద్యోగాలకు సంబంధించిన పరీక్ష తేదీలను ప్రకటించింది. జూన్ 24 నుంచి 29వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. కంప్యూటర్ బేస్డ్ విధానంలో (సీబీఆర్‌టీ) విధానంలో పరీక్షలు జరుగుతాయని స్పష్టం చేసింది. మూడు రోజుల ముందు నుంచి ఈ పరీక్షల హాల్ టికెట్లను పొందవచ్చని టీజీపీఎస్సీ సెక్రటరీ నవీన్ నికోలస్ పేర్కొన్నారు. ఈ పరీక్షలతో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులు, గిరిజన సంక్షేమ శాఖలో గ్రేడ్I, గిరిజన సంక్షేమ శాఖలో హాస్టల్ సంక్షేమ అధికారి గ్రేడ్II, షెడ్యూల్డ్ కులాభివృద్ధి శాఖ, బీసీ సంక్షేమ శాఖ, వార్డెన్ గ్రేడ్I, గ్రేడ్II, మాట్రాన్ గ్రేడ్I, గ్రేడ్II, వికలాంగులు & సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ డైరెక్టర్, లేడీ సూపరింటెండెంట్ చిల్డ్రన్ హోమ్‌లో పోస్టులు, మహిళా శిశు సంక్షేమ శాఖల్లో ఖాళీలను భర్తీ చేయనున్నారు.

## సీసీఎస్ అధికారులకు షాక్!

**12 మంది ఇన్‌స్పెక్టర్లపై బదిలీ వేటు**




**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ సీసీఎస్ లో ఉన్నతాధికారులు ప్రక్షాళన చేపట్టారు. ఏకంగా ఒకేసారి 12 మంది ఇన్ స్పెక్టర్లపై బదిలీ వేటు వేశారు. అయితే ఇటీవల సీసీఎస్ లో ఇద్దరు అధికారులు ఏసీబీకి చిక్కిన విషయం విదితమే. తరుచూ సీసీఎస్ పై ఆరోపణలతో 12 మందిని బదిలీ చేశారు. 12 మంది ఇన్ స్పెక్టర్లను మల్టీ జోన్ 2కు బదిలీ చేశారు. అయితే ఒకేసారి 12 మంది ఇన్ స్పెక్టర్లపై బదిలీ వేటు వేయడం ప్రస్తుతం ఆ శాఖలో చర్చనీయాంశంగా మారింది.

# అసలు సిసలు ప్రజాకవి

## కీ.శే. శ్రీ రావికంటి రామయ్య గుప్త

ఆయన
అక్షరంతో అలరిస్తాడు
అభినందిస్తాడు
అభిశంసిస్తాడు
ఆగ్రహిస్తాడు
ఆలోచింపజేస్తాడు
అక్రమార్కుల నిలదీస్తాడు
న్యాయానికి అండగా నిలుస్తాడు
కవిత్వమే ఊపిరిగా జీవించాడు
శిష్యులే ప్రాణంగా భావించాడు
విలువలతో విద్యను బోధించాడు
ఆ విలువలనే ఆ జన్మాంతం ఆచరించాడు.
సమాజాన్ని ప్రేమించాడు
సంఘసేవలో తరించాడు
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత
ఆయన రచనలు వెలుగులోకి వచ్చాయి.
పాఠ్యపుస్తకంలోనూ భాగమయ్యాయి.
ఈ గౌరవంతో కన్నఊరు పొంగిపోయింది.
ఆయన కవిత్వాన్ని, వ్యక్తిత్వాన్ని
మననం చేసుకుంది.
ఆయనే కీ.శే. శ్రీ రావికంటి రామయ్య గుప్త

◆◆◆

హిందు క్రైస్తవీయ ఇస్లాము మతములు
గతులు వేరు గాని గమ్యమొకటె
వేరు వేరు నదులు చేరవా సంద్రమ్ము
కల్లగాదు రావికంటి మాట

ముడుపు లేక వచ్చు మొక్కుబళ్లెవ్వియూ
శ్రీనివాసుడసలు చేతగొనడు
దైవమైన నేడు డబ్బుకు దాసుడే
కల్లగాదు రావికంటి మాట

కల్తి లేని సరకు కానరాదెక్కడ
అంత కల్తిమయమె యసలు సున్న
కల్తి రహిత జగము కాన్పించుటెన్నడో
కల్లగాదు రావికంటి మాట

తల్లి భాషను మరచిన పిల్లలంత
ఎన్ని భాషలు నేర్చిన యేమి ఫలము
గాలిలోపల మేడలు కట్టినట్లు
కరుణ జూపించు మంథెన్న కన్యకాంబ

ఇలా సామాజిక సమస్యలపై అక్షర ఖడ్గం దూసిన ప్రజాకవి కీ.శే. శ్రీ రావికంటి రామయ్య గుప్త. తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన వారు. 1936 జూన్ 17న జన్మించారు. ఉత్తమ ఉపాధ్యాయునిగా నలభై ఏళ్ల పాటు సేవలందించారు. కవిత్వాన్ని శ్వాసగా చేసుకుని జీవనం గడిపారు. ఆయన రచనలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. ఆయన శిష్యులు ఇప్పటికీ వాటిని ఆలపిస్తూ ఉంటారు. అవినీతి, బంధుప్రీతి, లంచగొండితనం,, వరకట్న దురాచారం, రాజకీయాల్లో ఏకపక్ష ధోరణులు ఇలాఎన్నింటిపైనో ఆయన అక్షర శరాలు సంధించారు. కవి నిరంకుశుడు అన్నట్లు ఆయన ఎవరినీ వదిలిపెట్టలేదు. ప్రతి సమస్యను అక్షరబద్ధం చేయడమే కాకుండా ప్రజాప్రతినిధులను, అధికారులను , ప్రభుత్వాన్ని నిలదీయడంలో ఆయన ఏనాడూ వెనకాడలేదు. ముఖస్తుతులకు, భుజకీర్తులకు ఆయన ఆమడ దూరం. యదార్థవాది లోక విరోధి అనే నానుడి ఉన్నా ఆయన మాత్రం అన్నీ యదార్థాలే చెప్పి లోకప్రియుడిగా పేరొందారు. ప్రతిఅక్షరం ప్రజా పక్షమే. అలతి అలతి పదాలతో.... నిరక్షరాస్యులకు సైతం సులభంగా అర్థమయ్యే శైలిలో సాగిన ఆయన కవిత్వం ప్రజలపై బలమైన ముద్రవేసింది.

**ప్రతి పద్యం ఒక అక్షరాయుధం**

ఆయన కవిత్వంలో సరళత్వం ఉంది. వాస్తవం ఉంది. నీతి, నిర్భీతి, నిజాయితీ ఆయన కవిత్వంలో ప్రతిధ్వనించేవి. ప్రజల సమస్యలను వారి భాషలోనే చెప్పేవారు. జనరంజకం అన్న మాట ఆయన సాహిత్యానికి అతికినట్లు సరిపోతుంది. ఆయన ఎంత సరదాగా ఉంటారో కవితంలో అంత కఠినంగా విమర్శించనూ గలరు. నిర్మొహమాటం ఆయన నైజం. తాను నమ్మిందే రాస్తారు. రాసిందే ఆచరిస్తారు. అదే ఆయన బలం. ఉన్నదున్నట్లు చెప్పిన నగ్నసత్యాలు శతకంలో కల్లగాదు రావికంటి మాట అన్నది మకుటం. ఇలా చెప్పగలగడానికి ఎంత నిజాయితీ కావాలి? ఎంత ధైర్యం కావాలి. ఈ శతకం లోని ప్రతి పద్యం ఒక అక్షరాయుధం. అందుకే ఇది ప్రజల మనస్సులో నేటికీ చిరస్థాయిగా నిలచిపోయింది. ఆయన కవిత్వంలో సరళత్వం, నిండైన మానవత్వం ఉంటాయి. ప్రజల మనిషి కాళోజీలా కవిత్వమై ఆక్రోశిస్తాడు. ప్రేమ తత్వమై ఆనందం గుప్పిస్తాడు. ఆచరణ శాలువా కప్పుకొన్నాడు.

**మంత్రకూట వేమన**

కాళోజీ లోని ధిక్కార స్వరం...వేమన పద్యాల్లోని సరళత్వం కలగలిసి ఉండటం రావికంటి కవిత్వంలోని గొప్పతనం. మాటలాడినంత తేలికగా, సహజంగా ఆటవెలది పద్యాలను చెప్పడం వల్లనేమో ఆయనను మంత్రకూట వేమన అని అంటారు. వేమన పద్యాల్లోని తీయదనం, సూటిదనం ఆయన పద్యాల్లో గమనించవచ్చు. కల్లగాదు రావికంటి మాట అన్న పద్య పాదం మంథని ప్రాంతంలో విశ్వదాభిరామ వినురవేమ అన్న రీతిలో ప్రతిధ్వనిస్తూ ఉంటుంది. ఆయన చురకలు అంటని రంగం లేదంటే అతిశయోక్తి కాదు. అప్పటికప్పుడు కవిత్వం వినిపించడం వల్లే ఆయనకు రెడీమేడ్ పోయెట్ (ఆర్.ఎం.పి) అన్న పేరు వచ్చింది. సందర్భం ఏదయినా.. సదస్సు, సమావేశం ఏదయినా అక్కడ ఆయన కవితాగానం ఉండాల్సిందే. పండగైనా ..పబ్బమైనా, బంధువుల ఇళ్లలో ఏ వేడుకైనా రావికంటి గేయమే అక్కడ ప్రధాన ఆకర్షణ. ఎంతో మందికి ఆయన అక్షరాశీస్సులు అందాయి. వివాహ వేళ ఆయన అందించిన అక్షరాభినందనలను ఎన్నో జంటలు ప్రాణప్రదంగా దాచుకున్నాయి. ఆయన ప్రశంసలు పొందిన ప్రతి నాయకుడూ ఆయనపై ఆపార భక్తి ప్రపత్తులు చాటుతుంటారు.

**మనసు నిండా మంథని**

మంథని అంటే రావికంటి అంతులేని అభిమానం. మనవారు అంటే ఎల్లలెరుగని ప్రేమ. సహచరులంటే ప్రాణం. శిష్యులు కనిపిస్తే పండుగ. పలకరిస్తే పరశవశం. కల్లా కపటం ఎరుగని నిష్కల్మష మనస్తత్వం. స్నేహపూరిత ధోరణి అయన వ్యక్తిత్వానికి వన్నెలద్దాయి. కవిత్వంలోనూ మంథని ఉనికిని చాటారు.మంథని గోదావరి తీరంలో వెలసిన గౌతమేశ్వరుని స్తుతిస్తూ 'గరళ కంఠేశ మంథెన్న గౌతమేశ ' మకుటంతో శతకం రాశారు. అలాగే 'కరుణ జూపించు మంథెన్న కన్య కాంబ' మకుటంతో మరో శతకంరాశారు. తన కుల దైవాన్ని కీర్తిస్తూ ఎన్నో భజన పాటలు కూడా రాశారు. వాసవీ మాత జీవిత చరిత్రను గేయకావ్యంగా వెలువరించారు. భగవద్గీత సారాంశం సులభంగా అర్థమయ్యేలా గీతామృతం గేయ కావ్యాన్ని రచించారు. వరదగోదావరి (ఉయ్యాల పాట), ఇందిరా విజయగీతి, కన్యకా పరమేశ్వరి శతకము , నగ్నసత్యాలు మొదలైన శతకాలు ఇంకా ఎన్నో గేయాలు, పద్యాలు, భజనపాటలు, గొల్ల సుద్దులు, నాటికలు, ఏకాంకికలు రచించారు. మంథనికి చెందిన విద్యావేత్త వరగాల భీమన్న జీవిత చరిత్రను బుర్రకథగా వెలువరించారు. పద్యాలు, శతకాలతో పాటు శ్రీ రావికంటి రామయ్య గుప్తా అనేక స్థానిక, సామాజిక సమస్యలపై ఎప్పటికప్పుడు గేయాలు రచించేవారు. వాటిలో నల్లాల బాగోతం,రామగుండం రాత్రి గండం చాలా ప్రసిద్ధి పొందాయి. వీటిని ఇప్పటికీ చాలా మంది ఉదాహరిస్తుంటారు.

"నేటి ఆధునిక కాలంలో విద్యావేత్తలు చెప్పే సిద్ధాంతాలలో ముఖ్యమైనవి ...పిల్లలను అర్థం చేసుకోవడం...వారి నేపథ్యం తెలుసుకుని వారితో ప్రవర్తించడం, వారితో ప్రేమగా వ్యవహరించడం, వారితో ముచ్చటించడం, వారితో తదానుభూతితో వ్యవహరించం మొదలైనవి. 80వ దశకంలోనే ఈ అన్నిఅంశాలను ఆచరణలో పెట్టి విద్యార్థుల మనసు దోచుకున్న మహోపాధ్యాయుడు రామయ్య సార్. ఇలా వృత్తి ధర్మాన్ని నిర్వర్తించిన ఉపాధ్యాయుడు గిజూభాయ్. మన రామయ్య సార్ కూడా మంథని గిజూభాయ్ అని చెప్పక తప్పదు" అని అంటారు ప్రముఖ విద్యావేత్త, తెలంగాణ పాఠ్యపుస్తకాల కమిటీ కో ఆర్డినేటర్ , తెలుగు అమలు కమిటీ సభ్యుడు వినాయక్. ఆయన కూడా రావికంటి రామయ్య శిష్యుడే. "రవీంద్రనాథ్ ఠాగూర్ అన్నట్లు గురుశిష్యుల మధ్య అభేదం ఉండి, భద్రత ఉన్నప్పుడే పిల్లలు నేర్చుకుంటారు. దీనికి సాక్షాత్ నిలువెత్తు రూపం మా రామయ్య సార్ "అని కూడా ఆయన అభివర్ణించారంటే వారి గొప్పతనాన్ని అర్థం చేసుకోవచ్చు. అల్లం రాజయ్య, అల్లం వీరయ్య లాంటి సాహితీ వేత్తలను, అల్లం నారాయణ, నగునూరి శేఖర్, కామోర్థుల చంద్రమోహన్ లాంటి పాత్రికేయులను, కొల్లారపు ప్రకాశరావు శర్మ, ముద్దు రాజయ్య, జక్కం వెంకట రమణ లాంటి కవులను, ఎంతో మంది ఇంజినీర్లను, మేధావులను తీర్చి దిద్దిన ఘనత శ్రీ రావికంటి రామయ్యది. దేశ విదేశాల్లో ఆయన శిష్యులు ఉన్నత స్థానాల్లో ఉన్నారు.

**రామయ్య...తెలంగాణ వేమయ్య**

జీవించి ఉన్న కాలంలో మంథని ప్రాంతానికే పరిమితమైన ఆయన ప్రతిభ తెలంగాణ ఏర్పాటు అనంతరం వెలుగులోకి వచ్చింది. తెలంగాణ ప్రభుత్వం రావికంటి రామయ్య గుప్తా రాసిన ఒక పద్యానికి ఏడో తరగతి తెలుగు పాఠ్యపుస్తకంలో చోటు కల్పించడంతో ఆయన రచనలు రాష్ట్రవ్యాప్తంగా వెలుగులోకి వచ్చాయి. ప్రపంచ తెలుగుమహాసభల సందర్భంగా వెలువరించిన ప్రత్యేకసంచికల్లోనూ వారిపై వ్యాసాలు వెలువడ్డాయి. నేటి నిజం ప్రత్యేక సంచికలో రామయ్యను తెలంగాణ వేమయ్యగా అభివర్ణించారు. అదే సమయంలో శ్రీ రావికంటి రామయ్య గుప్తా రచించిన నగ్నసత్యాలు, శ్రీ గౌతమేశ్వర శతకం పుస్తకాలు, ఆడియో సీడీల ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్ రవీంద్రభారతిలో అత్యంత వైభవంగా జరిగింది. తెలంగాణ సాహితీ ప్రముఖులు శ్రీ నందిని సిధారెడ్డి, శ్రీ అల్లం నారాయణ, శ్రీ దేశపతి శ్రీనివాస్, శ్రీ మామిడి హరికృష్ణ, శ్రీ మాడిశెట్టి గోపాల్, శ్రీ కేఎస్ అనంతాచార్యలతో పాటు అప్పటి మండలి ఛైర్మన్ స్వామిగౌడ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని రావికంటి కవిత్వం, వ్యక్తిత్వాలపై ప్రశంసల వర్షం కురిపించారు. ప్రపంచ తెలుగు మహాసభల ప్రాంగణంలో రావికంటి పద్యాలు వినిపించాలని శ్రీ స్వామిగౌడ్ సూచించారు.

**కవికి కాంస్య విగ్రహం**

ఒక మారుమూల ప్రాంతంలో ఉన్న ప్రజాకవిని ప్రభుత్వం గుర్తించి గౌరవించడంతో మంథని సమాజం ఉప్పొంగిపోయింది. ఆ మహానుభావుడు, మహా కవిని గౌరవించుకోవలసిన అవసరం ఉందని భావించి పట్టణం నడిబొడ్డున ఆయన కాంస్య విగ్రహాన్ని ప్రతిష్టించుకుంది. ప్రతి ఏటా ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తూ అభిమానాన్ని చాటుకుంటోంది. ఒక ఉపాధ్యాయుడికి, కవికి ఇంతటి గౌరవం దక్కడం చాలా అరుదైన విషయం. కాళోజీ, సినారె, అలిశెట్టి ప్రభాకర్‌ల తర్వాత తెలంగాణలో ఈ ఘనత దక్కింది కేవలం రావికంటి రామయ్య గుప్తాకే కావడం గమనార్హం. విగ్రహావిష్కరణ సందర్భంగా మంత్రకూట వేమన పేరుతో ప్రత్యేక సంచిక వెలువడింది. 50మందికి పైగా ప్రముఖులు ఆయన కవిత్వం, వ్యక్తిత్వాలపై రాసిన వ్యాసాలను ఇందులో ప్రచురించారు. రామయ్యకు కవిగా మరో అరుదైన గౌరవం కూడా దక్కింది. మంథని పురపాలక సంఘం వారు ప్రతి రోజూ ఉదయం జాతీయ గీతాన్ని ఊరంతా వినిపించే ఏర్పాటు చేశారు. ఆ వెనువెంటనే రామయ్య గుప్తా పద్యాలను కూడా రోజూ మైకుల ద్వారా వినిపించేవారు. జాతీయ గీతంతో పాటు ఆయన పద్యాలు వినిపించాలని పురపాలక సంఘం నిర్ణయం తీసుకుందంటే ఆయనను మంథని ప్రాంతం ఎంతగా గౌరవించిందో అర్థం చేసుకోవచ్చు. కొన్ని నెలల పాటు ఈ ప్రక్రియ కొనసాగింది.

**రావికంటి రామయ్య పేరిట ఏటా సాహితీ పురస్కారం**

కరీంనగర్ సమైక్య సాహితీ ఆధ్వర్యంలో శ్రీ రావికంటి రామయ్య గుప్తా స్మారకంగా మేము ఏటా సాహితీ పురస్కారాన్ని అందిస్తున్నాము. శ్రీ మాడుగుల మురళీధర శర్మ, శ్రీ అల్లం వీరయ్య, శ్రీ ఎం. నారాయణ శర్మ, శ్రీ అవుసుల భానుప్రకాశ్, శ్రీ కొల్లారపు ప్రకాశ రావు శర్మలు గతంలో ఈ పురస్కారాలు పొందారు. ఈ సంవత్సరం ప్రముఖ కవి, అవధాని శ్రీ ముద్దు రాజయ్య గారికి పురస్కారం ప్రకటించాం. జూన్ చివరి వారంలో ఈ పురస్కార ప్రదాన కార్యక్రమం జరుగుతుంది. అలాగే రావికంటి రామయ్యగుప్తా స్మారకంగా అమెరికా లో ఉంటున్న వారి తనయుడు శ్రీ రావికంటి శ్రీకాంత్ ఆర్థిక సహకారంతో మంథని బాలుర ఉన్నత పాఠశాలలో ఒక గ్రంథాలయాన్ని సైతం ఏర్పాటు చేశాం.

(మయూఖ ఆన్ లైన్ పత్రిక సౌజన్యంతో)

-రావికంటి శ్రీనివాస్,
సీనియర్ జర్నలిస్ట్, హైదరాబాద్
9908892067



(నేడు రావికంటి రామయ్య గుప్త 88వ జయంతి సందర్భంగా..)

### ఉపాధ్యాయుడిగా చెరగని ముద్ర

శ్రీ రావికంటి రామయ్య గుప్తా ఉపాధ్యాయుడిగా చెరగని ముద్ర వేశారు. వృత్తిని ప్రాణప్రదంగా భావించి నలభై ఏళ్ల పాటు సేవలందించారు. పిల్లలను అమితంగా ప్రేమించేవారు.వేలాదిమందిని ఉన్నతులుగా తీర్చిదిద్దారు. పిట్ట కథలతో... పద్యాలతో.. గేయాలతో..హాస్య గుళికలతో సాగే ఆయన బోధన పిల్లలను ఎంతో ఆకట్టుకునేది. ఆయనంటే వారికి భయం ఉండేది కాదు. ఉండేదల్లా ఇష్టమే. ఆయన క్లాస్ అంటే ఎంజయ్‌మెంట్. ఓ ఆట విడుపు. అమితమైన స్వేచ్ఛ. అందువల్లే ఆయన పాఠాలను వినడానికి ఎంతో ఆసక్తి చూపేవారు. అలా సరదాగా ఉంటూనే విషయాన్ని అర్థమయ్యేలా చెప్పేవారు. తెలుగుతో పాటు గణితం కూడా బోధించడం ఆయన ప్రత్యేకత. మరో ముఖ్యవిషయం ఏమిటంటే.. పనిచేసేది ఎంత చిన్నగ్రామమైనా..ఉండటం ఎంత కష్టమైనా అక్కడే స్థిర నివాసం ఉండేవారు. వృత్తి పట్ల ఆయన నిబద్ధతకు ఇది నిదర్శనం.భాష పట్ల అనురక్తి, కళల పట్ల ఆసక్తి కల్పించేందుకు అనేక కార్యక్రమాలు రూపొందించేవారు. పద్యాలు, పాటల పోటీలు నిర్వహించేవారు. ఏకపాత్రాభినయాలు, నాటికలు ప్రదర్శింపజేసే వారు. స్వయంగా నాటకాలు రాసి విద్యార్థులను సంసిద్ధం చేసేవారు. వీటన్నింటి కారణంగానే ఆయన శిష్యులు బహుముఖీనంగా ఎదిగారు. నేటికీ నేను రామయ్య సార్ శిష్యుడిని అని గర్వంగా చెప్పకొనే వారు ఎంతో మంది కనిపిస్తారు.

### ఎన్నెన్నో పురస్కారాలు

శ్రీ రావికంటి రామయ్య గుప్తా ఉపాధ్యాయునిగా, కవిగా ఎన్నో పురస్కారాలు, బిరుదులు పొందారు. కవిరత్న, మంత్రకూట వేమన, రెడీమేడే పోయెట్ (ఆర్ ఎం పీ) అన్నవి ఆయన బిరుదులు. ఉత్తమ ఉపాధ్యాయునిగా రెండుసార్లు ప్రభుత్వం పురస్కారం పొందారు. కరీంనగర్ జిల్లా ఆవోపా (ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్), కరీంనగర్ జిల్లా అన్నమయ్య అకాడమీ, జగిత్యాల జైశెట్టి రమణయ్య ఎడ్యుకేషనల్ ట్రస్టు. మంథని ఆర్యవైశ్య సంఘం లాంటి ఎన్నో సంస్థలు ఆయనను ఎంతో ఘనంగా సత్కరించాయి. మాజీ ముఖ్యమంత్రి శ్రీ కొణిజేటి రోశయ్య గారి చేతుల మీదుగా ఆ సన్మానాన్ని పొందారు. ఆమెరికాలోనూ కవితాగానం చేశారు. శ్రీ మాడుగుల నాగఫణి శర్మ నిర్వహించిన అవధానంలో పృచ్ఛకునిగా పాల్గొన్నారు.

# త్యాగానికి ప్రతీక బక్రీద్

## ముస్లిం సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే


పండుగలలో ముఖ్యమైనది బక్రీద్ పండగ. త్యాగానికీ, బలిదానానికి ప్రతీకయైన బక్రీద్ (ఈద్‌ఉల్‌జుహా) పండుగ ప్రతి సంవత్సరం జిల్ హజ్ మాసంలో జరుపుకోవడం అనాదిగా ఆనవాయితీగా వస్తున్నది. బక్రీద్ అంటే "బకర్ ఈద్" అని అర్థం. "బకర్" అంటే జంతువని, "ఈద్" అంటే పండుగని అర్థాలు ఉన్నాయి. జంతువును ఖుర్బాని ఇచ్చే పండుగ కాబట్టి దీనిని "ఈదుల్ ఖుర్బాని" అని కూడా అంటారు. మహ్మదీయుల క్యాలెండర్ ప్రకారం జిల్ హజ్ నెలలో బక్రీద్ పండుగ వస్తుంది. ఇస్లామీయ కేలండర్ లో ఈదుల్ అజ్ హా ఒకే దినంలో వచ్చిననూ, గ్రెగేరియన్ కేలండరులో తేదీలు మారుతాయి. దీనికి కారణం ఇస్లామీయ కేలండర్ చంద్ర మాసాన్ని అనుసరించి , గ్రెగేరియన్ కేలండర్ సూర్య మాసాన్ని అనుసరించి ఉంటుంది. చాంద్ర మాన సంవత్సరం, సూర్య మాన సంవత్సరం కంటే దాదాపు పదకొండు రోజులు తక్కువ. ప్రతి సంవత్సరం ఈదుల్ అజ్ హా ప్రపంచం లోని వివిధ ప్రాంతాలలో రెండు గ్రెగేరియన్ కేలండర్ దినములలో సంభవిస్తుంది. దీని కారణం అంతర్జాతీయ దినరేఖ ననుసరించి వివిధ ప్రాంతాలలో చంద్రవంక వేర్వేరు దినాలలో కాన రావడమే. జిల్ హజ్ నెల పదో రోజున ఈ పండుగ జరుపు కుంటారు. మహ్మదీయులు సంవత్సరాన్ని "హిజ్రీ" అంటారు. హిజ్రీ అంటే వలస పోవడం అని అర్థం. మహ్మద్ ప్రవక్త మక్కా నుంచి మదీనాకు తరలి వెళ్లడాన్ని హిజ్రీగా పేర్కొంటారు. ఏటా జిల్ మాసం (హిజ్రీ క్యాలెండర్ ప్రకారం) 9వ రోజు హజ్ (కాబా ప్రదక్షిణం), మరుసటి రోజున అనగా 10వ నాడు బక్రీద్ (ఈద్‌ఉల్‌జుహా)లో, ముస్లింలు జరుపు కోవడం సాంప్రదాయంగా ఆచరణలో ఉంది. ఇబ్రహీం త్యాగమయ జీవితాన్ని ఆదర్శంగా గొని, మనిషికున్న త్యాగ భావాన్ని సజీవంగా ఉంచేందుకు ఈ పండుగను భక్తి భావంతో జరుపుకుంటారు. హజ్రత్ ఇబ్రహీం అలైహిసలాం, విగ్రహారాధకుడైన అజర్ ఇంటిలో జన్మించాడు. అజర్ విగ్రహాలను తయారు చేసేవాడు మరియు పురోహితుడు కూడా. బాల్యం నుండీ ఇబ్రహీం ఎల్లప్పుడూ సృష్టికర్తయైన అల్లాహ్ గురించే ఆలోచించే వాడు. దైవ సందేశాన్ని అందజేయడంలో భాగంగా, ఇబ్రహీం... ఇరాన్ ను వదిలి సిరియా, పాలస్తీనా, ఈజిప్టు మొదలైన ప్రాంతాలలో పర్యటించాడు. ఈ సందర్భంగా ఆయనను అల్లాహ్ కఠిన పరీక్షకు గురిచేశారు. తన అర్థాంగియైన హాజరా మరియు కుమారుడైన హజ్రత్ ఇస్మాయిల్ అలైహి సలాం ను, త్రాగునీరు కూడా కరువైన భయంకర నిర్జన ఎడారి ప్రాంతంలో వదిలి పెట్టి, ప్రజలకు దైవ సందేశాన్ని అంద జేస్తూ ధార్మిక ప్రచార కార్యక్రమాలలో నిమగ్నమై పోవాలని అల్లాహ్ ఆదేశిస్తారు. అల్లాహ్ ఆజ్ఞను శిరసావహించి, ఆయనే తన కుటుంబాన్ని రక్షించగలరనే పరి పూర్ణ విశ్వాసంతో, భార్యా పిల్లలను వదిలేసి దైవ కార్యార్థం వెళతాడు. ఒకరోజు రాత్రి హజ్రత్ ఇబ్రహీం నిద్రలో ఉండగా, లేకలేక కలిగిన తన ఏకైక కుమారుడైన ఇస్మాయిల్ ను తన స్వహస్తాలతో బలి ఇస్తున్నట్లు కలకంటాడు. దానిని అల్లాహ్ ఆజ్ఞగా భావించి, మరునాడు వంద ఒంటెలను ఖుర్బానీగా సమర్పిస్తాడు. రెండవ రోజు కూడా అదే కలకనగా, తెల్లవారి మరో వంద ఒంటెలను ఖుర్బానీ ఇస్తాడు. ఆరాత్రికూడా అదే కల రావడంతో, అల్లాహ్ తనకిష్టమైన వస్తువునే కోరుతు న్నారని భావించి, తనప్రియాతి ప్రియమైన కుమారుడు ఇస్మాయిల్ ను ఖుర్బానీగా సమర్పించా లనుకుని , ఈ విషయాన్ని ఇస్మాయిల్ లో ప్రస్తావించగా, అందులకై ఇస్మాయిల్ సంతోషంగా అంగీకరిస్తాడు. బలి ఇవ్వడానికై సర్వం సిద్ధమై, ఇస్మాయిల్ ను పడుకో బెట్టి కత్తితో ఖండించ బోగా, అల్లాహ్ అనుమతి లేనందున కత్తి తన కోసే తత్వాన్ని కోల్పోతుంది. వారి భక్తికి మెచ్చిన అల్లాహ్, స్వర్గం నుండి జిబ్రాయిల్ అలైహి సలాం (దేవదూత) ద్వారా ఇస్మాయిల్ స్థానంలో దుంప (గొర్రె)ను ఉంచి, దానిని వారి త్యాగానికి ప్రతీకగా స్వీకరిస్తారు. ఇదే సాంప్రదాయాచరణ ప్రకారం ప్రతి సంవత్సరం ముస్లింలు త్యాగానికి ప్రతీకగా, ఇబ్రహీం త్యాగాన్ని ఆదర్శంగా గొని, బక్రీద్ నాడు గొర్రెపిల్లను బలి ఇవ్వడం జరుగుతున్నది. మనిషిలోని త్యాగభావాన్ని సజీవంగా ఉంచేందుకు, తమకిష్టమైన వస్తువును త్యాగం చేయాలనే అల్లాహ్ ఆదేశానుసారం, ఏటా పండగ సందర్భంగా గొర్రెను బలి ఇవ్వడం ఆచారంగా మారింది. ఖుర్బానీ గురించి దివ్య ఖురాన్ అనుసారం హృదయాల్లో ఉండే త్యాగ భావం, భయభక్తులు మాత్రమే అల్లాహ్ సన్నిధికి చేరుతాయి. ఖుర్బానీ పశువుల రక్తమాంసాలు చేరవు. అలాగే ఖుర్బానీ ఇచ్చే సమయంలో...దీని ప్రాణాలు సర్వం అల్లాహ్, ఇంకా సమయం వచ్చినపుడు అల్లాహ్ ఒప్పందం కోసం, ప్రేమకోసం ప్రాణాలను సైతం త్యాగం చేస్తామని విశ్వాసాన్ని దృఢ పరుచుకుంటారు.

ముస్లిం సోదరులు జీవితంలో కనీసం ఒక సారి హజ్ యాత్ర చేయడం, విధిగా నిర్ణయించబడింది. యాత్ర చేయగల వారు, కాబాదాకా వెళ్ళగలిగే స్తోమత గలవారు, ఆయన గృహానికి వెళ్ళి హజ్ చేస్తారు. దీనిని దాసులపై ఆయనకున్న హక్కుగా భావిస్తారు. త్యాగానికి ప్రతీక యైన బక్రీద్ పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకుని, ఖుర్బాని మూడు భాగాలుగా చేసి, ఇంటి వారు, బంధువులతో పాటు మూడవ భాగాన్ని పేదలకు పంచి పెడతారు.

- రామ కిష్టయ్య సంగనభట్ల
9440595494

### బక్రీద్ పండుగను వివిధ దేశాలలో వివిధ పేర్లతో జరుపు కుంటారు.

ఈద్ అల్-కబీర్ (మొరాకో, అల్జీరియా, ట్యునీషియా, ఈజిప్టు, లిబియా దేశాల్లో), 'ఫస్కా తమొఖ్ఖార్త్' (పశ్చిమ ఆఫ్రికా దేశాల్లో), 'బబ్బర్ సల్లాహ్స (నైజీరియాలో), 'సిద్వైనీ' (సోమాలియా, కెన్యా , ఇథియోపియాలో), 'బడీ ఈద్' లేదా బక్రీద్ (భారత దేశం, పాకిస్తాన్‌లో), 'వలీయా పెరున్నల్' (కేరళలో), 'ఖుర్బానీ ఈద్' (బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికాలో), 'పెరునాల్స (తమిళనాడులో), 'కుర్బాన్ బైరామి' (టర్కీ, అజర్‌బైజాన్‌లో), 'కుర్బాన్ బజ్రామ్స (బోస్నియా, హెర్జెగొవీనా, అల్బేనియా, కొసావో, బల్గేరియాలో), 'కుర్బాన్ బైరమే (తాతార్‌స్తాన్‌లో), 'కుర్బాన్ బైరామ్స (రష్యా లో), 'కుర్బాన్ ఆయిత్స (కజకస్తాన్‌లో), 'ఈద్ ఎ ఖోర్బాన్స (ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్‌లో), 'లోయే అక్తర్' లేదా 'కుర్బానియే అక్తర్స (పుష్తో భాషీయులు), 'కుర్బాన్ ఈత్స (చైనా , ఉయ్ ఘుర్ భాషలో), 'ఈదుల్ అద్ హా' (మలేషియా, సింగపూర్, ఇండోనేషియా, బ్రూనైలో) వివిధ పేర్లతో పిలుస్తారు.



# సంక్షేమ కార్యక్రమాలను ప్రజల దగ్గరకు చేరుస్తాం

- త్వరలో శాఖల వారీగా సమీక్ష నిర్వహిస్తా
- భూపాలపల్లి కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రాహుల్ శర్మ



విశ్వంభర, భూపాలపల్లి: భూపాలపల్లి జిల్లా నూతన కలెక్టర్ గా రాహుల్ శర్మ బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ, అందరం టీం వర్క్ గా పనిచేసి ప్రభుత్వ ప్రాధాన్యతలను, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేస్తామని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. జిల్లా కలెక్టర్ల బదిలీల నేపథ్యంలో శనివారం వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ గా పనిచేస్తున్న 2017 బ్యాచ్ కి చెందిన రాహుల్ శర్మను ప్రభుత్వం జయ శంకర్ భూపాలపల్లి కలెక్టర్ గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదివారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం అన్ని శాఖల జిల్లా అధికారులు కలెక్టరు కు పుష్ప గుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అన్ని శాఖల జిల్లా అధికారులు ఆయా శాఖకు సంబంధించిన నివేదికలు అందచేయాలని తెలిపారు. త్వరలో శాఖల వారీగా సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. అందరం సమన్వయంతో పని చేసి జిల్లాను అభివృద్ధి లో మోడల్ గా నిలిపేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని జయ శంకర్ భూపాలపల్లి జిల్లా నూతన కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అట్టడుగు వర్గాల ప్రజలకు చేరువ చేస్తామని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపడుతానని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాల మేరకు మనందరం పని చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజల సహకారంతో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. సిరిసిల్లలో అసిస్టెంట్ కలెక్టర్ గాను, నల్గొండ, వికారాబాద్ జిల్లాల్లో అదనపు కలెక్టర్ గా పనిచేశానని, వికారాబాద్ నుండి కలెక్టర్ గా భూపాలపల్లి జిల్లాకు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరేళ్ల చిన్నారిని చంపిన కామాంధుడిని కఠినంగా శిక్షించాలి

### బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి
### రామన్నపేట మండల మహిళ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు గాదె శోభారాణి



**విశ్వంభర, రామన్నపేట:** పెద్దపెల్లి జిల్లా లో ఆరేళ్ల చిన్నారిపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనలో కామాంధుడిని కఠినంగా శిక్షించి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల మహిళ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు గాదె శోభారాణి అన్నారు. ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన కూలీపని చేసుకునే దంపతులు చిన్నారితో కలిసి పొట్ట కూటి కోసం పెద్దపెల్లి జిల్లా, సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలోని ఒక రైస్ మిల్లులో పనిచేస్తున్నారు. ఆ మిల్లులో పనిచేసే బీహార్ కి చెందిన 28 సంవత్సరాల వినోద్ అనే నిందితుడు తల్లిదండ్రుల మధ్యలో పడుకున్న 6 సంవత్సరాల చిన్నారిని రాత్రి 11 గంటలకు ఎత్తుకెళ్లి అత్యాచారం చేసి చంపేసిన సంఘటన విదితమే. ఈ ఘటన చాలా దురదృష్టకరమని కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు గాదె శోభారాణి ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల పక్కనే పడుకున్న ఆ బాలికను కాపాడుకోలేకపోవడం చాలా బాధాకరమని అన్నారు. అదేవిధంగా రాత్రిపూట నిరంతరం పోలీసుల పర్యవేక్షణ కూడా ఉండాలన్నారు. కొందరు మద్యం, డ్రగ్స్ మత్తులో పడి ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని తెలిపారు. తొందరగా అతడికి శిక్ష పడాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా ఆ కుటుంబానికి న్యాయం జరిగే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉక్కు పాదం మోపుతుందని మహిళా కాంగ్రెస్ తరపున వారి కుటుంబానికి సానుభూతి తెలియజేస్తున్నామని గాదె శోభారాణి తెలిపారు.

## గుండె కుడివైపు ఉందని భార్యను వదిలేసిన భర్త

**విశ్వంభర, ఖమ్మం:** ఓ యువతిని పెళ్లాడిన వ్యక్తి ఆమెకు గుండె కుడివైపున ఉందనే కారణంతో వదిలేసిన ఘటన ఖమ్మంలో చోటుచేసుకుంది. ఖమ్మం నగరంలోని జయనగర్ కాలనీలో గంగా భవానీకి భాస్కరా చారితో 2018లో వివాహం జరిగింది. ఆమెకు గుండె కుడి వైపు ఉందని, ఈ విషయం దాచి ఆమెతో పెళ్లి చేశారంటూ భార్యను పుట్టింటికి పంపించివేశారు. దీంతో వారు కోర్టును ఆశ్రయించగా తీర్పు వచ్చేవరకు ప్రతినెలా రూ.10 వేలు మనోవర్తి చెల్లించాలని ఆదేశించింది. మనోవర్తి డబ్బులు అడిగేందుకు వెళ్లిన గంగాభవానీపై అత్తామామలు దాడి చేయగా ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. దీంతో బాధితురాలు బోనకల్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

## మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

**విశ్వంభర, ఆమనగల్లు:** కడ్తాల్ మండల కేంద్రంలో అనారోగ్యంతో చనిపోయిన కుటుంబాలకు జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహాయం అందజేసింది. మృతులు పోతుగళ్ల పద్మ, బండి జయమ్మ కుటుంబాలకు ఒక్కొక్కరికి 5వేల రూపాయల చొప్పున పదివేల రూపాయలు కడ్తాల్ జడ్పీటీసీ దశరథ్ నాయక్ అందించారు. వారి కుటుంబాలకు మనో ధైర్యాన్నినింపారు. ఈ కార్యక్రమంలో మంగళపల్లి నరసింహా మాజీ వార్డు సభ్యులు రామచంద్రయ్య, నాయకులు అంజి, శ్రీకాంత్, మహేష్, వెంకటేష్, శ్రీశైలం, జంగయ్య ఉన్నారు.

## లారీ ఢీకొని వ్యక్తి మృతి



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం సరిహద్దులో గల గ్రావిటీ కెనాల్ వద్ద గుర్తు తెలియని లారీ ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. కాళేశ్వరం సమీప గ్రామమైన బీరసాగర్ కు చెందిన జిట్ట మధునయ్య అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై వస్తుండగా గుర్తుతెలియని లారీ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరిపిస్తున్నారు.

## మూడు బైకులు ఢీకొని ఒకరు మృతి



**విశ్వంభర, ఆమనగల్లు:** మున్సిపాలిటీ పరిధిలోని జంగారెడ్డిపల్లి వద్ద మూడు బైకులు ఢీకొని ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. జంగారెడ్డిపల్లి వెళ్లే దారిలో కొత్తగా నిర్మిస్తున్న గవర్నమెంట్ కాలేజీ ముందు బీటీ రోడ్డుపై ప్రమాదంలో వెల్దండ మండలం అజిలాపురం గ్రామానికి చెందిన సల్వాజి యాదయ్య (45) తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే చనిపోయాడు. మరో ముగ్గురు వాహనదారులకు కూడా గాయాలయినట్టుగా స్థానిక ఎస్సై బలరాం నాయక్ తెలిపారు.

## మంచి ఆహారం అందించాలి : డీఎస్పీ రవి

**విశ్వంభర, చివ్వేంల:** వినియోగదారులకు నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించాలని రెస్టారెంట్ నిర్వాహకులకు సూర్యాపేట డీఎస్పీ జీ రవి సూచించారు. మండల పరిధిలోని అక్కలదేవి గూడెం శివారులో 365 బీబీ జాతీయ రహదారి పక్కనే శ్రీ తిరుమల ఫ్యామిలీ ఏసీ రెస్టారెంట్ ను ప్రారంభించి మాట్లాడారు. రహదారి వెంట ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆహార భద్రత నియమాలు పాటించి వినియోగదారుల మన్ననలను పొందాలని హోటల్ యాజమాన్యానికి సూచించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట రూరల్ సిఐ వై సురేందర్ రెడ్డి, హోటల్ యాజమాన్యం దాశ్యం శ్రీనివాస్, ఖమ్మంపాటి శ్రీనివాస్ గౌడ్, లీలావతి, ఉమాదేవి, సిరి, రమ్య శ్రీ, సౌమ్య శ్రీ, వైష్ణవి పాల్గొన్నారు.



## బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు.. రెండూ ఒకటే




### సీడబ్ల్యూసీ నాయకుడు చల్లా వంశీచంద్‌రెడ్డి

**విశ్వంభర, ఆమనగల్లు:** ఏఐసీసీ, సీడబ్ల్యూసీ నాయకుడు చల్లా వంశీచంద్ రెడ్డి పార్లమెంట్ ఎన్నికల తర్వాత తొలి సారి కల్వకుర్తి నియోజకవర్గానికి వచ్చిన సందర్భంగా కడ్తాల్, ఆమనగల్ మండల కేంద్రాలలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పుష్పగుచ్చాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ.. సోనియాగాంధీపై విశ్వాసంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అధికారం కట్టబెట్టారన్నారు. ప్రజాపాలన అరు గ్యారంటీల ను నిజమైన లబ్ధిదారులకు, అర్హులకు పథకాలను అందించడమే ప్రజా పాలన ఉద్దేశమని తెలిపారు. అర్హత ఉన్నవారికి ప్రభుత్వ పథకాలు అందనట్లయితే మళ్లీ దరఖాస్తుకు అవకాశం కల్పిస్తామన్నారు. మండల కార్యాలయాలకు వెళ్లి ప్రజా పాలన అధికారికి ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. బిజేపి, బీఆర్ఎస్ పార్టీలు రెండు ఒకటేనని అన్నారు. రెండు పార్టీలు కుమ్మక్కై వారు చేస్తున్న రాజకీయాలను ప్రజలు గమనించారని తెలిపారు. మొన్నటి ఎంపీ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ బిజెపితో కుమ్మక్కై బీఆర్ఎస్ నాయకులు బీజేపి పార్టీకి ఓట్లు వేయించారని తెలిపారు. ఎప్పటికైనా బీఆర్ఎస్ పార్టీ బీజేపిలో విలీనమయ్యే పార్టీనేనని అన్నారు. ఎవరూ అధైర్య పడవద్దని వచ్చే స్థానికసంస్థల ఎన్నికలలో నాయకులందరూ ఐక్యమత్యంతో ఉండి ప్రతి ఒక్కరూ కృషి చేసి గెలవడమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. తెలంగాణలో 10 ఏళ్ల తర్వాత ఇప్పుడే ప్రజా పాలన ప్రారంభమైందని, రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి చెందుతుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ, కో ఆప్షన్ సభ్యులు జాంగిర్ బాబా, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేష్, సీనియర్ నాయకులు సేవాదళ్ లక్ష్మయ్య, ఉపద్యక్షులు మల్లేష్ గౌడ్, ఎస్సీ సెల్ రామకృష్ణ, మండల అధ్యక్షుడు అశోక్, ఆమనగల్ మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, నియోజకవర్గ నాయకులు కృష్ణ నాయక్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సూర్యాపేటలో సంతోషిమాత బ్రహ్మోత్సవాలు



**విశ్వంభర, సూర్యాపేట:** సూర్యాపేట జిల్లా కేంద్రంలో శ్రీ సంతోషి మాత దేవాలయం ప్రతిష్టించి 28 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం ఘనంగా బ్రహ్మోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రధాన అర్చకులు ఇరువంటి శివరామకృష్ణ శర్మ తెల్లవారు జామున శ్రీ సంతోషిమాత, శ్రీ సత్యసాంబశివుడు, శ్రీ లక్ష్మీ గణపతి, శ్రీ ఆంజనేయ స్వామి, శ్రీ సంతాన నాగదేవత, శ్రీ మానస దేవి దేవతామూర్తులకు ప్రత్యేక పంచామృత అభిషేకాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా కలశ స్థాపన, పుణ్యాహవచనం, మంటపారాధన నిర్వహించారు. మహిళలచే సామూహికంగా కుంకుమార్చన, మల్లెల పూజ, గాజుల పూజ, పసుపు కొమ్ముల పూజ నిర్వహించారు. రుద్ర ,లలిత గణపతి హోమం నిర్వహించి మహా పూర్ణాహుతి నిర్వహించారు. శ్రీ సంతోషిమాత అమ్మవారికి త్రిభువన మహా సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహించి బ్రహ్మోత్సవం పరిసమాప్తి చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో దేవాలయ అర్చకులు భట్టారం వంశీకృష్ణ శర్మ, దరూరి కృష్ణమాచార్యులు, దేవాలయ అధ్యక్ష కార్యదర్శులు నూక వెంకటేశ గుప్త, బ్రాహ్మండ్లపల్లి మురళీధర్, కోశాధికారి పాలవరపు రామమూర్తి కమిటీ సభ్యులు పబ్బా ప్రకాష్, భెలిదే అశోక్ , కొత్త మల్లికార్జున్ దేవరశెట్టి సోమయ్య, యమా వెంకటేశ్వర్లు ,బ్రాహ్మణపల్లి బ్రహ్మయ్య, దేవరశెట్టిసోమయ్య, మహంకాళి ఉపేందర్ ,ముదిరెడ్డి లింగారెడ్డి, నూకా రవిశంకర్ బ్రాహ్మండ్లపల్లి శివప్రసాద్ ముత్యాలమ్మ, పద్మ, కవిత, లీల, సూర్య కళ, ప్రభావతి రత్నమాల కనకరత్నం, జగదీశ్వరి విజయలక్ష్మి, మమత, దేవాలయం మేనేజర్ బచ్చు పురుషోత్తం , భక్తులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట తప్పదు



### అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

**విశ్వంభర, అశ్వరావుపేట:** కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన మాట తప్పకుండా అమలు చేసి తీరుతుందని అశ్వరావు పేట నియోజకవర్గం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. ఆదివారం చంద్రుగొండ పోలీస్ స్టేషన్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారెంటీలలో ఐదు గ్యారంటీలను అమలు చేసిందని అన్నారు. గత పార్లమెంటు ఎన్నికల్లో అదేవిధంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించిన కార్యకర్తలకు నాయకులను ఆయన అభినందించారు. ఎన్నికల ముందు ఈ మండలం నుండే ప్రస్థానం మొదలుపెట్టానన్నారు. పల్లెనిద్ర, హలో శుభోదయం కార్యక్రమాలను చేపట్టినట్టు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు పార్టీ కార్యాలయం వేదికగా ఉండాలన్నారు. పార్టీ బలోపేతంకోసం ప్రతి ఒక్కరూ కృషి చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందే విధంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బానోత్ పార్వతి , ఎంపీటీసీ లంక విజయలక్ష్మి, ఆ పార్టీ నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, బొజ్యానాయక్, కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ స్టేట్ సెక్రటరీ కొదుమూరి దయాకర్ రావు, తుమ్మలపల్లి సురేష్, ఉప్పతల ఏడుకొండలు, గోవిందరెడ్డి, కేశ బోయిన నరసింహారావు, చంద్రు విజయ్, సంక శంకర్, బుంగ శ్రీను, రామారావు మనోహర్ ,రామ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ సుముఖ సుబ్రహ్మణ్యేశ్వర సేవా నిధి మందిరం దేవాలయం నూతన కమిటీ ఎన్నిక

**విశ్వంభర, మన్సూరాబాద్ :** రంగారెడ్డి జిల్లా మన్సూరాబాద్ డివిజన్ కామినేని హాస్పిటల్స్ ప్రశాంత్ నగర్ కాలనీ శ్రీ సుముఖ సుబ్రహ్మణ్యేశ్వర సేవా నిధి మందిరం నూతనంగా నిర్మాణం జరిగింది. ఈ ఆలయంలో శ్రీ వర సిద్ధి వినాయకుడు, శివుడు, శ్రీ సుముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, ఆంజనేయ స్వాములు కొలువు ధీరారు. అనతి కాలంలోనే ఈ ఆలయానికి భక్తుల రద్ధి పెరిగింది. పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి స్వామి వార్లను దర్శించుకుంటున్నారు. ఈ శుభ సందర్భంగా ఆలయానికి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ గా రాధాబాయి దర్బ, ఈ.ఓ ప్రసాద్ దర్బ, రమేష్ గండేల (అధ్యక్షుడు), లబిశెట్టి లింగమయ్య (ఉపాధ్యక్షుడు), యల్లపంతుల ఉమా మహేశ్వర్ (ప్రధాన కార్యదర్శి), సీతారామయ్య (జాయింట్ సెక్రటరీ), వనం జనార్ధన్ (కోశాధికారి), రవీంద్రనాథ్ (సలహాదారు), కార్యనిర్వాహక సభ్యులుగా రామ్ మోహన్, యుగేంధర్ రెడ్డి, వనం స్వామి, డి.ప్రతాప్ రెడ్డి, జ్ఞానేశ్వర చారి, భిక్షపతి, వెంకటేష్, శంకర్ రావు, గిరీష్, గురుమూర్తి, నర్సింహ, పరమేష్ గౌడ్, మల్లికార్జున్, సీతారాం రెడ్డి, సైదిరెడ్డి, డా. శంకర్, జి. రమేష్, బి. మోహన్ రెడ్డి, కె. రవి కిరణ్, సాయి కుమార్, రవీంధర్ యాదవ్, లబిశెట్టి అరవింద్, లబిశెట్టి సంతోష్‌లను సభ్యులను ఎన్నుకున్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**విశ్వంభర, సూర్యాపేట:** 30 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులందరూ ఒకే వేదికపై కలిశారు. సూర్యాపేట మండలం యండ్లపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 19941995 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులందరూ ఆత్మకూర్ ఎస్.మండలం నెమ్మికల్ వద్ద గల దండు మైసమ్మ ఫంక్షన్ హాల్ లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. ఫాధర్స్ డే రోజున వారందరూ ఒకే వేదికపై కుటుంబ సమేతంగా కలిసి అలనాటి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ రోజంతా సరదాగా గడిపారు. పూర్వ విద్యార్థులందరూ డీజే పాటలతో డ్యాన్సులు చేస్తూ సందడి చేశారు. వివిధ రకాల వంటలతో అందరూ ఒకే చోట భోజనాలు చేస్తూ సంతోషంగా గడిపారు. అలనాటి గురువులైన రాఘవరెడ్డి, సులోచన, వెంకటేశ్వర్లు, సురేందర్ రెడ్డి, కృపాకర్ రెడ్డి, సీతారాములు తనయుడు జనార్దన్ చారిలను పూల దండలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

## నర్సయ్య కుటుంబానికి ఆర్థిక సాయం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం)మండలం కూరెళ్ళ గ్రామంలో నాలుగు రోజుల క్రితం మరణించిన కూరెళ్ళ నరసయ్య కుటుంబానికి బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షులు, కూరెళ్ళ మాజీ సర్పంచ్ భాష బోయిన ఉప్పలయ్య యాదవ్ ఆర్థిక సహాయం చేశారు. ఆయన వారి కుటుంబాన్ని పరామర్శించి 5,000 రూపాయలు అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఎరుకల స్వామి, గడ్డం అశోక్, కొత్తోజు యశ్వంత్, మోతె యాదిరెడ్డి, భాష బోయిన యాద మల్లయ్య, ఉప్పల నరసయ్య, కూరెళ్ళ రమేష్, హనుమంతుల రమేష్, ఉప్పల యాదయ్య, ఉప్పల నవీన్, తుమ్మలగూడెం సాయికిరణ్, కూరెల్ల మణికుమార్, కాకలగడ్డ సత్తయ్య, నార్కెట్పల్లి ఐలయ్య, కమ్మాలపల్లి రాములు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలి

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** తెలంగాణ రాష్ట్రంలో విద్య హక్కు చట్టాన్ని వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు కూరెళ్ళ రమేష్ డిమాండ్ చేశారు. ఎయిడెడ్ ప్రైవేట్ పాఠశాలల్లో ఎస్సీ ఎస్టీ పిల్లలకు 20 శాతం సీట్లు భర్తీ చేయాలని కోరారు. వివిధ రాష్ట్రాల్లో విద్యా హక్కు చట్టం అమల్లో ఉందని, అలాగే తెలంగాణ రాష్ట్రంలో కూడా విద్య హక్కు చట్టాన్ని అమలు చేసి పేద పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ఉన్నత విద్యకు అవకాశం కల్పించాలన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని, వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు వారు పనిచేసే ప్రాంతాల్లో నివాసం ఉండాలని అన్నారు. వారి పిల్లలను కూడా గ్రామీణ ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం చదివేటట్లు చూడాలని, ప్రతి మండలానికి ఒక ఎంఈఓ ఉండేటట్లు చూడాలని అన్నారు. పలు అంశాలపై ఈనెల 19వ తేదీన ఎమ్మార్పీఎస్ వేడిపాపన్న నాయకత్వంలో సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో రాష్ట్రస్థాయి సమావేశం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశాన్ని జయప్రదం చేయడం కోసం యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర జిల్లా మండలాల కమిటీలు, ఎమ్మార్పీఎస్ అనుబంధ విద్యార్థి యువసేన మహిళా కమిటీ సభ్యులు హాజరుకావాలని కూరెల్ల రమేష్ మాదిగ పిలుపునిచ్చారు.

# వండిన వెంటనే ఆహారాన్ని తినక పోతే చాలా డేంజర్



విశ్వంభర, హైదరాబాద్ : ఈ రోజుల్లో ఉరుకులు, పరుగుల జీవితాలతో చాలా మంది సమయానికి భోజనం చేయట్లేదు. అంతే కాదు ఉదయం ఎప్పుడో వండుకున్నదాన్ని ఏ మధ్యాహ్నమో, సాయంత్రమో, ఇంకొంత మంది అయితే ఏ అర్ధరాత్రో తినేస్తున్నారు. అయితే ఇలా వండిన వెంటనే తినకపోతే చాలా ప్రమాదం అని.. అనారోగ్య సమస్యలు వస్తాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO ) తెలిపింది. వండిన వెంటనే తిన్న వారే ఆరోగ్యంగా ఉంటారని చెబుతోంది ప్రపంచ ఆరోగ్య సంస్థ. చాలా మంది తినడంలో ఆలస్యం చేస్తూ ఉంటారు. ఇంట్లోని మహిళలు ఎప్పుడో వంట చేసి రెడీగా ఉంచినా.. రకరకాల పనుల వల్ల.. ఇతర విషయాల వల్ల ఆలస్యం అవుతూ ఉంటుంది. దీని వల్ల అనారోగ్యానికి గురవుతామని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. డబ్ల్యూహెచ్ఓ నివేదిక ప్రకారం.. ప్రతి ఏడాది ప్రపంచ వ్యాప్తంగా 60 కోట్ల మంది ప్రజలు కలుషిత ఆహారం తిని అనారోగ్య పాలు అవుతున్నారని చెబుతోంది. మంచి ఆహారాన్ని తీసుకోకపోవడం వల్ల కూడా ఇలాంటివి వస్తాయని చెబుతోంది. కాబట్టి వండిన వెంటనే తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని చెబుతోంది ప్రపంచ ఆరోగ్య సంస్థ. ఎందుకంటే వంట వండే సమయంలో ఆహారంలో ఉండే హానికరమైన బ్యాక్టీరియా దాదాపు నాశనం అవుతుంది. కానీ ఆహారాన్ని చల్లార్చితే మళ్లీ అందులో బ్యాక్టీరియా వృద్ధి చెందుతుందంట. అందుకే ఆహారం వేడిగా ఉన్నప్పుడే తినేయాలి.



## బాధితుడికి ఎల్ఓసీ అందజేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి

**విశ్వంభర, ఆమనగల్లు:** సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరయిన రూ.2.60 లక్షలు తన నివాసంలో బాధిత కుటుంబ సభ్యులకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అందించారు. నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండలం పెద్దాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న తునికి బండ తండాకు చెందిన వద్యావత్ గోపాల్ తండ్రి వెంకటయ్యకు ఎమ్మెల్యే ఎల్ ఓ సి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కేశమల్ల కృష్ణ, ప్రవీణ్ నాయక్,అనిల్ కుమార్, రాజు నాయక్,రాజేష్ నాయక్,పంతు నాయక్, తదితరులు ఉన్నారు.

## ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ సీజ్, డ్రైవర్ అరెస్ట్



**విశ్వంభర, ఆమనగల్లు:** మాడ్గుల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇర్విన్ లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ ను సీజ్ చేసి డ్రైవర్ ను అరెస్ట్ చేసినట్లు ఎస్.ఐ విష్ణు వర్ధన్ రెడ్డి తెలిపారు. వివరాల ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున పోలీస్ పెట్రోలింగ్ ఇర్విన్ గ్రామ చివరలో గిరికొత్తపల్లి గ్రామం వైపు నుండి ఇర్విన్ వైపుకు అనుమానాస్పదంగా వచ్చిన ట్రాక్టర్ ను ఆపి తనిఖీ చేశారు. AP 22 J 2869, ట్రాలీ నెంబర్ AP 22 J 2870 గా ఉన్న ట్రాక్టర్ లో ఎటువంటి పరిమితులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ ఇర్విన్ గ్రామానికి చెందిన ఒగ్గు ఆనంద్ తండ్రి కృష్ణయ్యను విచారించగా, అతడు ట్రాక్టర్ ఓనర్ అయిన ఇర్విన్ గ్రామానికి చెందిన పగడాల రవి చెప్పడం వల్లనే ఇసుకను దొంగతనంగా తరలిస్తున్నామన్నారు. దీంతో పోలీస్ లు ట్రాక్టర్ ను ట్రాలీలను సీజ్ చేసి, ట్రాక్టర్ డ్రైవర్, యజమాని పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుత్ ప్రమాదంలో ఆపరేటర్ మృతి



**విశ్వంభర, నేరేడుచర్ల** : విద్యుత్ ప్రమాదంలో ఆపరేటర్ మృతి చెందిన ఘటన నేరేడుచర్ల మండలం కల్లూరు గ్రామ పరిధిలో చోటుచేసుకుంది. గ్రామంలో పొలం దగ్గర కరెంటు పనులు చేస్తుండగా మండవ నాగేశ్వరరావు( 40) అక్కడికక్కడే మృతి చెందారు. గరిడేపల్లి మండలం తాల్లా మలాపురం గ్రామానికి చెందిన నాగేశ్వరరావు గడ్డిపల్లి సబ్ స్టేషన్ లో విద్యుత్ ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తూ నేరేడుచర్ల పట్టణంలో నివసిస్తున్నారు.

## కుటుంబ కలహాలతో పురోహితుడి ఆత్మహత్య

**విశ్వంభర, రాజన్న సిరిసిల్ల** : జిల్లాలోని ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామానికి చెందిన పురోహితుడు కుటుంబ కలహాలతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రాచర్ల గొల్లపల్లి గ్రామానికి చెందిన పచ్చకాంతం సంతోష్ అలియాస్ హైటెక్ పంతులు కొంత కాలంగా కుటుంబ కలహాలతో తీవ్ర బాధపడుతున్నాడు. ఇతను దమ్మనపేట గ్రామంలో ఓ వ్యక్తిని హత్య చేసిన సంఘటనలో ప్రధాన ముద్దాయిగా ఉన్నాడు. ఇదే క్రమంలో భార్య భర్తల మధ్య తీవ్ర కలహాలు ఏర్పడి ఆదివారం రోజు తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రమాకాంత్ తెలిపారు.

## నదిలో యువకుడు గల్లంతు

విశ్వంభర/కాళేశ్వరం: భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం త్రివేణి సంగమ గోదావరి నదిలో వరంగల్ పట్టణానికి చెందిన గరికపాటి అఖిల్ (19) అనే యువకుడు స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. సమాచారం తెలుసుకున్న కాళేశ్వరం ఎస్ఐ భవాని సేన్ గోదావరి తీరానికి చేరుకొని బోటులో గల్లంతైన ప్రాంతాన్ని పరిశీలించాడు. గోదావరిలోకి దిగి స్థానిక జాలర్లకు సూచనలు చేశారు. జాలర్లు గాలింపు చర్యలు చేపడుతున్నారు.



## పోడు భూముల రైతులకు అండగా ఉంటా



**పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**

**విశ్వంభర, మణుగూరు** : పోడుభూములను నమ్ముకొని సాగు చేసుకుంటున్న పోడు రైతులకు అండగా ఉంటానని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు.ఆదివారం మండలంలోని ప్రజా భవన్ కార్యాలయంలో అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు పోడు రైతులు ఎమ్మెల్యే పాయంను మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను వివరించారు. అనంతరం పోడుభూములపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోడు రైతులతో మాట్లాడుతూ... పోడు సాగు చేసుకుంటున్న భూములలో ఫారెస్ట్ అధికారులు కందకాలు తోవ్వకుండా చూస్తానని రైతులకు హామీ ఇచ్చారు. పోడు భూముల పట్టాల గురించి త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెల్లుతారన్నారు. గ్రామాలలో ఉన్న పలు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆదివాసీ నాయకులు,పోడు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అసోసియేషన్ ఆర్థిక సాయం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండల కేంద్రంలో బాధిత కుటుంబ సభ్యులకు గ్రామ పోలీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐదువేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. కొద్ది రోజుల క్రితం వనం సుగుణమ్మ (36) అనారోగ్యంతో మరణించగా మృతురాలి కుటుంబ ఆర్థిక పరిస్థితిని చూసి చలించి, పరామర్శించారు. గ్రామంలో నిరుపేద కుటుంబాలకు, విద్యార్థులకు, గ్రామ అభివృద్ధి కోసం మా అసోసియేషన్ సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మల్లం రమేష్, మేకపోతుల స్వామి తెలియజేశారు. ఈ కార్యక్రమం లో అసోసియేషన్ సభ్యుడు ఆరే శ్రీకాంత్, నేతాజీ యువజన మండలి ప్రధాన కార్యదర్శి ఎలిమినేటి మురళీ, యువజన మండలి సభ్యులు యాస మహేందర్ రెడ్డి, గుండేగాని కిరణ్ గౌడ్,యాస సుభాష్ రెడ్డి,గడ్డం సతీష్ గౌడ్,చెరకు శివ గౌడ్, గుండెగాని వినయ్ గౌడ్ పాల్గొన్నారు.


## భక్తులతో కిటకిటలాడిన మల్లికార్జున స్వామి ఆలయం



**విశ్వంభర, కొమురవెల్లి** : సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది.

శనివారం నుంచి ఆలయానికి చేరుకున్న భక్తులు రాత్రి కొమురవెల్లిలోని దేవాలయ సత్రాలలో, ప్రయివేట్ గదులలో బసచేసి ఆదివారం వేకువజామున లేచి కోనేరులో స్నానం ఆచరించి మల్లికార్జున స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన రేణుక ఎల్లమ్మ, నల్ల పోచమ్మ అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ఈ ఓ బాలాజీ, ఏ ఈ ఓ లు,గంగ శ్రీనివాస్, బుద్ధి శ్రీనివాస్, ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, ఆలయ సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు భక్తులకు సేవలందించారు.


## కేసీఆర్ లేఖ గురించి జస్టిస్ నరసింహా రెడ్డి కీలక వ్యాఖ్యలు



**విశ్వంభర, హైదరాబాద్** : తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పంపించిన లేఖ కమిషన్ కి అందిందని.. పవర్ ఎంక్వైరీ కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి తెలిపారు. తాజాగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. కేసీఆర్ లెటర్ లో పలు అంశాలను ప్రస్తావించారు. చత్తీస్ గడ్ పవర్ పర్చేస్, భద్రాద్రి యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ అంశాల్లోని కొన్ని ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. కేసీఆర్ చెప్పిన విషయాలను నిపుణుల కమిటీతో చర్చించాల్సి ఉంది. లెటర్లో కేసీఆర్ చెప్పిన అంశాలను పరిశీలన చేస్తున్నాము. ఎవరికైనా తమ అభిప్రాయాలను నిస్సందేహంగా చెప్పే స్వేచ్ఛ ఉంటుంది. కేసీఆర్ తెలిపిన అభ్యంతరాలపై పున పరిశీలన జరుపుతాము. జరిగిన పరిణామాలను మాత్రమే మీడియా ముఖంగా నేను వివరించడం జరిగింది. ఎవరి అభ్యంతరాలు వారికి ఉండటం సహజం. ఇటు కేసీఆర్ చెప్పిన వివరాలకు వాస్తవాలకు సరిపోల్చాల్సి ఉంది. వాస్తవాలపై BHEL ప్రతినిధులని కూడా వివరాలు అడుగుతాం. మంగళవారం కేసీఆర్ పంపిన లెటర్ పై సమీక్ష,విశ్లేషణ జరుపుతామని వెల్లడించారు. అందుకు అనుగుణంగానే తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు.

## చిన్నారులకు అల్లర్ల గురించి ఎందుకు బోధించాలి? ఎన్సీఈఆర్టీ డైరెక్టర్

**విశ్వంభర, హైదరాబాద్** : తొమ్మిది నుంచి 12వ తరగతులకు సంబంధించిన సిలబస్‌లో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్... ఉద్యమాలు, రాజకీయ పార్టీలు, ప్రజాస్వామ్యం ముందున్న సవాళ్లు పాఠాలు, బాబ్రీ మసీదు కూల్చివేత వంటి మరికొన్ని అంశాలు తొలగించింది. దీంతో కాషాయీకరణ చేస్తున్నారంటూ వచ్చిన ఆరోపణలపై ఎన్సీఈఆర్టీ డైరెక్టర్ దినేశ్ ప్రసాద్ సక్లానీ రియాక్ట్ అయ్యారు. "పాఠ్య పుస్తకాల ద్వారా చిన్నారులకు అల్లర్ల గురించి ఎందుకు బోధించాలి? సమాజంలో నేరాలు, హింస ఎలా సృష్టించాలి? బాధితులుగా ఎలా మారాలి? అనే విషయాలను మన విద్యార్థులకు బోధించాలా? ఇదేనా విద్య ముఖ్య ఉద్దేశం అని ప్రశ్నించారు . అసలు అల్లర్ల గురించి చిన్న వయసులో వారికెందుకు." అని ఓ మీడియాకి ఇంటర్వ్యూలో దినేశ్ సక్లానీ తెలిపారు.





## ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరం

**విశ్వంభర, ఆమనగల్లు:** యుద్ధ విద్య కరాటే ప్రతి ఒక్కరికి , తమ ఆత్మ రక్షణ కోసం ఎంతో అవసరమని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వెల్దండ మండలం కొట్ర గ్రామంలో ఆదివారం కరాటే మాస్టర్ నీరటి కుమార్ పర్యవేక్షణలో శిక్షణ పొందిన విద్యార్థులకు బెల్టుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. గోలి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు బెల్టులు అందజేశారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. మాస్టర్ కుమార్ తన సొంత ఖర్చులతో ఉచితంగా కరాటే నేర్పించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కొట్ర గ్రామ సేవా సమితి అధ్యక్షుడు రవీందరరావు, సీనియర్ పాత్రికేయులు నాగరాజుగౌడ్, శివరాణి, ఆంజనేయులు, వెంకటయ్య, సహదేవ్, జీఎస్ఆర్ నాయకులు చలిచీమల సతీష్ ఉన్నారు.

## నామినేటెడ్ పోస్టులు ఎవరికి దక్కెనో?

**విశ్వంభర, జగిత్యాల:** కోరుట్ల నియోజకవర్గం, మెట్పల్లికి చెందిన సుజిత్ రావు, కొమిరెడ్డి కరంచంద్ జువ్వడి నర్సింగరావు ముందు నుంచి కాంగ్రెస్ వర్గీయులుగా ఉన్నారు. వీరిలో సుజీత్ రావు, కరంచంద్ ఎమ్మెల్యేలు బరిలో నుండి తప్పుకొని నర్సింగరావు కు మద్దతు తెలిపారు. అలాగే డాక్టర్ జేఎన్ వెంకట్ బీజేపీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాటి పెల్లి శ్రీనివాస రెడ్డి బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలో దూకారు. కల్వకుంట్ల సుజిత్ రావు మంత్రి శ్రీధర్ బాబుకు అత్యంత సన్నిహితుడు మరియు జువ్వాడి నర సింగారావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సన్నిహితంగా ఉంటాడు. జెండా ఒక్కటే.. వర్గాలు వేరు, కుర్చీలాటలో ఎవరిది పైచేయో తెలియక ఆయా వర్గాల నాయకులు అయోమయంలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీలో ముందు నుంచి పనిచేసిన వారికే ఎవరికి వస్తుందో తెలియదనే మీమాంశతో ఉంటే నామినేటెడ్ పోస్టుల కోసం పార్టీలు మారిన నాయకుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది.

## పెట్రోల్ ధరల పెంపుపై కర్ణాటక సీఎం సంచలన వ్యాఖ్యలు



**విశ్వంభర, కర్ణాటక:** కర్ణాటక ప్రభుత్వం పెట్రోల్ ధరలను పెంచిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించుకున్నారు. పెట్రోల్ ధరల లీటర్‌కు రూ. 3 పెంచామని, అయినప్పటికీ దేశంలోని ఇతర రాష్ట్రాల కంటే కర్ణాటకలో ఇంధన ధరలు ఇప్పటికీ తక్కువగానే ఉన్నాయని చెప్పారు. 'కర్ణాటక ప్రభుత్వం పెట్రోల్‌పై 29.84 శాతం, డీజిల్‌పై 18.44 శాతం వ్యాట్‌ను పెంచింది. ఈ పెంపు నిర్ణయం తర్వాత కూడా రాష్ట్రంలో ఇంధనంపై పన్నులు ఇతర దక్షిణాది రాష్ట్రాలు, మహారాష్ట్రల కంటే తక్కువగానే ఉన్నాయని 'సిద్ధరామయ్య ఎక్స్‌లో ట్వీట్ చేశారు. ఇదే సమయంలో బీజేపీపై ఆయన విమర్శలతో విరుచుకుపడ్డారు. గతంలో రాష్ట్ర వనరులను బీజేపీ ఇతర రాష్ట్రాలకు మళ్లించిందని ఆరోపించారు. గత రాష్ట్ర బీజేపీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌లపై వ్యాట్‌ను తగ్గించింది. అయితే, కేంద్ర ప్రభుత్వం తన సొంత పన్నులను పెంచింది. ఈ అవకతవకల వల్ల కర్ణాటకకు ఆదాయం భారీగా తగ్గింది. కేంద్రం ప్రభుత్వం కన్నడిగులను మోసం చేసి తన ఖజానాను నింపుకుందని విమర్శించారు. తాజాగా పెంచిన ఇంధన ఛార్జీలను రాష్ట్ర ప్రభుత్వం ప్రజా రవాణాకు నిధులు సమకూర్చేందుకు వినియోగిస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు.

## గంగానదిలో పడవ బోల్తా.. ఆరుగురు గల్లంతు



**విశ్వంభర, బీహార్** : గంగానదిలో పడవ బోల్తా పడి ఆరుగురు గల్లంతు అయ్యారు. ఈ తీవ్ర విషాదం బీహార్ లో జరిగింది. బీహార్ రాష్ట్రంలోని రాజధాని పాట్నా వరద ప్రాంతంలో ఉమానాథ్ ఘాట్ వద్ద గంగా దసరా రోజు స్నానాలు చేసేందుకు చాలా మంది భక్తులు వెళ్తుంటారు. గంగానదికి ఇరువైపులా భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. నది ఒడ్డుకు వెళ్లేందుకు ప్రజలు పడవలను ఉపయోగిస్తున్నారు. ఇందులో భాగంగా ఓ పడవలో 17 మంది స్నానాలు ఆచరించేందుకు వెళ్లారు. అయితే పడవ కాస్త లోతట్టు ప్రాంతానికి రాగానే బోల్తా పడింది. దాంతో అందులో ఉన్న అందరూ నదిలో పడిపోయారు. ఇందులో 11 మంది ఈదుకుంటూ ఒడ్డుకు చేరకున్నారు. మిగతా ఆరుగురు మాత్రం నదిలో గల్లంతు అయిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే పడవ బోల్తా పడగానే.. స్థానికంగా ఉన్న మిగతా బోటు డ్రైవర్లు గల్లంతు అయిన వారిని వెతకడం ప్రారంభించారు. ఆ తర్వాత ఎస్డీఆర్ ఎఫ్ బృందాన్ని పిలిచారు. ఇక గల్లంతు అయిన వారి కుటుంబీలకు సమాచారం ఇవ్వగా.. వారు బోరున విలపిస్తున్నారు. ఘాట్ వద్ద పెద్ద సంఖ్యలో ప్రజలు గుమిగూడారు.

## మెదక్‌లో కొనసాగుతున్న బంద్

**పోలీస్ దిగ్బంధంలో మెదక్**

**విశ్వంభర, మెదక్** : మెదక్ జిల్లా కేంద్రంలో బీజేపీ బంద్ విజయవంతంగా కొనసాగుతోంది. శనివారం జరిగిన ఇరు వర్గాల మధ్య జరిగిన గొడవలో ఒకరి పై కత్తి దాడికి నిరసనగా మెదక్ బంద్ కు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా మెదక్ లోని అన్ని హోటల్స్, ఇతర వ్యాపార సంస్థలు మూసి ఉంచారు. శనివారం జరిగిన దాడిని దృష్టిలో పెట్టుకొని పోలీసులు రాత్రి నుంచే భారీ పోలీస్ బలగాలను దించారు. మెదక్ జిల్లా కేంద్రం పూర్తిగా పోలీస్ దిగ్బంధంలో ఉంది. ఎక్కడ చూసినా పోలీస్ లే ఉన్నారు. బీజేపీ ఇచ్చిన బంద్ నేపథ్యంలో బీజేపీ నేతలను పోలీసులు అర్ధరాత్రి అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ప్రస్తుతం మెదక్ లో బంద్ ప్రశాంతంగా కొనసాగుతోంది. పట్టణంలో అంతా ప్రశాంతంగానే ఉన్నట్టు ఐజీ రంగనాథ్ వెల్లడించారు. ఎస్పీ బాల స్వామి తో పాటు ఇతర పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణలో ఉన్నారు.



# రామోజీరావు జీవితమే ఒక సందేశం

- రామోజీ యుగం చరిత్రలో ఒక సందేశాత్మక అధ్యాయం
- చరిత్రలో ఆయన సువర్ణాధ్యాయం లిఖించుకున్నారు
- మీడియా రంగం లో విప్లవాత్మక చర్యల పితామహుడు
- రామోజీ సంస్మరణ సభలో తెలంగాణ బీసీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ వకుళా భరణం కృష్ణ మోహన్ రావు



**విశ్వంభర, హైదరాబాద్ :** నిబద్ధత, అంకితభావం, క్రమశిక్షణ, కఠోరపరిశ్రమలతో ఎంతటి ఉన్నతినైనా సాధించవచ్చునని చేతలతో నిరూపించుకున్న ఆదర్శజీవి రామోజీరావు అని తెలంగాణ బీసీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు అన్నారు. జీవితంలో ఎదగడానికి కులం, మతం, ధనం ఏవీ అడ్డుకావని, అడుగుపెట్టిన ప్రతి రంగంలో విజయ దుందుభి మోగించి భవిష్యత్ తరాలకు కొత్త బాటలు వేసిన మహా మనీషి రామోజీరావు అని ఆయన పేర్కొన్నారు.

ఆదివారం స్థానిక నాగోల్ లోని విజన్ వి.వి.కె. సంస్థ రాష్ట్ర కార్యాలయం లో అధినేత వి.విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈనాడు గ్రూప్ సంస్థల అధిపతి రామోజీరావు సంస్మరణ సభ ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద పుష్పాలు సమర్పించి పలువురు అంజలి ఘటించారు.

ఈ కార్యక్రమంలో నగరం నలుమూలల నుండి వచ్చిన అభిమానులు, పాత్రికేయులు, వివిధ స్వచ్ఛంధ, కళా సంస్థల ప్రతినిధులు, తెలుగు భాషాభిమానులు, కవులు, కళాకారులు పాల్గొన్నారు. రామోజీ రావు తో వారికున్న అనుబంధాలను, అనుభూతులను జ్ఞాపకం చేసుకున్నారు. కవులు కవితగానం చేశారు. గాయకులు గీతలాపనాలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సంస్మరణ సభలో డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు ప్రసంగిస్తూ .. రామోజీరావు ఒక వ్యక్తిగా కాకుండా తనకు తాను ఒక వ్యవస్థగా నిర్మించుకున్నారని తెలిపారు. జీవించినంత కాలం క్రమశిక్షణను, రుజువర్తన ను ఏనాడూ వీడలేదని... కనీసం ఏమరపాటు నిర్లక్ష్య భావనను కూడా ప్రదర్శించలేదని ఆయన కొనియాడారు.



## జులై 7 నుంచి బోనాలు

**దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**

**విశ్వంభర, హైదరాబాద్**: తెలంగాణలో బోనాల జాతర అంటే ఎంత వైభవంగా జరుగుతుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పండుగను ఎంతో ఘనంగా నిర్వహిస్తూ ఉంటారు. ఈ క్రమంలోనే ఈ ఏడాది బోనాల పండుగ తేదీలను తాజాగా తెలంగాణ ప్రభుత్వం ఖరారు చేసింది. జులై 7 నుంచి బోనాల పండుగ ప్రారంభం అవుతుందని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తేదీన గోల్కొండ బోనాలతో పండుగ ప్రారంభమై జూలై 29న అంబారీ ఊరేగింపుతో ఉత్సవం ముగుస్తుంది. జూలై 21న సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాలు, 22న ఉదయం 9.30 గంటలకు రంగం కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఇక జులై 29న అక్కన్న మాదన్న ఆలయం దగ్గర అంబారీ ఊరేగింపు ఉంటుందని తెలిపారు. త్వరలోనే బోనాల పండుగపై పూర్తి స్థాయిలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించాలని మంత్రి సురేఖ ఆదేశించారు. ఇక రాష్ట్రంలోని 28 ఆలయాల్లో ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పిస్తామని కూడా తెలిపారు.

# ఆ రోజునే కేంద్ర బడ్జెట్

- వంద రోజుల షెడ్యూల్‌ను రచిస్తున్నమోడీ 3.0 ప్రభుత్వం

**విశ్వంభర, హైదరాబాద్:** కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడింది.. ఈ సారి కూడా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా నిర్మలా సీతారామన్ నియామకం అయ్యారు. దాంతో ఆమె మీద చాలా రకాల ప్రశ్నలు వస్తున్నాయి. వాటన్నింటికీ ఆమె తన బడ్జెట్ తో సమాధానం చెబుతుందని అంతా అనుకుంటున్నారు. ఇక మోడీ 3.0 ప్రభుత్వం వంద రోజుల షెడ్యూల్ ను రచిస్తోంది. దానికి అనుగుణంగానే జూలై 22న కేంద్ర బడ్జెట్ ను నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టే అవకాశం ఉంది. మోడీ 3.0 అధికారంలోకి వచ్చిన తర్వాత సమర్పించిన మొదటి సమగ్ర బడ్జెట్ ఇదే. వాస్తవానికి ఎన్నికలకు ముందే మధ్యంతర బడ్జెట్ ను ఆగమేఘాల మీద ప్రవేశ పెట్టారు. కానీ పూర్తి స్థాయిలో దాన్ని అప్పుడు ఎన్నికల కోడ్ వల్ల పెట్టలేకపోయారు. అయితే ఇప్పుడు ఎన్నికలు ముగిసిన తర్వాత వెంటనే పూర్తి స్థాయి బడ్జెట్ ను ప్రవేశపెట్టాలని మోడీ ప్రభుత్వం సంకల్పించింది. ప్రస్తుతం దేశంలో సాగు రంగం ఎదుర్కొంటున్న సమస్యలు, ఉద్యోగాల కల్పన, మూలధన వ్యయాలు, ద్రవ్యోల్బణం,



ఆర్థిక ఏకీకరణ లాంటి వాటికి పెద్ద పీట వేయనున్నట్టు తెలుస్తోంది. ఇక ప్రధాని మోడీ చెప్పిన 100 రోజుల ప్రణాళికలోని అంశాలను పొందుపరిచే అవకాశం ఉంది.

## తెలుగు రాష్ట్రాల సీఎంల జీతాలు ఎంతో తెలుసా దేశంలో ఎవరికి ఎక్కువంటే..?

**విశ్వంభర, హైదరాబాద్:** ప్రజాస్వామ్యంలో ప్రజల కోసం పనిచేసే వారికి జీతాలు బాగానే ఉంటాయి. ఇక మన దేశంలో కూడా సీఎంలకు జీతాలు ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా ఉన్నాయి. ఆయా రాష్ట్రాల పరిస్థితులు, స్థితిగతులను బట్టి ఉంటాయి. ఇక దేశంలోనే అత్యధికంగా తెలంగాణ సీఎం జీతం తీసుకుంటున్నారు. తెలంగాణ సీఎం జీతం ఏకంగా రూ.4,10,000 గా ఉంది.



ఆ తర్వాత స్థానంలో ఢిల్లీ సీఎం జీతం రూ. 3,90,000 ఉంది. మూడో స్థానంలో ఉత్తరప్రదేశ్ రూ. 3,65,000 గా ఉంది. ఇక నాలుగో స్థానంలో మహారాష్ట్ర సీఎం జీతం రూ. 3,40,000గా ఉంది. ఐదో స్థానంలో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి జీతం ఉంది. ఏపీ సీఎం జీతం నెలకు రూ.3,35,000గా ఉంది.

ఇక ప్రతి రాష్ట్ర ప్రభుత్వానికి సొంతంగా విమానాలు, హెలికాప్టర్లను కలిగి ఉంటుంది. అత్యవసరాలను దృష్టిలో పెట్టుకుని సీఎం సమయాన్ని ఆదా చేయడానికి వీటిని ఉపయోగిస్తారు. దాంతో పాటు మంత్రులు, ఇతరులకు కూడా వీటిని ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు విమానాలు, హెలికాప్టర్లు బాగానే ఉన్నాయి.

## కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే లా అండ్ ఆర్డర్ ఏమైంది?

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**విశ్వంభర, హైదరాబాద్ :** మెదక్ లో చోటు చేసుకున్న ఘర్షణపై ఆదివారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విట్టర్ వేదికగా రియాక్ట్ అయ్యారు. గడిచిన తొమ్మిదినరేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ ఎలాంటి మత పరమైన ఘర్షణలు లేకుండా ప్రశాంతంగా ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే లా అండ్ ఆర్డర్ ఏమైందని ప్రశ్నించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా మతపరమైన కార్యకలాపాలు మెదక్ పట్టణంలో చోటుచేసుకుంటున్నాయని మండిపడ్డారు. మెదక్ ఇప్పుడు అస్తవ్యస్తంగా మారడం నిజంగా సిగ్గుచేటన్నారు. కాగా ప్రస్తుతం మెదక్ లో బీజేపీ బంద్ కొనసాగుతోంది. నిన్న రాత్రి ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ గొడవ నేపథ్యంలో ఇవాళ మెదక్ పట్టణం బంద్ కు బీజేపీ నేతలు పిలుపునిచ్చారు. ప్రస్తుతం బంద్ ప్రశాంతంగా కొనసాగుతోంది. వర్తక, వాణిజ్య సముదాయాలు మూతపడ్డాయి. బంద్ నేపథ్యంలో పోలీసు బలగాలు భారీగా మెదక్ టౌన్ లో మోహరించారు. ఐజీ రంగనాథ్ స్వయంగా భద్రతను పర్యవేక్షించారు. ప్రస్తుతం మెదక్ జిల్లా కేంద్రం పూర్తిగా పోలీస్ దిగ్బంధంలో ఉంది. పలువురు బీజేపీ నేతలను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు.

## రీల్స్ మోజులో పడి ఇద్దరు బాలుర మృతి

**విశ్వంభర, హైదరాబాద్:** రీల్స్ మోజు ఇద్దరి ప్రాణాలు తీశాయి. ప్రస్తుత కాలంలో చిన్న వయసు నుంచి పెద్ద వయసు వారి దాకా అందరూ రీల్స్ చేయడానికి తెగ మోజు పడుతున్నారు. ఇక ఇప్పటి జనరేషన్ పిల్లలయితే మరీ ఇదే మోజులో ఉన్నారు. కొన్నిసార్లు ఆ రీల్స్ ప్రాణాలు తీస్తున్నా సరే అస్సలు ఆపట్లేదు. ఇప్పుడు హైదరాబాద్ లో మరో ఇద్దరి బాలుర ప్రాణాలు ఇలాగే గాల్లో కలిసిపోయాయి.

శనివారం రాత్రి ఓ ముగ్గురు బాలురు స్కూటీపై వెళ్తూ రీల్స్ చేస్తున్నారు. ఇంతలో డీసీఎం ను ఢీ కొని ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరొకరి పరిస్థితి సీరియస్ గా ఉంది. సూరారానికి చెందిన ఉదయ్(17), సాయిబాబానగర్ కు చెందిన శివదీక్షిత్ (17), మల్లారెడ్డినగర్ కు చెందిన మరో బాలుడు శనివారం రాత్రి మాదాపూర్ కేబుల్ బ్రిడ్జికి బయలు దేరారు. అయితే వారు ముగ్గురూ స్కూటీపై వెళ్తూనే రీల్స్ చేస్తూ వచ్చారు. కూకట్ పల్లి వై జంక్షన్ వద్దకు రాగానే.. రోడ్డు మీద ఆగి ఉన్న డీసీఎంను స్పీడ్ గా ఢీ కొట్టారు. దాంతో ఉదయ్, శివదీక్షిత్ అక్కడికక్కడే మరణించారు. ఇంకో బాలుడు ప్రస్తుతం సీరియస్ గా ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# సీఎం పదవి అంటే.. నీ సొంత ఎజెండా కాదు

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఈటల రాజేందర్ ఫైర్

విశ్వంభర, హైదరాబాద్: ముఖ్యమంత్రి పదవి అంటే రాజ్యాంగబద్ధమైనది.. అలాంటి పవిత్రమైన పదవిని సొంత ఎజెండా కోసం ఎలా వాడుతారంటూ సీఎం రేవంత్ రెడ్డి మీద ఎంపీ ఈటల రాజేందర్ ఫైర్ అయ్యారు. హైదరాబాద్ ఎల్బీనగర్ లో ఆదివారం జరిగిన కృతజ్ఞతా సభలో ఈటలను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన ప్రధానంగా రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తూ మాట్లాడారు.

ఒక ముఖ్యమంత్రిని పనుల నిమిత్తం కలిసినంత మాత్రాన దాన్ని వేరే విధంగా ఆపాదించవద్దని తెలిపారు. ముఖ్యమంత్రి అంటే పార్టీ కాదని.. పార్టీ వ్యక్తిగా ప్రవర్తిస్తే అది ప్రజాస్వామ్యాన్ని అవమానించినట్టే అవుతుందని ఈటల తెలిపారు. మల్కాజిగిరి ప్రజలు పట్టుబట్టి మరీ తనను గెలిపించుకున్నారని.. వారి రుణాన్ని తీర్చుకుంటానని వివరించారు. తన విజయాన్ని మల్కాజిగిరి ప్రజలకు బహూకరిస్తున్నట్లు రాజేందర్ తెలిపారు. గతంలో తాను ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తెలంగాణ కోసం ముఖ్యమంత్రుల వద్దకు దరఖాస్తులు పట్టుకుని వెళ్లేవాడినని గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు కూడా ఎమ్మెల్యేలకు ఆ స్వేచ్ఛ ఉండాలని ఆయన కోరారు. మల్కాజిగిరి ప్రజలకు



నిత్యం అందుబాటులోనే ఉంటానని ఈటల రాజేందర్ వివరించారు. నో అనే పదం తన డిక్షనరీలోనే లేదని తెలిపారు.

## ముగిసిన న్యాయవాద శిక్షణా శిబిరం



**విశ్వంభర, రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్, AILU ఆధ్వర్యంలో రెండు రోజుల న్యాయవాద శిక్షణా శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమం చివరి రోజున బార్ కౌన్సిల్ సభ్యులు కొల్లి సత్యనారాయణ, రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ కార్యదర్శి గులగారి కృష్ణని వారు శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో బొమ్మరాజు రాధాకృష్ణ, కేరిత్ , అశోక అండెకర్, మినాక్షి, శివకుమార్, ప్రభాకర్ గౌడ్, పైల్ల అరవింద రెడ్డి, తదితర న్యాయవాదులు పాల్గొన్నారు. గులగారి కృష్ణ మాట్లాడుతూ, న్యాయవాదుల అభ్యున్నతికి ఎల్లప్పుడూ సహకరిస్తామని అన్నారు.

## టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ముజీబ్‌కు సన్మానం



**విశ్వంభర, బషీర్ బాగ్:** టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ముజీబ్ ను టీఎన్జీవోస్ నేతలు సన్మానించారు. టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన డాక్టర్ ఎస్ ఎం హుస్సేనీ ముజీబ్ ను టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ అసోసియేట్ ప్రెసిడెంట్, టీఎన్జీవోస్ యూనియన్ స్కూల్ ఎద్యుకేషన్ డిపార్ట్మెంట్, హైదరాబాద్ అధ్యక్షుడు కేఆర్. రాజ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఎం.రవి పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పర్వతాలు, కె. శ్రీనివాసులు, శంకర్, శ్రీధర్, రాజు పాల్గొన్నారు.

## వంగాల బాలరాజ్ గౌడ్‌కు మహానంది అవార్డు

**విశ్వంభర, బషీర్ బాగ్ :** ఆదర్శ మ్యాట్రిమోనీ, ఆదర్శ కిరణం మాస పత్రిక, ఆదర్శవాణి ప్రధాన సంపాదకులు వంగాల బాలరాజు మహానంది అవార్డు అందుకున్నారు. తెలంగాణ మ్యారేజ్ బ్యూరో జేఏసీ విదేశీ పెళ్లి సంబంధాలను అత్యధికంగా నిర్వహించడంలో అగ్రగామిగా నిలుస్తున్నందుకు నిర్వాహకులు బుర్ర శ్రీనివాస్ గౌడ్, బీసీ కమిషన్ ఛైర్మన్ కృష్ణమోన్ రావు, పల్లె లక్ష్మణ్ గౌడ్, చీకటి ప్రభాకర్ గౌడ్, నిమ్స్ పద్మజ, ధర్మేందర్ చేతుల మీదుగా అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా వంగాల బాలరాజు గౌడ్ కు ఎంపీ ఆర్. కృష్ణయ్య, ఎమ్మెల్సీ ఎల్ రమణ, దైవజ్ఞ శర్మ, శివతేజ, దేవరాజ్, విజయ్, గడ్డమీది అనురాధ గౌడ్ శుభాకాంక్షలు తెలియజేశారు.



# వాహనదారులకు అలర్ట్

**నేడు హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు**

**బక్రీద్ పండుగ సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు**

**ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు ఆంక్షలు**

**పాతబస్తీలో వాహనాల రాకపోకలు బంద్**

**మసీదులు, ఈద్గాల పరిసరాల్లో వాహనాల దారిమళ్లింపు**

**విశ్వంభర,హైదరాబాద్ :** హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు కీలక సూచనలు చేశారు. సోమవారం ముస్లింల పవిత్ర పండుగైన బక్రీద్ ను పురస్కరించుకుని పలు ట్రాఫిక్ ఆంక్షలు విధించనున్నట్లు ప్రకటించారు. నగరంలోని ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు ప్రభుత్వం తగు ఏర్పాట్లు చేస్తోంది. 30 వేల మందికి పైగా ముస్లిం సోదరులు హాజరయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో పాత బస్తీలో సుమారు 1000 మంది పోలీసులను మోహరిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రార్థనలు జరిగే పరిసర ప్రాంతాల్లో వాహనాలను దారి మళ్లిస్తున్నామని తెలిపారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించే మీరాలం ఈద్ పరిసర ప్రాంతాల్లో, పాతబస్తీలోని పలు రహదారులపై రాకపోకలు నిలిపి వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. సోమవారం ఉదయం 8.00 నుంచి 11.30 గంటల వరకు మీరాలం ఈద్గా, పురానాపూల్, కమాటిపురా, కిషన్‌బాగ్ వైపు నుంచి ఈద్గా ప్రార్థనల కోసం వచ్చే వారికే అనుమతి ఉంటుందని తెలిపారు. బహదూర్‌పుర క్రాస్ రోడ్ మీదుగా ఉదయం 8.00 నుంచి 11.30 వరకు అనుమతిస్తామని అధికారులు తెలిపారు.





## క్లింకార కోసం రామ్ చరణ్ కీలక నిర్ణయం



**విశ్వంభర, హైదరాబాద్ :** మెగా వారసుడిగా రామ్ చరణ్ ఇండస్ట్రీలో బాగానే నిలదొక్కుకున్నాడు. తండ్రికి తగ్గ తనయుడిగా ఇండస్ట్రీలో రాణిస్తున్నాడు రామ్ చరణ్. అయితే ఇన్నేండ్లు రామ్ చరణ్ వరుసగా షూటింగులకు హాజరయ్యేవాడు. దాంతో కుటుంబంతో పెద్దగా సమయం గడిపేవాడు కాదు. కానీ ఇప్పుడు రామ్ చరణ్ కు ఓ కూతురు ఉంది. పెళ్లైన పదేండ్ల తర్వాత రామ్ చరణ్ఉపాసన దంపతులకు క్లింకార పుట్టింది. అందుకే ఇప్పుడు తన కూతురు కోసం రామ్ చరణ్ ఓ పెద్ద నిర్ణయం తీసుకున్నట్టు చెబుతున్నాడు. తాజాగా ఆయన ఓ మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాలు తెలిపాడు. ఇక నుంచి నా కూతురు క్లింకార కోసం కొంత టైమ్ కేటాయించాలని అనుకుంటున్నాను. వరుష షూటింగుల వల్ల క్లింకారను వదిలి వెళ్లలేకపోతున్నాను. కాబట్టి కొన్నాళ్లు నా కూతురు కోసం నెమ్మదిగా సినిమాలు చేస్తాను. ఎందుకంటే నా కూతురుకు నేను బానిస అయిపోయాను. ఆమె కోసం కొన్నాళ్ల పాటు సమయం కేటాయించాలని డిసైడ్ అయ్యాను. లోకల్ లో షూటింగ్స్ ఉంటే కచ్చితంగా సాయంత్రం 6 గంటల లోపే ఇంటికి వచ్చేస్తాను. నా నిర్మాతలకు కూడా ఇదే విషయం చెబుతాను అంటూ తెలిపాడు రామ్ చరణ్. తన కూతురు స్కూల్ కు వెళ్లేదాకా అలాగే వెళ్తానని తెలిపారు.



## ప్రైవేటు కళాశాలలో అక్రమాలను అరికట్టాలి

**ఇండియన్ నేషనల్ యువజన పార్టీ జాతీయ అధ్యక్షులు క్రాంతి కుమార్**

**విశ్వంభర, హిమాయత్ నగర్ :** ప్రైవేటు పాఠశాలల్లో, కళాశాలలో అక్రమాలను అరికట్టాలని ఇండియన్ నేషనల్ యువజన పార్టీ జాతీయ అధ్యక్షులు క్రాంతి కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో విద్యార్థుల తల్లిదండ్రులతో వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి క్రాంతి కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఆదివారం అన్ని కాలేజీలు, ఇన్స్టిట్యూషన్స్ బంద్ చేయాలని.. ప్రతి కాలేజీలో ఫీమేల్ స్టూడెంట్స్ కి యూస్ చేసుకునే విధంగా వాష్రూమ్స్ శుభ్రంగా ఉంచాలని ఆయన పేర్కొన్నారు. విద్యార్థినులకు శానిటరీ నాప్కిన్స్ కల్పించాలని కోరారు. కాలేజీ రోజు పని వేళలు 8 9 గంటలు మాత్రమే పనిచేయాలన్నారు. విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులతో బెదిరింపులకు పాల్పడే కళాశాలల యజమాన్యాలపై కఠినంగా వ్యవహరించాలని, ప్రతి కాలేజీలో ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడానికి టోల్ ఫ్రీ నెంబర్ ని పెట్టాలని.. కాలేజీ బయట నోటీసు బోర్డు ఏర్పాటు చేయాలని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు ఎవరైనా సూసైడ్ చేసుకుంటే కాలేజీలపై కేసులు నమోదు చేసి కఠినమైన చర్యలు తీసుకోవాలని.. టీసీలు, సర్టిఫికెట్స్, ఆన్లైన్ ద్వారా కాకుండా డైరెక్ట్ గా బోర్డు ద్వారా విద్యార్థులకు అందజేయాలని క్రాంతి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యువజన పార్టీ నాయకులు కునాల్ యాదవ్, ప్రవీణ్ రెడ్డి, రోహిత్, తదితరులు పాల్గొన్నారు.

## నాగర్ కర్నూల్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన బదావత్ సంతోష్



**విశ్వంభర,నాగర్ కర్నూల్ :-** నాగర్ కర్నూల్ జిల్లా నూతన కలెక్టర్ గా బదావత్ సంతోష్ ఆదివారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఐఏఎస్ ల బదిలీల లో భాగంగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న బదావత్ సంతోష్ నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ గా బదిలీ అయ్యారు. నూతన కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ ను కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, వెల్దండ తహసీల్దార్ రవికుమార్, కలెక్టర్ సీసీలు, వ్యక్తిగత సిబ్బంది ఖాజా మైనుద్దీన్, గౌతమ్ లు పూల బొకేతో స్వాగతం పలికారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం నూతన కలెక్టర్ బదావత్ సంతోష్, క్యాంపు కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న కలెక్టర్ ఉదయ్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన నూతన కలెక్టర్ బాదావత్ సంతోష్ ను ఉదయ్ కుమార్ పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలిపారు.

## బక్రీద్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి

**ఎస్పీ సురేష్ కుమార్**



**విశ్వంభర, ఆసిఫాబాద్ :** బక్రీద్ పండగ వేడుకలను మత సామరస్యాన్ని కాపాడుతూ.. ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బక్రీద్ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను ప్రజలు నమ్మకూడదని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చిన, పోస్టులను చూసి వెంటనే ప్రతిస్పందించకుండా సమన్వయం పాటిస్తూ ఆ పోస్టుల్లో నిజానిజాలను తెలుసుకునే ప్రయత్నం చేయాలన్నారు. ఎవరైనా వ్యక్తులు కావాలని శాంతి భద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోబడుతుందని హెచ్చరించారు. కాగా పశువుల అక్రమ రవాణా జరగకుండా జిల్లా సరిహద్దు మండలాల వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ప్రతిష్ట నిఘా పెట్టినట్లు పేర్కొన్నారు.

## మెదక్ వెళ్తాను ఎవరు అడ్డుకుంటారో చూస్తా

**ఎంపీ రఘునందన్ రావు**



**విశ్వంభర, హైదరాబాద్ :** మెదక్ ఘటనలో కత్తిపోట్లకు గురై హైదరాబాద్ మియాపూర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గో సంరక్షకుడు అరుణ్ రాజ్ ని మెదక్ ఎంపీ రఘునందన్ రావు పరామర్శించారు. గోవులను తరలిస్తున్నారని గో సంరక్షకులు పోలీసులకు సమాచారం ఇస్తే.. మెదక్ టౌన్ పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. చట్టం తెలియకుండా పోలీసులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బక్రీద్ పండుగ సందర్భంగా జంతు వధపై చాలా స్పష్టంగా రాష్ట్రాల డీజీపీలకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందని ఆయన గుర్తు చేశారు. మెదక్ లో శనివారం ఘటనకు పోలీసులే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. గో సంరక్షకులపై దాడి జరిగితే.. ఇప్పటివరకు దాడి చేసిన వారిని పట్టుకోకుండా.. హిందువులని అరెస్ట్ చేశారని సీరియస్ అయ్యారు. దాడి చేసిన వారిని అరెస్ట్ చేయకపోతే జరిగే పరిణామాలకు ఎస్పీ బాధ్యత వహించాలని ఆయన హెచ్చరించారు. మెదక్ ఎస్పీ గతంలో పింక్ ప్రభుత్వానికి.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి వత్తాసుగా పనిచేస్తున్నారని ధ్వజమెత్తారు. "బక్రీద్ సందర్భంగా పశువులను తరలిస్తున్నారని సమాచారం ఇస్తే పట్టించుకోలేదు. పైగా ఇష్టం వచ్చినట్లు ఎస్ఐ, సిఐ మాట్లాడారు. మెదక్ టౌన్ లో 144 సెక్షన్ ఉందని డీజీ చెబుతున్నారు. ప్రజల చేత ఎన్నుకున్న ఎంపీని. కచ్చితంగా మెదక్ వెళ్తాను. ఎవరు అడ్డుకుంటారో చూస్తాను. మీరు భయపడితే భారత రాజ్యాంగానికి, ప్రజలకు భయపడాలి. మూడు రంగుల జెండాకు కాదు. హిందువులను మాత్రమే అరెస్ట్ చేశారు. ఘటనకు బాధ్యులైన ముస్లింలను అరెస్ట్ చేయలేదు. ఘటనకు బాధ్యులైన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి" అని ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు.

# ప్రజాక్షేత్రంలో నాయకుడిగా కాదు ప్రజా సేవకుడిగా పని చేస్తా

- మల్కాజ్గిరి పార్లమెంట్ ఎంపీ ఈటల రాజేందర్



**విశ్వంభర, హయత్ నగర్ :** మల్కాజ్గిరి పార్లమెంట్ ఎంపీగా భారతీయ జనతా పార్టీ అభ్యర్థి ఈటల రాజేందర్ అత్యంత భారీ మెజారిటీతో గెలిపించిన శుభ సందర్భంగా హయత్ నగర్ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ... స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి డివిజన్ లోని ఎస్ వి కన్వెన్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథులుగా ఈటెల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటెల రాజేందర్ మాట్లాడుతూ... అఖండ భారీ మెజారిటీతో తనను పార్లమెంటుకు పంపడంలో భాగస్వామ్యులైన హయత్ నగర్ ప్రజానీకానికి, గెలుపే లక్ష్యంగా పనిచేసిన హయత్ నగర్ డివిజన్ భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులకు, కార్యకర్తలకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా నాయకుడిలా కాదు ప్రజా సేవకుడిగా పని చేస్తా అని ఈటల అన్నారు. తనకున్న అనుభవంతో మల్కాజ్గిరి పార్లమెంట్ సెగ్మెంట్ ను తెలంగాణ రాష్ట్రానికి ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వంపై కొట్లాడానికైనా, సిద్ధమని తెలిపారు. హయత్ నగర్ డివిజన్ లోని ప్రతి కాలనీలో ఎలాంటి సమస్యలు ఉన్న స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి తనకు సమాచారం ఇవ్వవలసిందిగా కాలనీ వాసులకు తెలిపారు.

హయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి మాట్లాడుతూ... ముందుగా ఈ సమావేశానికి విచ్చేసిన కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులకు, మొన్నటి ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఎంపీ గా ఈటల రాజేందర్ ను అత్యంత భారీ మెజారిటీ ఇచ్చిన సందర్భంగా హయత్ నగర్ వాసులందరికీ ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. ఎంపీ సహాయంతో హయత్ నగర్ డివిజన్ ను మరింత శరవేగంగా అభివృద్ధి పరిచేలా కృషి చేస్తానని సభాముఖంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు కళ్లెం రవీందర్ రెడ్డి, మల్కాజ్గిరి పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ బండారి భాస్కర్ , ఎల్బీనగర్ కన్వీనర్ కోట రవీందర్ , బిజెపి సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్ , జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్ , డివిజన్ ప్రధాన కార్యదర్శిలు సంఘీ అశోక్ గారు, గోవింద చారి, నాయకులు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ సేవా సంస్థాన్ ఔదార్యం ఎంతో గొప్పది : ఎంపీ కొండా విశ్వేశ్వర రెడ్డి



**విశ్వంభర,హిమాయత్ నగర్ :** వివిధ ప్రమాదాల కారణంగా వైకల్యం పొందిన వారికి నారాయణ సేవా సంస్థాన్ ఉదయపూర్ తన ఔదార్యాన్ని చాటుకుందని, ఇది గొప్ప సేవా కార్యక్రమం అని చేవెళ్ల లోక్ సభ నియోజకవర్గం ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి కొనియాడారు. వికలాంగుల కోసం నారాయణ సేవా సంస్థాన్ ఆదివారం కింగ్ కోఠిలోని ఓ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కృత్రిమ అవయవాల పంపిణీ కార్యక్రమాన్ని బీజేపీ నాయకురాలు మాధవీలత తో కలిసి ప్రారంభించి ఆయన మాట్లాడారు. ఉదయపూర్ చెందిన నారాయణ సేవా సంస్థాన్ ప్రతిష్ఠాత్మకమైన జాతీయ అవార్డు ను గెలుచుకున్నదని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా వేలాది మంది వికలాంగులకు కృత్రిమ అవయవాలను ఉచితంగా పంపిణీ సంస్థాన్ విశేషమైన సేవలు అందిస్తున్నదని అభినందించారు. ఈ సేవా కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా తన మనసు చలించి పోయిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న దివ్యాంగుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో ఉన్న మానవతావాదులు సంస్థాన్ చేస్తున్న సేవా కార్యక్రమాలకు తోడ్పాటు అందించాలని ఆయన కోరారు. వందలాది మందికి సంస్థాన్ కృత్రిమ అవయవాలను పంపిణీ చేసింది. ఈ కార్యక్రమంలో సంస్థాన్ అంతర్జాతీయ అధ్యక్షుడు పద్మశ్రీ కైలాష్ చంద్ర అగర్వాల్, ట్రస్టీ దేవేంద్ర చౌబిన్, ప్రతినిధులు జన్మత్వటేల్, అల్యాచౌదరీ, భగవాన్ప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగికి విరమణ సహజం

**మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి**



**విశ్వంభర, సూర్యాపేట :** సూర్యాపేట డిపో లో ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సుంకరి శ్రీనివాస్ నిరంతరం కృషి చేశారని మాజీ మంత్రి, సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. ఆదివారం ఐఎంఏ ఫంక్షన్ హాల్ లోజరిగిన సుంకరి శ్రీనివాస్ ఉద్యోగ విరమణ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం ఆర్టీసీ ఈడి పురుషోత్తం మాట్లాడుతూ... సుంకరి శ్రీనివాస్ డిఎం శ్రీనివాస్ గా పేరు తెచ్చుకున్నారన్నారు. ఆర్టీసీలో కండక్టర్ గా ఉద్యోగంలో చేరి 34 సంవత్సరాల పాటు పని చేశారని, 15 సంవత్సరాల పాటు యూనియన్ కార్యదర్శిగా విశేష సేవలు అందించారని కొనియాడారు. ఆర్టీసీ యాజమాన్యం,కార్మికులతో స్నేహపూర్వక సంబంధాలు కలిగి ఉన్నారని చెప్పారు. ఐదు సంవత్సరాల సర్వీసు ఉన్నప్పటికి ఆరోగ్య కారణాలతో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన సుంకరి శ్రీనివాస్ కు పలువురు ఉద్యోగ సంఘాలు, కార్మిక సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సుంకరి శ్రీనివాస్ సునీత దంపతులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిఎంయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి థామస్ రెడ్డి,డిప్యూటీ ఆర్ఎం శివశంకర్, ఉద్యోగ సంఘాల నాయకులు లక్ష్మయ్య,బత్తుల సుధాకర్,బెల్లి నర్సయ్య,ఎన్సిహెచ్ సైదులు, ఏకాంబరం,పూర్ణ శశికాంత్, అడ్వకేట్ అయోధ్య,పిఆర్టియు నాయకులు వెంకటరెడ్డి,సుంకరి రాజారాం తదితరులు పాల్గొన్నారు.

## అత్తారింట్లో అల్లుడి దారుణ హత్య

**రాళ్లతో మోది అల్లుడిని హత్య చేసిన మామ**

**ఉండవెల్లి మండల కేంద్రంలో ఘటన**



**విశ్వంభర, అలంపూర్ టౌన్:** ఉండవెల్లి మండల కేంద్రంలో దారుణ సంఘటన చోటుచేసుకుంది. నిద్రిస్తున్న అల్లుడుపై రాళ్లతో కొట్టి మామ హత్య చేసిన సంఘటన ఆదివారం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు... ఉండవెల్లి మండల కేంద్రానికి చెందిన చాకలి మద్దిలేటికి ఇద్దరు కుమార్తెలు చిన్న కూతురు మహేశ్వరిని ఆరు సంవత్సరాల క్రితం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలుకు చెందిన దేవేందర్(36) కు ఇచ్చి వివాహం చేశారు. మద్యానికి బానిసైన దేవేందర్ వివాహమైన రెండు నెలల నుంచి మహేశ్వరుని వేధిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వేధింపులు తాళలేక మహేశ్వరి గత కొన్ని రోజులుగా పుట్టింట్లోనే ఉంటుంది. ఈ క్రమంలో శనివారం రాత్రి దేవేందర్ ఉండవల్లికి వచ్చి మరొకసారి గొడవపడ్డాడు. ఇంట్లో నిద్రిస్తున్న అల్లుడు పై అర్ధరాత్రి మామ చాకలి మద్దిలేటి రాళ్లతో మోదీ హత్య చేసినట్లు సీఐ రవిబాబు తెలిపారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.మృతుడి తల్లి జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అలంపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని గద్వాల్ డీఎస్పీ సత్యనారాయణ, సీఐ రవి బాబు, ఎస్ఐ శ్రీనివాసులతో కలిసి పరిశీలించారు.

## గాజాపై దాడులు ఆపేందుకు చర్యలు తీసుకోవాలి




**విశ్వంభర, హైదరాబాద్:** గాజాపై జరుగుతున్న దాడులకు నిరసనగా మగ్ధుమ్ భవన్‌లో ఆల్ ఇండియా శాంతి సంఘీభావం ఆధ్వర్యంలో కొవ్వత్తులతో కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా ఇజ్రాయిల్ ఏకధాటిగా గాజా మీద చేస్తున్న దాడుల పట్ల ఎంతో మంది అమాయకులు, సామాన్యులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ దేశాల సైతం చొరవ చూపి యుద్ధాన్ని ఆపే విధంగా అటు అగ్ర రాజ్యాలు, భారతదేశ ప్రధాని మోడీ చొరవ తీసుకుని శాంతిని అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాష, ఐప్సో జాతీయ కార్యదర్శి డా. దిడ్డి సుధాకర్, బొమ్మగాని ప్రభాకర్, డా. కాచం సత్యనారాయణ, పలువురు నాయకులు స్వచ్ఛంద సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# జూలై 19 వ తేదీన లాల్ దర్వాజా బోనాలు



విశ్వంభర, చార్మినార్ : తెలంగాణ రాష్ట్రంలోనే అత్యంత వైభవంగా, ప్రతిష్టాత్మకంగా నిర్వహించే లాల్‌దర్వాజా శ్రీ మహంకాళి 116వ వార్షిక బోనాల జాతర ఉత్సవాలు జూలై 19 వ తేదీన ప్రారంభం కానున్నాయని ఆలయ కమిటీ చైర్మన్ సి.రాజేందర్ యాదవ్ ప్రధాన కార్యదర్శి బి.మారుతీ యాదవ్, కోశాధికారి సతీష్ ముదిరాజ్‌లు తెలిపారు. లాల్‌దర్వాజా సింహవాహిని శ్రీ మహంకాళి దేవాలయంలో జరిగిన మీడియా సమావేశంలో వారు పాల్గొని వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా జూలై 19వ తేదీన ప్రారంభం కానున్న బోనాల ఉత్సవాలు 29వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. జూలై 19వ తేదీన శుక్రవారం ఉదయం గణపతి హోమం, సప్తశతి పారాయణం,దేవి అభిషేకం,ధ్వజారోహణ,శిఖర పూజ, సాయంత్రం కలశస్థాపనతో ఉత్సవాలు లాంచనంగా ప్రారంభమవుతాయన్నారు. 21వ తేదీన సాయంత్రం శాలిబండ కాశీ విశ్వనాథ స్వామి దేవాలయం నుంచి అమ్మవారి ఘటమును భాజా భజంత్రీలు, డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయంలో ప్రతిష్ఠించడం జరుగుతుందన్నారు. అనంతరం 9రోజుల పాటు అమ్మవారిని వివిధ రూపాలలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. జూలై 28వ తేదీన అమ్మవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారికి బోనాల సమర్పణ, రాత్రికి ప్రపంచ శాంతి కోరుతూ శాంతి కళ్యాణం నిర్వహిస్తామన్నారు. జూలై 29వ తేదీన సోమవారం పోతరాజు స్వాగతం, అమ్మవారి భవిష్య వాణి వినిపించే రంగం కార్యక్రమం, అమ్మవారి బ్రహ్మాండమైన సామూహిక ఘటాల ఊరేగింపుతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

**దేశ రాజధాని ఢిల్లీలో 8,9,10 వ తేదీల్లో లాల్ దర్వాజా బోనాలు**

లాల్ దర్వాజా సింహవాహిని శ్రీ మహంకాళి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో దేశ రాజధాని ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మూడు రోజుల పాటు 10వ వార్షిక బోనాల ఉత్సవాలు జూలై 8,9,10 తేదీలలో జరుగనున్నట్లు ఆలయ కమిటీ కన్వీనర్ జి.అరవింద్ కుమార్ గౌడ్ తెలిపారు. 8వ తేదీన తెలంగాణ భవన్‌లో ఫోటో ఎగ్జిబిషన్ ప్రారంభమవుతుందన్నారు. 9వ తేదీన సాయంత్రం 5 గంటలకు ఇండియా గేట్ నుంచి అమ్మవారి ఘటాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చి తెలంగాణ భవన్ లో ప్రతిష్టాపన మహోత్సవాలు, 10వ తేదీన అమ్మవారికి బోనాల సమర్పణ, పోతరాజు స్వాగతం తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరపున అమ్మవారికి పట్టు వస్త్రాలు, బంగారు బోనం సమర్పిస్తారన్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు ఢిల్లీ బోనాల ఉత్సవాలలో పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

# మొన్న వేలు.. నిన్న జెర్రీ!

**ఐస్‌క్రీమ్‌లో షాకింగ్ ఘటనలు**

**కొంతముంచుతున్న ఆన్‌లైన్ ఆడర్లు**

**విశ్వంభర, ఉత్తరప్రదేశ్:**

స్ట్రీట్ ఫుడ్‌తో పాటు ఆన్‌లైన్‌లో ఏం కొందామన్నా ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా బిర్యానీలు, శీతలపానీయాల విషయంలో ఆ జాగ్రత్త ఎక్కువ తీసుకోవాల్సిన అవసరం ఉందేమో అనిపిస్తుంది. ఈ మధ్య వైరల్ అవుతున్న వీడియోలే ఇందుకు కారణం. ఇటీవల ఐస్ క్రీమ్ ఆర్డర్ చేసిన ఓ డాక్టర్‌కు ఊహించని సంఘటన ఎదురైంది. అందులో ఏకంగా మనిషి వేలు కనిపించడంతో ఆ డాక్టర్ కంగుతిన్నాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. తాజాగా అలాంటి మరో ఘటన వెలుగులోకి వచ్చింది. అమూల్ ఐస్ క్రీమ్ బాక్స్‌లో జెర్రీ ప్రత్యక్షమైంది. దీనికి సంబంధించిన వీడియోను నెటిజన్లతో పంచుకున్నాడు. ఈ సంఘటన ఉత్తర ప్రదేశ్‌లో వెలుగుచూసింది. యూపీలోని నోయిడాకు చెందిన దీప అనే మహిళ ఆన్‌లైన్‌లో బ్లింకిట్ ద్వారా అమూల్ ఐస్‌క్రీమ్ బాక్స్ ఆర్డర్ పెట్టింది. అయితే కొద్దిసేపటికి డెలివరీ బాయ్ ఐస్‌క్రీమ్ బాక్స్‌ను డెలివరీ చేశాడు. చల్లచల్లని ఐస్‌క్రీమ్ రుచిచూద్దామని బాక్స్ ఓపెన్ చేశారు. ఊహించని విధంగా అందులో జెర్రి ప్రత్యక్షమవడంతో ఆ మహిళ షాక్ అయింది. ఈ వీడియో ఇప్పుడు నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఇది చూసిన నెటిజన్లు కొంతమంది తెలంగాణ ప్రభుత్వం అమూల్ ఐస్‌క్రీమ్ విక్రయాలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని కోరుతున్నారు.






# వాహనదారులకు పాకిస్తాన్ భారీ ఊరట

- భారీగా పెట్రోల్ ధర తగ్గింపు
- బక్రీద్ సందర్భంగా ప్రభుత్వం నిర్ణయం



**విశ్వంభర, పాకిస్తాన్:** తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న పాకిస్థాన్‌లో బక్రీద్ పండుగ సందర్భంగా కాస్త ఊరట లభించింది. పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గిస్తూ అక్కడి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పెట్రోల్ లీటరుకు రూ.10.20 చొప్పున, డీజిల్ లీటరుకు రూ.2.33 వంతున తగ్గించింది. పాక్‌లో నగదు కొరత, రెండంకెల ద్రవ్యోల్బణంతో ధరలు భారీగా పెరిగి ప్రజలు సతమతమవుతున్నారు. ఇలాంటి సమయంలో బక్రీద్ పండుగకు ఈ ధరల తగ్గింపు కాస్త ఊరటనిచ్చింది. సాధారణంగా ప్రతీ పదిహేను రోజులకోసారి దేశంలో ఇంధన ధరల సమీక్ష ఉంటుంది. అయితే, ఈసారి ధరలు తగ్గించడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల హెచ్చుతగ్గులు, వినియోగదారుల ధరల సూచీ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌లో ప్రకటించింది. 2022 మే నెల నుంచి పాకిస్థాన్ తీవ్ర ఆర్థిక సంక్షోభంతో గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది. చివరికి పిండి, తిండి గింజలూ దొరక్క ఆహారధాన్యాల కొరత నెలకొంది. ఈ నేపథ్యంలో ఈ దేశ ప్రజలకు తొలిసారిగా దక్కిన భారీ ఉపశమనం ఇదే కావడం గమనార్హం. ఇంధన ధరల తగ్గుముఖంతో నిత్యావసర సరుకుల ధరలు కూడా కొంచెం తగ్గుముఖంపడుతాయని పాక్ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇంధన ధరల తగ్గింపు నిర్ణయానికి ముందు దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఓ ప్రకటనలో పరిశ్రమలకు విద్యుత్ బిల్లులను భారీ స్థాయిలో తగ్గిస్తున్నట్లు తెలిపారు. యూనిట్‌కు రూ 10.69 పైసలు చొప్పున ఈ తగ్గింపు అమలులోకి వచ్చినట్లు వెల్లడించారు.




# గంగానదిలో పడవ బోల్తా



- దసరా రోజు స్నానాలు చేసేందుకు భక్తులు
- ఆరుగురు గల్లంతు

**విశ్వంభర, బీహార్:** గంగానదిలో పడవ బోల్తా పడి ఆరుగురు గల్లంతు అయ్యారు. ఈ తీవ్ర విషాదం బీహార్ లో జరిగింది. బీహార్ రాష్ట్రంలోని రాజధాని పాట్నా వరద ప్రాంతంలో ఉమానాథ్ ఘాట్ వద్ద గంగా దసరా రోజు స్నానాలు చేసేందుకు చాలా మంది భక్తులు వెళ్తుంటారు. గంగానదికి ఇరువైపులా భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. నది ఒడ్డుకు వెళ్లేందుకు ప్రజలు పడవలను ఉపయోగిస్తున్నారు. ఇందులో భాగంగా ఓ పడవలో 17 మంది స్నానాలు ఆచరించేందుకు వెళ్లారు. అయితే పడవ కాస్త లోతట్టు ప్రాంతానికి రాగానే బోల్తా పడింది. దాంతో అందులో ఉన్న అందరూ నదిలో పడిపోయారు. ఇందులో 11 మంది ఈదుకుంటూ ఒడ్డుకు చేరకున్నారు. మిగతా ఆరుగురు మాత్రం నదిలో గల్లంతు అయిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే పడవ బోల్తా పడగానే.. స్థానికంగా ఉన్న మిగతా బోటు డ్రైవర్లు గల్లంతు అయిన వారిని వెతకడం ప్రారంభించారు. ఆ తర్వాత ఎస్డీఆర్ ఎఫ్ బృందాన్ని పిలిచారు. ఇక గల్లంతు అయిన వారి కుటుంబీలకు సమాచారం ఇవ్వగా.. వారు బోరున విలపిస్తున్నారు. ఘాట్ వద్ద పెద్ద సంఖ్యలో ప్రజలు గుమిగూడారు.

# స్పీకర్ డిసైడ్ చేసేది నేను కాదు!

- కొత్త స్పీకర్ ఎవరన్న ప్రశ్నకు ఓంబిర్లా సమాధానం



**విశ్వంభర, న్యూఢిల్లీ:** కొత్తగా కొలువుదీరనున్న 18వ లోక్‌సభకు స్పీకర్ ఎవరో నిర్ణయించేది తాను కాదని 17వ లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా అన్నారు. లోక్‌సభ నూతన స్పీకర్‌గా, డిప్యూటీ స్పీకర్‌గా ఎవరిని నియమించబోతున్నారన్న మీడియా ప్రశ్నకు ఓం బిర్లా పైవిధంగా సమాధానం ఇచ్చారు. స్పీకర్ నియామకానికి, డిప్యూటీ స్పీకర్ నియమకానికి సంబంధించి అన్ని నిర్ణయాలు తీసుకునేది రాజకీయ పార్టీలని, ఆ నిర్ణయాలు తాను తీసుకునేవి కావని ఓం బిర్లా చెప్పారు. ఈ నెల 24న 18 లోక్‌సభ కొలువుదీరబోతోంది. రెండు రోజుల్లో ప్రొటెం స్పీకర్ ఎంపిక, ఎంపీల ప్రమాణస్వీకారాలు పూర్తిచేసి ఈ నెల 26న లోక్‌సభ స్పీకర్‌ను, డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకోనున్నారు. ఈ నేపథ్యంలో కాబోయే స్పీకర్ ఎవరే విషయంలో జోరుగా చర్చ జరుగుతోంది. అధికార పార్టీ ఎంపీనే స్పీకర్ అవుతారని కొందరు, ప్రతిపక్ష పార్టీలకు స్పీకర్ పదవి దక్కుతుందని కొందరు అంటున్నారు. ఈ విషయాన్ని ఓం బిర్లా ముందు ప్రస్తావించడంతో ఆయన పైవిధంగా స్పందించారు.

# కేంద్ర జోస్యం చేసుకోవాలి

- ఢిల్లీకి ఎక్కువ నీళ్లు ఇప్పించాలి
- ఢిల్లీ మంత్రి అతిషీ
- పైపులను కత్తిరించడం వలన లీకేజీలు
- రక్షణ పెంచాలని పోలీస్ కమిషనర్‌కు లేఖ



**విశ్వంభర, ఢిల్లీ:** ఢిల్లీలో నీటి సంక్షోభం రోజురోజుకు ముదురుతుంది. త్రాగడానికి, కనీస అవసరాలకు నీరు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజుకొకటి చెప్పున కాలనీ కి వచ్చే ట్యాంకర్ల దగ్గర ప్రజలు నీళ్ల కోసం ఎగబడుతున్నారు. ఢిల్లీలో నీటి కష్టాలను నిరసిస్తూ బీజేపీ చేపట్టిన ఆందోళనలు ఉద్రికత పరిస్థితులకు దారి తీశాయి. చాతర్ పుర్ లోని జల్ బోర్డు ఆఫీసును ఆందోళన కారులు ధ్వంసం చేశారు. కుండలు, రాళ్లతో ఆఫీసు అద్దాలను పగులగొట్టారు. దీంతో ధర్నా చేస్తున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీలో నీటి కొరత నేపథ్యంలో కేంద్రం జోక్యం చేసుకోకపోతే పరిస్థితి మెరుగుపడదని, హర్యానిలోని బీజేపీ ప్రభుత్వంలో మాట్లాడి ఢిల్లీకి ఎక్కువ నీళ్లు ఇప్పించాలని మంత్రి అతిషీ అన్నారు. ప్రస్తుతం ఉన్న కొద్దిపాటి నీటి వనరులను కాపాడుకోడానికి ఢిల్లీ ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతోందన్నారు. ప్రధాన పైప్ లైన్‌లు దగ్గర పెట్రోలింగ్, రక్షణ పెంచాలని పోలీస్ కమిషనర్ సంజయ్ అరోరాకు ఢిల్లీ మంత్రి అతిషీ లేఖ రాశారు. నీటి కొరతతో పైప్ లైన్‌ల నుంచి కొంత మంది నీటిని దొంగలిస్తున్నారని చెప్పారు. పైపులను కత్తిరించడం వలన లీకేజీలు ఏర్పడుతున్నాయన్నారు. ఢిల్లీ జల్ బోర్డు కార్యాలయంపై దాడి జరగడంపై బీజేపీ నేత రమేశ్ బిధూరి స్పందిస్తూ.. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం కరెక్ట్ కాదన్నారు. ఇలాంటి చర్యలతో ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. కానీ ప్రజలు కోపంలో ఉన్నప్పుడు ఇలాంటి సంఘటనలు జరుగుతాయన్నారు.

# బాధ్యులను ఉపేక్షించేది లేదు

- నీట్ పరీక్ష అవకతవకలు మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందన
- అవకతవకలకు పాల్పడినట్టు తేలితే కఠిన చర్యలు
- ప్రశ్నాపత్రం లీకేజ్‌కు ఆధారాలు లేవు

**విశ్వంభర, న్యూఢిల్లీ:**

నీట్ పరీక్షల నిర్వహణలో అవకతవకలు నిర్ధారణ అయితే బాధ్యులైన ఎన్‌టీఏ అధికారులను ఉపేక్షించేది లేదని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు. నీట్ పరీక్షల విషయంలో ప్రభుత్వం పారదర్శకంగా, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజ్, పరీక్షల నిర్వహణలో అధికారులు ఎవరైనా అవకతవకలకు పాల్పడినట్టు తేలితే కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. సుప్రీంకోర్టు సూచనలకు అనుగుణంగా 1563 మంది అభ్యర్థులకు తిరిగి పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

రెండు చోట్ల అక్రమాలు జరిగాయని గుర్తించామని, ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని తెలిపారు. ఎన్‌టీఏ ఉన్నతాధికారులు ఎవరైనా దోషులుగా తేలితే వారు తీవ్ర పరిణామాలు ఎదుర్కోకతప్పదని తేల్చిచెప్పారు. ఎన్‌టీఏలో ప్రక్షాళన అవసరమని, ఈ దిశగా చర్యలు చేపడతామని, తప్పులు చేసినవారు చర్యల నుంచి తప్పించుకోలేని విధంగా కార్యాచరణకు దిగుతామని వెల్లడించారు. నీట్ యూజీ 2024లో గ్రేస్ మార్కులు పొందిన విద్యార్థుల ముందు రెండు మార్గాలున్నాయని, ఈనెల 23న మళ్లీ పరీక్ష రాసి జూన్ 30 నాటికి నూతన స్కోర్ పొందడం లేదా గ్రేస్ మార్కులు లేకుండా గతంలో సాధించిన స్కోర్‌ను ఆమోదించాలని స్పష్టం చేశారు. ఇక నీట్ పరీక్షల ప్రశ్నాపత్రం లీకేజ్‌కు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేవని మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు.



# నేడు పోలవరానికి సీఎం బాబు

- తొలి పర్యటనకు రెడీ
- పోలవరం ప్రాజెక్ట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టిన సర్కార్
- ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితులపై ఆరా తీయనున్న సీఎం



**విశ్వంభర, విజయవాడ:** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలి పర్యటనకు రెడీ అవుతున్నారు. నేడు పోలవరం ప్రాజెక్టు సందర్శనకు ఆయన వెళ్లనున్నారు. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో సీఎంగా ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు పోలవరంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రతీ సోమవారం ఆయన పోలవరం పనుల పురోగతిని సమీక్షించే వారు. ఎప్పటికప్పుడు నిర్మాణ సంస్థకు, అధికారులకు తగు సూచనలు చేసే వారు. అయితే, మళ్లీ ఐదేళ్ల తర్వాత చంద్రబాబు సీఎం అయ్యారు. ఇప్పుడు ముఖ్యమంత్రి పదవి బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి పోలవరం టూర్ కు రెడీ అవుతున్నారు.

పోలవరం ప్రాజెక్ట్ సందర్శనతోనే ఆంధ్రప్రదేశ్ లో క్షేత్రస్థాయి పర్యటనలు ప్రారంభించబోతున్నారు సీఎం చంద్రబాబు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పోలవరం ప్రాజెక్ట్ వద్ద హుటాహుటిన యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్ట్ ను ఏపీ జల జీవనాడిగా గతంలోనూ ప్రత్యేక దృష్టి పెట్టారు. ఐదేళ్ల తర్వాత మళ్లీ ఆయన పోలవరం ప్రాజెక్ట్ సందర్శనకు వెళ్తుండటంతో పనుల పురోగతిని ఆయన తెలుసుకోనున్నారు. అసలు పోలవరం ప్రాజెక్టులో గతంలో ఎంత మేర పనులు జరిగాయి? ఈ ఐదేళ్లలో ఎంత పనులు జరిగాయి? వాస్తవ పరిస్థితులు ఎలా ఉన్నాయి? అన్నదానిపై ప్రధానంగా ఆరా తీయనున్నారు. ప్రాజెక్ట్ ఎంత కాలంలో పూర్తి చేయొచ్చు. అలాగే నిర్వాసితుల పరిస్థితి ఎలా ఉంది అనే అంశాలపైన సీఎం చంద్రబాబు సమీక్షించే అవకాశం ఉంది. ఇరిగేషన్ అధికారులు, పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ అధికారులతో పాటు ఇంజినీర్లతోనూ చంద్రబాబు సమీక్షించబోతున్నట్లు సమాచారం. చంద్రబాబు పర్యటన అనంతరం ప్రాజెక్ట్ పురోగతి ఏంటి? ఎంత కాలంలో పూర్తవుతుంది? అనేదానిపై ఒక క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

## ఈవీఎంలను ఓటిపి ద్వారా హ్యాక్ చేయలేము

### వందనా సూర్యవంశీ



**విశ్వంభర, ముంబై:** ముంబయిలో ఈవీఎం హ్యాకింగ్‌పై వచ్చిన ఆరోపణలను రిటర్నింగ్ అధికారిణి వందనా సూర్యవంశీ ఖండించారు. ముంబై నార్త్ వెస్ట్ స్థానంలో ఎంపీగా గెలిచిన షిండే వర్గం శివసేన ఎంపీ రవీంద్ర వైకర్ బంధువు కౌంటింగ్ సెంటర్‌లోకి మొబైల్ ఫోన్ తీసుకెళ్లారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈవీఎంను హ్యాక్ చేశారన్న వార్తా కథనంపై ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఓటీపీతో ఈవీఎంను తెరిచి పోలైన ఓట్ల సంఖ్యను ఆయన మార్పు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. కమ్యూనికేషన్ కోసం ఎటువంటి సదుపాయం లేని ఫూల్‌ప్రూఫ్ టెక్నికల్ పరికరం ఈవీఎం అని ఆమె తెలిపారు. ఈవీఎం తెరిచేందుకు మొబైల్ ఫోన్, ఓటీపీ అవసరం లేదని అన్నారు. రిటర్నింగ్ అధికారిణి వందనా సూర్యవంశీ ముంబైలో మీడియాతో మాట్లాడుతూ.. ఈవీఎం వైర్‌లెస్ లేదా వైరు కమ్యూనికేషన్ పరికరం కాదు. అన్‌లాక్ చేయడానికి మొబైల్ ఫోన్ అవసరం లేదు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్కు ఓటీపీ అవసరం లేదు. ఒక బటన్ నొక్కడం ద్వారా ఫలితాలు వస్తాయని తెలిపారు.

## ఉన్నత విద్యాశాఖ కార్యదర్శిగా పోలా భాస్కర్

**ఉత్తర్వుల జారీ చేసిన ప్రభుత్వం**

**గతంలో ఈ శాఖలో పని చేసిన శ్యామల రావు**

**ఆయనకు టీటీడీ ఈవోగా బాధ్యతలు**

**ఖాళీ నేపథ్యంలో భర్తీ చేసిన ప్రభుత్వం**



**విశ్వంభర, అమరావతి:** ఏపీ ప్రభుత్వం ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా పోలా భాస్కర్ ను నియమించింది. కాలేజ్ విద్య కమిషనర్ పోలా భాస్కర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఏపీ ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న జే. శ్యామలరావు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఈవోగా నియమితులైన సంగతి తెలిసిందే. టీటీడీ ఈవోగా ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఈవోగా ఉన్న ధర్మారెడ్డిని ఏపీ ప్రభుత్వం తొలగించింది. దీంతో ఖాళీ ఏర్పడటంతో ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.

**విద్యపై ఏపీ ప్రభుత్వం ప్రత్యేక ఫోకస్**

ఏపీ ప్రభుత్వ విద్యపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. శనివారం ఉండవల్లిలోని తన నివాసంలో ఏపీ మంత్రి నారా లోకేష్ ఉన్నత విద్యాశాఖ మంత్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యాదీవెన, వసతి దీవెన పథకాల కింద ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన బకాయిల వివరాలను సమర్పించాలని రాష్ట్ర మానవవనరులు, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. విద్య శాఖ ముఖ్య అధికారుల సమావేశంలో లోకేష్ మాట్లాడారు. తాను పాదయాత్ర నిర్వహించిన సమయంలో వేలాది విద్యార్థులు ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించకపోవడం వల్ల తమ సర్టిఫికెట్లు కళాశాలల్లోనే నిలిచిపోయాయని చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. 201819 నుంచి ఇప్పటివరకు ప్రభుత్వ ఉన్నత విద్యాసంస్థల్లో అడ్మిషన్ల వివరాలు, ఎప్ సెట్ లో ఇంటర్మీడియట్ మార్కుల వెయిటేజి ఏమేరకు ఇవ్వాలి, ఇంజనీరింగ్ కళాశాలల్లో ఫీజులు ఏమేరకు ఉండాలనే విషయమై కూడా నోట్ సమర్పించాలని లోకేష్ కోరారు. ఉన్నత విద్యాసంస్థల్లో ఖాళీలు, రిక్రూట్ మెంట్ చేయాల్సిన ఫ్యాకల్టీ వివరాలు, రాష్ట్రవిభజనలో ఉన్నత విద్యకు సంబంధించిన పెండింగ్ అంశాలు, లెర్నింగ్ మ్యానేజ్ మెంట్ సిస్టమ్ ఫలితాలు ఎలా ఉన్నాయి అనే అంశాలపై పూర్తిస్థాయి నివేదికలు అందజేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## పచ్చని కొండను గుండు చేశారు



- పెద్దయెత్తున ప్రజాధనం దుర్వినియోగం
- రహస్య విలాస భవనాలు ఎవరికి కట్టారు
- మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు

**విశ్వంభర, విశాఖపట్నం:** విశాఖలో నిర్మించిన రుషికొండ భవనాలపై ప్రభుత్వం త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటుందని మాజీ మంత్రి గంటా శ్రీనివాస రావు స్పష్టం చేశారు. ఆదివారం రుషికొండ భవనాలు కూటమి శ్రేణులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్జీటీ ఆదేశాలను పక్కన పెట్టి రుషికొండపై వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా, అక్రమంగా నిర్మాణాలు చేపట్టిందని మండిపడ్డారు. ప్రజాధనంతో నిర్మించిన భవనాలను ఎందుకు ఉపయోగపడుతాయో తెలియడం లేదని ఆరోపించారు. వైసీపీ నేతల ఆక్రమణలు, భూ దోపిడీలపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రూ. 91 కోట్ల ఫైవ్‌స్టార్ హోటల్ కడుతున్నామని చెప్పి, రహస్యంగా విలాస భవనాలు కట్టారని విమర్శించారు. ముందు పర్యాటకం అన్నారు. తర్వాత పరిపాలన భవనాలు అన్నారని వెల్లడించారు. రూ. 450 కోట్ల ప్రజాధనాన్ని ఏం చేశారని ఆరోపించారు. రుషికొండ భవనాలను చంద్రబాబుకు చూపిస్తామని మంత్రి గంటా శ్రీనివాస రావు తెలిపారు. రుషికొండలో నిర్మాణాలు ప్రారంభించిన సమయంలో టూరిజం కోసం అన్నారని, ఆ తర్వాత రిసార్ట్స్ అంటూ పేరుమార్చారని అన్నారు. మరికొంత కాలానికి ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం అని వైసీపీ నేతలు చెప్తూ వచ్చారన్నారు. రుషికొండ నిర్మాణాలపై కోర్టులు కూడా పలు నివేదికలు ఇచ్చిందనీ.. అయినా కూడా రహస్యంగా వీటి నిర్మాణాలు ప్రారంభించారని గుర్తుచేశారు. అయితే ఎంతో ముచ్చటపడి కట్టుకున్న భవనాలను.. వైఎస్ జగన్ చివరకు చూసుకోకుండానే ప్రజలు తీర్పు ఇచ్చారని ఎద్దేవా చేశారు. రుషికొండలో పచ్చటి టూరిజం రిసార్టును కూల్చివేసి, విలాసవంతంగా కట్టడాలను కట్టారని గంటా ఆరోపించారు. రుషికొండ నిర్మాణాలపై మొదటి నుంచి వివాదాలే నడుస్తున్నాయన్నాయని, వైఎస్ జగన్ పచ్చటి కొండను గుండు చేశారని గంటా శ్రీనివాస రావు విమర్శించారు.

## బాధ్యతాయుతంగా పని చేస్తా



- టీటీడీ ఈవోగా బాధ్యతలు అదృష్టం
- సీఎం చంద్రబాబుకు థ్యాంక్స్
- బాధ్యతలు స్వీకరించిన శ్యామలరావు

**విశ్వంభర, తిరుమల:** తిరుమల, తిరుపతి దేవస్థానం నూతన ఈవోగా శ్యామలరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన శ్యామలరావు దంపతులకు అర్చకులు వేదాశీర్వచనంతో స్వాగతం పలుకగా ఆలయ జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఈవో మీడియాతో మాట్లాడారు. టీటీడీ ఈవోగా తనను బదిలీ చేయడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఈవోగా అవకాశం ఇచ్చిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టిని సారించి పారదర్శకంగా, బాధ్యతాయుతంగా పనిచేస్తామని వెల్లడించారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు ఇబ్బంది పడకుండా వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. ఎక్కడైనా సమస్యలుంటే బోర్డు దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఏపీలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే అప్పటి వరకు ఈవోగా పనిచేసిన ధర్మారెడ్డిని సెలువుపై వెళ్లాలని ఆదేశించారు. అదేవిధంగా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేసిన తరువాత విద్యాశాఖలో ఉన్నతాధికారిగా పనిచేస్తున్న శ్యామలరావును టీటీడీ ఈవోగా బదిలీచేయడంతో ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

## రెండు శాతం పనులు పూర్తి చేయలే

- పోలవరం ప్రాజెక్టు పనులు జగన్ విధ్వంసం
- ప్రకృతి తప్పిదం కాదు.. ప్రభుత్వ తప్పిదమే
- రివర్స్ టెండరింగ్ పేరుతో ఆగమాగం
- నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



**విశ్వంభర, ఏలూరు:** గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో పోలవరం ప్రాజెక్టు పనులు రెండు శాతం కూడా పూర్తి చేయలేదని నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో మీడియాతో మంత్రి రామానాయుడు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామానాయుడు మీడియాతో మాట్లాడుతూ.. మళ్లీ ప్రాజెక్ట్ ను పున: నిర్మాణం చేయడానికి చంద్రబాబు నాయుడు పోలవరం వెళ్లి క్షేత్రస్థాయిలో సందర్శిస్తారని స్పష్టం చేశారు. చంద్రబాబు చేసిన ప్రాజెక్టు పనులను జగన్ విధ్వసం చేశారని మండిపడ్డారు. వైసీపీ పాలనలో కక్షసాధింపు చర్యలు, విధ్వసం మాత్రమేనని అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి ఎక్కడా లేదని, వైసీపీ అబద్ధాలు, అసత్యాలతో అధికారంలోకి వచ్చిందన్నారు. అత్యంత కీలకమైన పోలవరం ప్రాజెక్ట్ సీజన్‌లో కొన్ని మార్పులు వస్తుంటాయని చెప్పుకొచ్చారు.

అలాంటి పరిస్థితులను దృష్టిలో పెట్టుకోకుండా పోలవరం ప్రాజెక్టును జగన్ ముంచేశారని ధ్వజమెత్తారు. ఇది ప్రకృతి తప్పిదం కాదు ప్రభుత్వ తప్పిదమన్నారు. రివర్స్ టెండరింగ్ పేరుతో సంవత్సరం పాటు ఏ విధమైన పనులు జరగలేదని చెప్పారు. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత చంద్రబాబు మొట్టమొదటిసారిగా పోలవరం ప్రాజెక్టుకు వస్తున్నారంటే అది రైతాంగానికి ఆయన ఇస్తున్న ప్రాధాన్యత అని వివరించారు. మళ్లీ అబద్ధాలతో జగన్ అధికారంలోకి రావాలనుకున్నాడని విమర్శించారు. 11 సీట్లతో ప్రజలు బాగా బుద్ధి చెప్పారన్నారు. రానున్న రోజుల్లో వైసీపీకి ఆంధ్ర రాష్ట్ర ప్రజల్లో స్థానం లేదన్నారు. సేవకులు, పాలకులు మాదిరిగా ఉండాలని, పాలకులు సేవకులుగా ఉండాలని కోరారు. అభివృద్ధి, సంక్షేమం వైపే ఎన్డీఏ ప్రభుత్వ పాలన సాగిస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

## సంతకాలు ఇప్పుడు అవసరం లేదు!

- శ్రీలక్ష్మికి మరోసారి షాక్
- సంతకాలు పెట్టాలని ఫైళ్లను తీసుకువచ్చిన చీఫ్ సెక్రటరీ
- ఫైళ్లను తర్వాత పరిశీలిద్దామన్న మంత్రి నారాయణ



**విశ్వంభర, విజయవాడ:** పట్టణాభివృద్ధి శాఖ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మికి మరోసారి చేదు అనుభవం ఎదురైంది. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే మొదట ఐదు హామీల అమలుపై ఫోకస్ చేశారు. వాటికి సంబంధించిన ఫైల్స్ పై సంతకాలు చేశారు. ఆయన ఎంత వేగంగా సంతకాలు చేశారో.. ఉన్నతాధికారులు కూడా అంతే వేగంగా పని చేయాలని ఆదేశాలు వెళ్లిపోయాయి. దీంతో పాలనలో తన మార్క్ చూపించడం మొదలుపెట్టేశారని తెలిసిపోతుంది. ఈ క్రమంలోనే గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన శ్రీలక్ష్మికి వరుస అవమానాలు ఎదురవుతున్నాయి. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు శ్రీలక్ష్మి బొకే ఇస్తున్నప్పుడు ఆయన నిరాకరించారు. ఆమె ఇచ్చిన బొకేను చంద్రబాబు తీసుకోలేదు. మిగిలిన ఐఏఎస్ అధికారుల నుంచి బొకేలను తీసుకున్న చంద్రబాబు శ్రీలక్ష్మి నుంచి మాత్రం పుష్పగుచ్ఛం తీసుకోకుండా పక్కన పెట్టారు. దీంతో ఆ సంఘటన తీవ్ర చర్చకు దారితీసింది.

ఆదివారం కూడా మంత్రిగా నారాయణ బాధ్యతలను స్వీకరిస్తున్న సమయంలో పట్టణాభివృద్ధి శాఖ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి నారాయణ మొదటి సంతకం చేయాల్సిన ఫైళ్లను నారాయణ ముందు ఉంచే ప్రయత్నం చేశారు. అయితే నారాయణ మాత్రం సంతకాలు ఇప్పుడు అవసరం లేదని, తర్వాత చూద్దామని చెబుతూ ఆమె తీసుకొచ్చిన ఫైలుపై సంతకం పెట్టకుండానే బాధ్యతలను స్వీకరించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. శ్రీలక్ష్మిని పట్టణాభివృద్ధి శాఖ చీఫ్ సెక్రటరీ పదవి నుంచి తప్పించి జీఏడీకి పంపుతారన్న ప్రచారం ఐఏఎస్ వర్గాల్లో వ్యక్తమవుతుంది.

## జగన్‌కు ప్రధాన ప్రతిపక్ష హోదా ఇస్తారా?

**అసెంబ్లీ సమావేశాలకు ప్రభుత్వం సిద్ధం**

**స్పీకర్ ఎన్నిక, ప్రధాన ప్రతిపక్ష నేత ఎన్నిక**

**ప్రతిపక్ష హోదా ఎవరికి దక్కుతుందో ఉత్కంఠ**

**విశ్వంభర, అమరావతి:** ఇప్పుడు ఏపీలో విచిత్ర పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎందుకంటే గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ఏపీ ప్రజలు తీర్పు ఇచ్చారు. కూటమికి ఏకంగా 164 సీట్లు ఇవ్వడం అంటే మామూలు విషయం కాదు. అదే సమయంలో జగన్ కు గత ఎన్నికల్లో 151 సీట్లు ఇచ్చి.. మొన్నటి ఎన్నికల్లో కేవలం 11 సీట్లకు పరిమితం చేయడం అందరికీ ఆశ్చర్యంగా కనిపిస్తోంది. ఇక చంద్రబాబు నాయుడు సీఎంగా, పవన కల్యాన్ డిప్యూటీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ క్రమంలోనే ఇప్పుడు అసెంబ్లీ సమావేశాలను ఈ నెల 17 నుంచి నిర్వహించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఫలితాల తర్వాత మొదటి సమావేశాలు కాబట్టి.. ఇప్పుడే స్పీకర్ ఎన్నిక, ప్రధాన ప్రతిపక్ష నేత ఎన్నిక ఇవన్నీ ఉంటాయి. అయితే అసెంబ్లీలో ఉన్న ఎమ్మెల్యేల సంఖ్య ప్రకారం ప్రధాన ప్రతిపక్ష హోదా కావాలంటే కనీసం 18 సీట్లు గెలవాలి. కానీ ఇప్పుడు జగన్ కు ఉన్నది కేవలం 11 సీట్లు మాత్రమే. కాబట్టి ఆయనకు ప్రధాన ప్రతిపక్ష హోదా దక్కుతుందా.. ఆయన ప్రధాన ప్రతిపక్ష నేత అవుతారా లేదా అనేది అనుమానమే అంటున్నారు. అటు టీడీపీ తర్వాత జనసేనకు 21 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇప్పుడు ఏపీలో రెండో అతిపెద్ద పార్టీగా జనసేన అవతరించింది. కాబట్టి జనసేనకు ప్రధాన ప్రతిపక్ష హోదా అనేది కూడా డౌటే. ఎందుకంటే ఇప్పుడు జనసేన ఏపీ ప్రభుత్వంలో భాగస్వామ్యం అయింది. మరి ఎవరికి ప్రధాన ప్రతిపక్ష హోదా దక్కుతుంది అనేది మాత్రం ఈ అసెంబ్లీ సమావేశాల వరకు ఆగి చూడాల్సిందే.

## వైద్యశాఖను పూర్తి ప్రక్షాళన చేస్తాం

- వైద్యార్యోగశాఖ గత ప్రభుత్వం నిర్వీర్యం
- ఆరోగ్యశ్రీ లో అనేక అవినీతి, అక్రమాలు జరిగాయి
- ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్



**విశ్వంభర, అమరావతి:** వైద్యారోగ్య శాఖను పూర్తిగా ప్రక్షాళన చేస్తామని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ స్పష్టం చేశారు. ఆదివారం ఆయన మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలోని ఆయనకు ఛాంబరులో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య కుటుంబ సభ్యులు, అధికారులతో కలిసి పదవీ బాధ్యతలు చేపట్టారు. క్యాన్సర్‌ను ముందుగానే పసిగట్టేందుకు రాష్ట్రంలోని 5.30కోట్ల మంది స్క్రీనింగ్ పరీక్షలు చేసే ఫైల్‌పై తొలి సంతకం, 18ఏళ్లలోపు విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించి రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం కింద స్క్రీనింగ్ చేసే ఫైల్‌పై రెండో సంతకం చేశారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో వైద్యార్యోగశాఖను నీరుగార్చరని, నాడు నేడు పేరిట భవనాలకు రంగులు వేసి అభివృద్ధి అని గొప్పలు చెప్పుకున్నారని ఆరోపించారు. ఆరోగ్యశ్రీ లో అనేక అవినీతి, అక్రమాలు జరిగాయని, ఎన్‌ప్యానెల్ లిస్ట్‌లో లేని ఆసుపత్రులను చేర్చారని అన్నారు. ఇటువంటి వాటిపై చర్యలు తీసుకుంటామని అన్నారు, కేంద్రం, రాష్ట్రం నుంచి శాఖకు విడుదలైన నిధులను దారి జగన్ ప్రభుత్వ దారి మళ్లిందని ఆరోపించారు.


గ్రామీణ స్థాయి నుంచి పై స్థాయి వరకు మౌలిక వసతులను కల్పిస్తామని స్పష్టం చేశారు. ఏపీలో క్యాన్సర్ వల్ల ప్రతి యేట 40 వేలకు పైగా మంది చనిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ మరణిస్తున్నారని, ఏటా సగటున 48వేల మంది కేన్సర్ మహమ్మారి బారిన పడుతూ ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. ఓరల్, బ్రెస్టు, సర్వైకల్ క్యాన్సర్ల నివారణపై ప్రజల్లో సరైన అవగాహన కల్పించడంతో పాటు క్యాన్సర్ వ్యాధిని ముందుగానే గుర్తించి వైద్య సేవలందించాలనే లక్ష్యంతో 5.30 కోట్ల ప్రజలకు మందికి స్క్రీనింగ్ చేసేందుకు నిర్ణయం తీసుకుంటూ తొలి సంతకం చేశానని అన్నారు. ఇందులో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించేందుకు ఏఎన్ఎంలు, ఆశాలు, ఇతర అంబాసిడర్లకు హోమీ బాబా కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా శిక్షణ ఇప్పిస్తామని చెప్పారు. అలాగే, 18 ఏళ్లలోపు విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునేందుకు రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం కింద స్క్రీనింగ్ చేసే ఫైల్‌పై మరో సంతకం చేశామని వెల్లడించారు. గంజాయి, డ్రగ్స్ వినియోగం ఎక్కువగా ఉందని వీటిపై ఉక్కుపాదం మోపుతుందని మంత్రి సత్య కుమార్ తెలిపారు.

## అధికారం ఉందని వ్యతిరేక పనులు చెయ్యొద్దు

**కక్ష సాధింపు చర్యలొద్దు**

**చిత్తశుద్ధితో పని చేస్తే ప్రజలు మళ్లీ ఆదరిస్తారు**

**ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**



**విశ్వంభర, అమరావతి:** ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నాలుగోసారి సీఎంగా టీడీపీ చీఫ్ చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు ఆదివారం టీడీపీ ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, బూత్ స్థాయి కార్యకర్తలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడారు. గత 20 ఏళ్లలో గెలవని చోట కూడా ఈసారి విజయం సాధించామని హర్షం వ్యక్తం చేశారు. కూటమి విజయాన్ని కార్యకర్తలకు అంకితం చేస్తున్నానని వెల్లడించారు. ఎన్నికల్లో మూడు పార్టీల కార్యకర్తలు అద్భుతమైన సమన్వయంతో పని చేశారని కొనియాడారు. ఇంతటి ఘన విజయానికి కారకులైన కార్యకర్తల ఋణం తీర్చుకుంటానని స్పష్టం చేశారు.

ఐదేళ్ల పాటు కార్యకర్తలు, నేతలు అనేక ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి వచ్చిందని కక్ష సాధింపు చర్యలు, ప్రజావ్యతిరేక పనులు చేయవద్దని క్యాడర్‌కు చంద్రబాబు హితవు పలికారు. ఎమ్మెల్యేలు, నేతలు కిందిస్థాయి కార్యకర్తలను విస్మరించకూడదని స్పష్టం చేశారు. బాధ్యతతో, చిత్తశుద్ధితో పని చేస్తే ప్రజలు మళ్లీ ఆదరిస్తారని చంద్రబాబు నాయుడు సూచించారు.

# మంధాన.. ధనాధన్



## సఫారీలపై సూపర్ సెంచరీ

### 143 పరుగుల తేడాతో టీమిండియా ఘన విజయం

### 122 పరుగులకు దక్షిణాఫ్రికా ఆలౌట్

### మూడు వన్డేల సిరీస్‌లో 1-0తో భారత్ ఆధిక్యం



**విశ్వంభర, స్పోర్ట్స్ :** సొంతగడ్డపై టీమిండియా మహిళల జట్టు అద్భుతం చేసింది. దక్షిణాఫ్రికా మధ్య తొలి వన్డేలో టీమిండియా జయభేరి మోగించింది. తొలి వన్డేలో ఓపెనర్ స్మృతి మంధాన(117)సూపర్ సెంచరీతో కదం తొక్కగా.. స్పిన్నర్ ఆశా శోభన(4/21) తిప్పేసింది. భారీ ఛేదనలో మిగతా బౌలర్లు తలొక చేయి వేయడంతో ప్రత్యర్థిని 122 పరుగులకే కట్టడి చేసింది. దాంతో, చిన్నస్వామి స్టేడియంలో సఫారీలపై టీమిండియా 143 పరుగుల తేడాతో భారీ విజయం నమోదు చేసింది. ఈ విజయంతో హర్మన్‌ప్రీత్ సేన మూడు వన్డేల సిరీస్‌లో 10తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత మహిళల జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 265 పరుగులు చేసింది. స్మృతి మంధాన శతకానికి తోడుగా దీప్తి శర్మ(48 బంతుల్లో 3 ఫోర్లతో 37 నాటౌట్), పూజా వస్త్రాకర్(42 బంతుల్లో 3 ఫోర్లతో 31 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడారు. 99 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడ్డ జట్టును మంధాన తన సూపర్ బ్యాటింగ్‌తో ఆదుకుంది.

**122 పరుగులకు ఆలౌట్**


అనంతరం భారీ లక్ష్యచేధనకు దిగిన సౌతాఫ్రికా 37.4 ఓవర్లలో 122 పరుగులకు ఆలౌటైంది. సునే లూస్(33), మరిజన్నే కాప్(24), సినాలో జఫ్టా(27 నాటౌట్) రాణించగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. కెప్టెన్ లారా వోల్వార్డ్(4), తజిమ్ బ్రిట్స్(18), అన్నెక్ బోచ్(5), అన్నేరి డెర్క్‌సన్(1), షాంగేస్(8) తీవ్రంగా నిరాశపరిచారు. భారత బౌలర్లలో ఆశా శోభనా, దీప్తి శర్మలతో పాటు రేణుకా సింగ్, పూజా వస్త్రాకర్, రాధా యాదవ్ తలో వికెట్ తీశారు.

**చరిత్ర సృష్టించిన మంధాన**

టీమిండియా మహిళా జట్టు ఓపెనర్ స్మృతి మంధాన చరిత్ర సృష్టించింది. వన్డేల్లో ఆరో సెంచరీతో 7 వేల పరుగుల క్లబ్‌లో చేరింది. దాంతో, ఈ ఫీట్ సాధించిన రెండో మహిళా క్రికెటర్‌గా మంధాన రికార్డు నెలకొల్పింది. దక్షిణాఫ్రికాతో జరుగుతున్న వన్డేలో 56 పరుగుల వద్ద టీమిండియా వైస్ కెప్టెన్ అంతర్జాతీయ క్రికెట్‌లో 7,000 పరుగుల మైలురాయికి చేరింది. తద్వారా మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ తర్వాత ఈ ఘనత సొంతం చేసుకున్న ప్లేయర్‌గా మంధాన చరిత్ర పుటల్లో నిలిచింది. మిథాలీ 10,868 పరుగులతో టాప్‌లో కొనసాగుతోంది. చిన్నస్వామి స్టేడియంలో సఫారీ పేసర్ల ధాటికి టాపార్డర్ కుప్పకూలగా.. కష్టమైన పరిస్థితుల్లో ఖతర్నాక్ ఇన్నింగ్స్ ఆడింది. దక్షిణాఫ్రికా బైలింగ్ దళాన్ని దీటుగా ఎదుర్కొన్న మంధాన శతక్కొట్టింది. విధ్వంసక ఇన్నింగ్స్‌తో మెరుపు సెంచరీ బాదింది.

# టీమిండియా హెడ్ కోచ్‌గా గంభీర్!

- ఆయన పేరు ఖరారు చేసిన బీసీసీఐ
- త్వరలో అధికారిక ప్రకటన
- కొత్త కోచ్ సారథ్యంలోనే జింబాబ్వే టూర్



**విశ్వంభర, స్పోర్ట్స్ :** టీమిండియా హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్ పేరు దాదాపుగా ఖరారైనట్లు తెలిసింది. ఈ నెల (జూన్) చివరి వారంలో గంభీర్ పేరును అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ప్రస్తుత టీమిండియా హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ పదవీకాలం టీ20 ప్రపంచకప్ 2024తో పూర్తి కానున్న నేపథ్యంలో బీసీసీఐ అతి త్వరలోనే రాహుల్ వారసుడి పేరును ప్రకటించవచ్చని సమాచారం. ఒకవేళ ఇదే నిజమైతే 42 ఏళ్ల గంభీర్‌కు ఫుల్‌టైమ్ హెడ్ కోచ్‌గా ఇదే మొదటి బాధ్యత అవుతుంది. గంభీర్ గతంలో ఏ జట్టుకు ఫుల్‌టైమ్ హెడ్ కోచ్‌గా పని చేయలేదు. అయితే అతను మూడు సీజన్ల పాటు ఐపీఎల్‌లో మెంటార్‌గా వ్యవహరించాడు. 2022, 2023లో లక్నోతో.. 2024లో కేకేఆర్‌కు మెంటార్‌గా పని చేశాడు. గత ఐపీఎల్ సీజన్‌లో కేకేఆర్‌ను ఛాంపియన్‌గా నిలబెట్టడంతోనే గంభీర్‌కు టీమిండియా హెడ్ కోచ్‌గా అవకాశం వచ్చింది.

**హెడ్ కోచ్ రేసులో పలువురి పేర్లు**

ఈ మధ్యే ఒక ఇంటర్వ్యూలో గౌతీ సైతం టీమిండియా హెడ్‌కోచ్ పోస్ట్‌పై స్పందించాడు. 'జాతీయ జట్టుకు కోచ్‌గా ఉండడం కన్నా గొప్ప గౌరవం మరొకటి లేదు. భారత్‌కు కోచ్‌గా ఉండడాన్ని నేను ఇష్టపడుతాను. విశ్వ వేదికలపై 140 కోట్ల మంది భారతీయులు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులకు నేను ప్రతినిధిగా ఉంటాను' అని గంభీర్ వెల్లడించాడు. ప్రస్తుతం కోచ్‌గా సేవలందిస్తున్న రాహుల్ ద్రవిడ్ పదవీ కాలం టీ20 వరల్డ్ కప్‌తో ముగియనుంది. దాంతో ఆలోపే కొత్త కోచ్ నియామక ప్రక్రియను చేపట్టాలని బీసీసీఐ భావించింది. తొలుత మాజీ కోచ్ రవిశాస్త్రి, వీవీఎస్ లక్ష్మణ్‌లు రేసులో ఉంటారనే వార్తలు వినిపించాయి. ఈ నేపథ్యంలో వారు ముందుకు రాకపోవడంతో గంభీర్‌కు అప్పగించినట్లు తెలిసింది.

**కొత్త కోచ్ సారథ్యంలో జింబాబ్వే టూర్**

టీమిండియా హెడ్ కోచ్ పదవి కోసం రికీ పాంటింగ్, స్టీఫెన్ ఫ్లెమింగ్, మహేళ జయవర్ధనే, జస్టిన్ లాంగర్ లాంటి పేర్లు పరిశీలనలోకి వచ్చినప్పటికీ.. బీసీసీఐ గంభీర్‌వైపే మొగ్గు చూపినట్లు తెలుస్తుంది. బీసీసీఐకి చెందిన ఓ కీలక వ్యక్తి అందించిన సమాచారం మేరకు గంభీర్ తన సపోర్టింగ్ స్టాఫ్‌ను తనే ఎంచుకోనున్నట్లు తెలుస్తుంది. ఒకవేళ గంభీర్ పెట్టిన ఈ షరతుకు బీసీసీఐ అంగీకరిస్తే ప్రస్తుతమున్న సపోర్టింగ్ స్టాఫ్ ద్రవిడ్‌తో పాటు తప్పుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం భారత జట్టు బ్యాటింగ్ కోచ్‌గా విక్రమ్ రాథోడ్, బౌలింగ్ కోచ్‌గా పరస్ మాంబ్రే, ఫీల్డింగ్ కోచ్‌గా టి దిలీప్ ఉన్నారు. టీ20 వరల్డ్‌కప్ 2024 తర్వాత భారత్ జింబాబ్వే, శ్రీలంక పర్యటనలకు వెళ్లాల్సి ఉంది. గంభీర్ కోచ్‌గా నియమితుడైతే జింబాబ్వే పర్యటన నుంచే అతని విధులు మొదలవుతాయి. జులై 6 నుంచి 14 మధ్యలో జరిగే జింబాబ్వే పర్యటనలో భారత్ ఐదు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది.

# అదరగొట్టిన ఆస్ట్రేలియా

### స్కాట్లాండ్‌పై ఘన విజయం

### 5 వికెట్ల తేడాతో కంగారు జట్టు విక్టరీ

### టోర్నీ నుంచి స్కాట్లాండ్ ఔట్



**విశ్వంభర, స్పోర్ట్స్ :**

టీ20 వరల్డ్ కప్‌లో సూపర్ 8కు చేరిన ఆస్ట్రేలియా చివరి లీగ్ మ్యాచ్‌లోనూ అదరగొట్టింది. సంచలనాలకు తావివ్వకుండా స్కాట్లాండ్‌పై 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన స్కాట్లాండ్ బ్యాటింగ్ ఎంచుకుని ప్రత్యర్థి జట్టు ఆస్ట్రేలియాను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. సూపర్ 8 బెర్తును నిర్ణయించే మ్యాచ్ కావడంతో స్కాట్లాండ్ బ్యాటర్లు అద్భుత ప్రదర్శన చేశారు. ఓపెనర్ మున్సే(35) రాణించగా.. ఆ తర్వాత బ్రాండన్ మెక్‌కల్లమ్ మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఆసీస్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ 34 బంతుల్లోనే 6 సిక్సర్లు, 2 ఫోర్లతో 60 రన్స్ బాదేశాడు. అతడిచ్చిన ఊపుతో కెప్టెన్ బెర్రింగ్‌టన్(42), వికెట్ కీపర్ మాథ్యూ క్రాస్(18)లు ఆఖర్లో దంచేశారు. దాంతో స్కాట్లాండ్ నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 180 రన్స్ కొట్టింది. భారీ ఛేదనలో ఓపెనర్ ట్రావిస్ హెడ్(68), ఆల్‌రౌండర్ మార్కస్ స్టోయినిస్(59)లు అర్ధ శతకాలతో స్కాటిష్ బౌలర్లను ఉతికారేశారు. వీళ్లిద్దరూ దంచేయడంతో మిచెల్ మార్ష్ సేన మరో రెండు బంతులు ఉండగానే జయకేతనం ఎగురవేసింది. ఈ విక్టరీతో మెగా టోర్నీ రెండో రౌండ్‌కు ముందు కంగారు జట్టు కొండంత ఆత్మవిశ్వాసాన్ని పోగు చేసుకుంది. అనంతరం 2 పరుగుల వద్దే ఆసీస్ ఓపెనర్ డేవిడ్ వార్నర్(1) ఔటయ్యాడు. ఆ షాక్ నుంచి తేరుకునే లోపే మిచెల్ మార్ష్(8), విధ్వంసక ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్(11)లు పెవిలియన్ చేరారు. 60 పరుగులకే 3 వికెట్లు పడిన దశలో హెడ్(60), స్టోయినిస్(59)లు ఇన్నింగ్స్ నిలబెట్టారు.తమదైన శైలిలో బౌండరీలు బాదుతూ అర్ధ శతకాలు సాధించి ఆస్ట్రేలియాను గెలుపు బాట పట్టించారు. స్టోయినిస్ వెనుదిరిగాక.. టిమ్ డేవిడ్(24 నాటౌట్) ఒత్తిడికి లోనవ్వకుండా ఆసీస్‌కు అద్భుత విజయాన్ని అందించాడు. సూపర్ 8 బెర్తును నిర్ణయించే మ్యాచ్ కావడంతో స్కాట్లాండ్ బ్యాటర్లు శివమెత్తారు. ఓపెనర్ మున్సే(35) రాణించగా. ఆ తర్వాత బ్రాండన్ మెక్‌కల్లమ్ మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఆసీస్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ 34 బంతుల్లోనే 6 సిక్సర్లు, 2 ఫోర్లతో 60 రన్స్ బాదేశాడు. ఆసీస్ బౌలర్లలో మ్యాక్స్‌వెల్ రెండు వికెట్లు పడగొట్టాడు.

# టాటా గ్రూప్ మరో కొత్త వ్యాపారంలోకి అడుగులు




## మొబైల్ కంపెనీ స్థాపనకు ప్లాన్

### వివోను కొనుగోలు చేసేందుకు సన్నద్ధం

### ఇప్పటికే రెండు కంపెనీల మధ్య చర్చలు పూర్తి

### చైనా కంపెనీలో 51 శాతం వాటా తీసుకోనున్న టాటా

**విశ్వంభర, బిజినెస్:**

దేశంలో అత్యంత విశ్వసనీయమైన కంపెనీల్లో ఒకటైన టాటా గ్రూప్ కొత్త వ్యాపారంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది. సూదుల తయారీ నుంచి విమానాల తయారీ దాకా వెళ్లిన ఈ కంపెనీ.. ఇప్పుడు స్మార్ట్ ఫోన్ రంగంలోకి అడుగుపెట్టబోతోంది. దశాబ్దం క్రితం టాటా గ్రూప్ మొబైల్ నెట్‌వర్క్‌లు, హ్యాండ్‌సెట్‌లను తయారు చేసింది. అయితే ఇప్పుడు స్మార్ట్ ఫోన్ తయారు చేయబోతున్నారు. ఇందుకోసం చైనాకు చెందిన దిగ్గజ మొబైల్ కంపెనీ వివోను కొనుగోలు చేసేందుకు టాటా సన్నాహాలు చేస్తోంది. ఈ డీల్ పూర్తయితే ఈ కంపెనీలో టాటా కంపెనీకి 51 శాతం వాటా ఉంటుంది. తద్వారా విదేశీ కంపెనీ నియంత్రణ అంతా దేశంలోని టాటా గ్రూపుకే వస్తుంది.

**భారత ప్రభుత్వ పాత్ర ఏమిటి?**

ఈ విషయంలో భారత ప్రభుత్వం తన విధానాన్ని స్పష్టం చేసింది. చైనీస్ మొబైల్ కంపెనీలో 51 శాతం భారతీయ కంపెనీ చేతిలో ఉండాలని ప్రభుత్వం పేర్కొంది. అలాగే మొబైల్ హ్యాండ్‌సెట్‌ల తయారీ, పంపిణీని జాయింట్ వెంచర్‌గా మాత్రమే చేయాలి. అలాగే కేంద్ర ప్రభుత్వం కూడా వివో కంపెనీపై విచారణ జరుపుతోంది. కంపెనీపై పన్ను ఎగవేత, మనీలాండరింగ్ ఆరోపణలు కూడా ఉన్నాయి.

**స్మార్ట్‌ఫోన్‌లను తయారు చేసి విక్రయిస్తుంది**

చైనాలోని కంపెనీలను నియంత్రించేందుకు భారత ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. అందువల్ల చైనాకు చెందిన పెద్ద కంపెనీ వివో కంపెనీలో తన వాటాను విక్రయించడానికి సిద్ధమవుతోంది. అందుకోసం టాటా గ్రూపుతో చర్చలు ప్రారంభించారు. వివి టాటాతో స్మార్ట్‌ఫోన్‌లను తయారు చేసి విక్రయించనుంది.

**ప్రాథమిక చర్చలు పూర్తి**

రెండు కంపెనీల మధ్య ప్రాథమిక చర్చలు జరిగినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇప్పుడు ఈ కేసు వివో కంపెనీ వాల్యుయేషన్‌పై వచ్చింది. టాటా నుండి వివో కంపెనీని మూల్యాంకనం చేసింది. కానీ వివోకి దాని కంటే ఎక్కువ మూల్యాంకనం అవసరం. ఈ డీల్‌పై టాటా కంపెనీ ఆసక్తిగా ఉంది. అయితే ఇంకా ఏదీ నిర్ణయించలేదు. ప్రస్తుతం, భారతీయ కంపెనీ వివో మొబైల్‌ను తయారు చేసే పనిని కలిగి ఉంది. భగవతి ప్రొటెక్ట్ (మైక్రోమ్యాక్స్) వివో మొబైల్‌లను తయారు చేస్తోంది. ఇందుకోసం నోయిడాలోని ప్లాంట్‌లో రిక్రూట్‌మెంట్ ప్రారంభించింది. వివోకు చెందిన తయారీ యూనిట్ నోయిడాలోని టెక్జోన్ ఐటీ పార్క్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో ఉంటుంది. ఆ స్థలంలో గ్రేటర్ నోయిడాలో 170 ఎకరాల్లో కొత్త యూనిట్ నిర్మిస్తున్నారు. మరికొద్ది రోజుల్లో ఆ యూనిట్ నుంచి ప్రొడక్షన్ స్టార్ట్ అవుతుంది. ప్రస్తుతం ఈ డీల్‌కు సంబంధించి టాటా ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదు. అయితే ఒప్పందం కుదుర్చుకోవడానికి రెండు కంపెనీలు వేగంగా చర్యలు చేపట్టాయి.



### ఆత్మహత్యలకు బీమా కవరేజ్ ఉంటుందా?

# నిబంధనలు ఏం చెబుతున్నాయ్

**విశ్వంభర, బిజినెస్ :** జీవిత బీమా(లైఫ్ ఇన్సురెన్స్) అనేది కుటుంబానికి రక్షణ కవచం. ఏదైనా అనుకోని పరిస్థితుల్లో మనకు ఏదైనా జరగరానిది జరిగే.. ఆర్థిక ఆ కుటుంబం ఇబ్బందులు రక్షణగా నిలుస్తుంది. కానీ పాలసీదారుడు ఆత్మహత్య చేసుకుంటే.. ఆ నామినీకి హామీ ఇచ్చిన మొత్తాన్ని బీమా కంపెనీ అందిస్తుందా? ఈ ప్రశ్న చాలా మందికి వచ్చే ఉంటుంది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం..

**అత్యధిక శాతం మంది అడుగుతున్న ప్రశ్న..**

ఆత్మహత్య మరణాలు జీవిత బీమా పరిధిలోకి వస్తాయా ? ఈ ప్రశ్న ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్డీఏఐ) పోర్టల్, ఇంటర్నెట్‌లో అత్యధికంగా అడిగే ప్రశ్నలలో ఒకటి. ఆత్మహత్య చేసుకోవడం ప్రమాద సంఘటనగా పరిగణించబడదు కాబట్టి, లైఫ్ ఇన్సూరెన్స్ ప్లేయర్‌లు దానిని కవర్ చేయకపోవచ్చని ప్రజలు భావిస్తున్నారు. కానీ, చాలా జీవిత బీమా కంపెనీలు కొన్ని షరతులతో ఉన్నప్పటికీ ఆత్మహత్య మరణాలను కవర్ చేసే ప్లాన్‌లను కలిగి ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు.

పాలసీ ప్రారంభమైన తర్వాత సాధారణంగా ఒక సంవత్సరం వెయిటింగ్ పీరియడ్ ఉంటుంది. ఈ సమయంలో, పాలసీదారు ఆత్మహత్య చేసుకుంటే, బీమా కంపెనీ సాధారణంగా పూర్తి డెత్ బెనిఫిట్‌ను చెల్లించే బదులు లబ్ధిదారునికి చెల్లించిన ప్రీమియంలను తిరిగి చెల్లిస్తుంది. వెయిటింగ్ పీరియడ్ తర్వాత, భారతదేశంలోని చాలా జీవిత బీమా పాలసీలు ఆత్మహత్యలను పూర్తిగా కవర్ చేస్తాయి. మరణ ప్రయోజనం నామినీకి అందేలా చూస్తుంది.

ఆత్మహత్య కవరేజీకి వర్తించే నిర్దిష్ట షరతులను అర్థం చేసుకోవడానికి పాలసీదారులు తమ పాలసీ నిబంధనలను జాగ్రత్తగా సమీక్షించడం చాలా ముఖ్యం. ప్రతి బీమా కంపెనీకి దాని సొంత నియమాలు ఉంటాయి. కాబట్టి ఫైన్ ప్రింట్ చదవడం చాలా ముఖ్యం అని నిపుణులు సూచిస్తున్నారు. అదనంగా, బీమా సంస్థతో బహిరంగ సంభాషణను నిర్వహించడం ఏవైనా అస్పష్టతలను స్పష్టం చేయడంలో సహాయపడుతుంది. ఆత్మహత్య వినాశకరమైన, హృదయ విదారక స్వభావాన్ని దృష్టిలో ఉంచుకుని, చాలా మంది ప్రజలు దాని గురించి చర్చించడానికి దూరంగా ఉంటారు. ఆత్మహత్యకు కవరేజీని కలిగి ఉన్న బీమాను కలిగి ఉండటం కష్ట సమయాల్లో అవసరమైన రక్షణను అందిస్తుంది. బీమా పాలసీలను అర్థం చేసుకోవడం, ఈ ముఖ్యమైన సంభాషణలు పాలసీ హోల్డర్‌లు, వారి కుటుంబాలు సరిగ్గా రక్షించబడుతున్నాయని నిర్ధారిస్తుంది.

**ఇది గుర్తుంచుకోండి..**

ఆత్మహత్య చేసుకోవడం ఏ సమస్యకైనా పరిష్కారం కాదని అర్థం చేసుకోవాలి. అది కుటుంబానికి మరింత బాధను మాత్రమే తెస్తుంది. జీవితంలోని సమస్యలను ఎదుర్కోవటానికి ఇతరుల సహాయం కోరడం, వేరే మార్గాలను కనుగొనడం ఉత్తమం. అంతేకాకుండా, బీమా కంపెనీ వివిధ షరతుల నెపంతో ఆత్మహత్య మరణం సంభవించినప్పుడు నామినీకి డబ్బు ఇవ్వకపోవచ్చు.

**నిబంధనలు ఇవి..**

ఐఆర్డీఏఐ నిబంధనల ప్రకారం, పాలసీ కొనుగోలు చేసిన 12 నెలలలోపు పాలసీదారు ఆత్మహత్య చేసుకుంటే, నామినీకి పూర్తి హామీ మొత్తాన్ని చెల్లించకపోవచ్చు. అటువంటి సందర్భాలలో, జీవిత బీమా కంపెనీ నామినీకి పాలసీ వ్యవధిలో చెల్లించిన ప్రీమియంలో కొంత శాతాన్ని పాలసీ కంపెనీ అందిస్తుంది. ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్డీఏఐ) చెబుతున్న దాని ప్రకారం.. సాధారణ/పరిమిత ప్రీమియం పాలసీ కింద.. రిస్క్ ప్రారంభమైన తేదీ నుంచి 12 నెలలలోపు జీవిత బీమా ఉన్న వ్యక్తి ఎప్పుడైనా ఆత్మహత్య చేసుకుంటే, ఈ పాలసీ చెల్లదు. అమలులో ఉండి.. లేదా పునరుద్ధరణ తేదీ నుంచి 12 నెలలలోపు, మరణించిన తేదీ వరకు చెల్లించిన 80% ప్రీమియంలకు మినహా కంపెనీ ఎలాంటి క్లెయిమ్‌ను స్వీకరించదు. సింగిల్ ప్రీమియం పాలసీ కింద కూడా జీవిత హామీ పొందిన వ్యక్తి రిస్క్ ప్రారంభమైన తేదీ నుంచి 12 నెలలలోపు ఎప్పుడైనా ఆత్మహత్యకు పాల్పడితే, కంపెనీ చెల్లించిన సింగిల్ ప్రీమియంలో 90% మినహా మరే దావాను స్వీకరించదు. ఆత్మహత్య అనే అంశం సంక్లిష్టమైనదిదాని హృదయాన్ని కదిలించే స్వభావం కారణంగా తరచుగా నివారించబడుతుంది, దానిని పరిష్కరించడం చాలా అవసరం. భారతదేశంలో, జీవిత బీమా పాలసీలు ఆత్మహత్యలను కవర్ చేస్తాయి, కానీ నిర్దిష్టమైన నిబంధనలు, నిరీక్షణ కాలాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు.




## పవన్ కల్యాణ్‌కు సాయి ధరమ్‌తేజ్ స్పెషల్ గిఫ్ట్

**విశ్వంభర, సినిమా:** ఎన్నికల్లో తిరుగులేని విజయం తర్వాత జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. పిఠాపురం ఎమ్మెల్యేగా, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కొణిదెల పవన్ కల్యాణ్‌కు అభిమానులు, ప్రముఖులతో పాటు కుటుంబసభ్యులు అభినందనలు తెలుపుతున్నారు. తాజాగా, పవన్ కల్యాణ్ మేనల్లుడు, సుప్రీం హీరో సాయి ధరమ్ తేజ్ ఓ స్పెషల్ గిఫ్ట్‌ను అందజేశాడు. దీనికి సంబంధించిన ఫొటోను సాయి ధరమ్ తేజ్ తన ఎక్స్(ట్విట్టర్) ఖాతాలో షేర్ చేశాడు. తాజాగా హీరో సాయిధరమ్ తేజ్ పవన్ కల్యాణ్ గెలిస్తే కాలినడకన తిరుమల వస్తానని మొక్కుకొని తాజాగా ఆ మొక్కు తీర్చుకున్నారు.ఇదిలా ఉంటే తాజాగా పవన్ కల్యాణ్ కు మెగా హీరో సాయి ధరమ్ తేజ్ మంచి గిఫ్ట్ అందించాడు. “నన్ను స్టార్ వార్స్ లెగోకు పరిచయం చేసిన నా ప్రియమైన జేడీ మాస్టర్ అండ్ డిప్యూటీ సీఎంకు.. చివరకి నా చిన్ననాటి రోజులను తిరిగి పొందేందుకు అతనిలోని చైల్డ్‌కు గిఫ్ట్ ఇచ్చే చాన్స్ లభించింది. ” అంటూ సాయిధరమ్ తేజ్ ట్వీట్ చేశాడు.



## స్పైసీగా మారిన గుంటూరు కారం నటి

విశ్వంభర, సినిమా: అందం ఉంది.! యాక్టింగ్ కూడా అదిరిపోయే రేంజ్లో చేయగలుగుతుంది. కానీ సరైన సినిమా ఛాన్సులే రావట్లేదు అనుకుంటున్నారు మీనాక్షి చౌదరికి. గుంటూరు కారం సినిమాలో.. చాలా చిన్న రోల్‌కి పరిమితం అయి.. అందర్నీ షాక్ అయ్యేలా చేసిన ఈ బ్యూటీ ఫిల్మ్ కెరీర్ ఇప్పుడు కాస్త మారుతున్నట్టు కనిపిస్తోంది. ఎందుకంటే.. గుంటూరు కారం సినిమాలోని తన క్యారెక్టర్ లెంత్‌తో సంబంధం లేకుండా.. ఇప్పుడు క్రేజీ ఆఫర్లు రాబట్టుకుంటోంది. మీనాక్షి చౌదరి ప్రస్తుతం దళపతి విజయ్ నటిస్తున్న.. ‘ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్’ సినిమాలో హీరోయిన్‌గా చేస్తోంది. దాంతో పాటే దుల్కర్ సల్మాన్ నటిస్తోన్న లక్కీ భాస్కర్ మూవీలో కూడా హీరోయిన్ ఈమె. ఈ రెండు సినిమాలతో పాటు.. మెగా హీరో వరుణ్ తేజ్ మట్కా సినిమా షూట్లో కూడా బిజీగా ఉంది ఈ బ్యూటీ.! ఇక సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే మీనాక్షి తాజాగా కొన్ని ఫోటోలను షేర్ చేసింది. క్రేజీ ఫోజులతో మీనాక్షి కొన్ని ఫోటోలను పంచుకుంది.



## సౌత్ ఇండియా నెంబర్ వన్ హీరోయిన్‌గా రష్మిక..

విశ్వంభర, సినిమా: సౌత్ ఇండియాలో ఇప్పుడు ఎవరు నెంబర్ వన్ హీరోయిన్ అంటే మొన్నటి వరకు అందరూ నయనతార పేరు చెప్పేవారు. ఎందుకంటే రెమ్యునరేషన్ పరంగా నయన్ ఎక్కువగా తీసుకునేది. ఆమె ఒక్కో సినిమాకు దాదాపు రూ.10 కోట్ల వరకు తీసుకునేది. అయితే ఇప్పుడు ఆమెను రష్మిక వెనక్కు నెట్టేసింది. రష్మిక మొన్న నటించిన యానిమల్ మూవీతో కెరీర్ లోనే బిగ్గెస్ట్ హిట్ అందుకుంది. ఆ మూవీ ఏకంగా రూ.900 కోట్ల వరకు రాబట్టింది. దాంతో ఇప్పుడు రష్మికకు బాలీవుడ్ లో డిమాండ్ బాగా పెరిగిపోయింది. ప్రస్తుతం సల్మాన్ ఖాన్ నటిస్తున్న సికిందర్ సినిమాలో నటిస్తోంది. ఏఆర్ మురుగదాస్ డైరెక్షన్ లోనే ఈ మూవీ వస్తోంది. ఈ మూవీ కోసం రష్మిక ఏకంగా రూ.13 కోట్ల వరకు తీసుకుంటోంది. ఇప్పటి వరకు సౌత్ లో నయన్ కంటే ఎవరూ ఎక్కువ తీసుకోలేదు.అ యితే మొదటిసారి రష్మిక ఆమెను దాటేసింది. దాంతో ఇప్పుడు రష్మిక సౌత్ ఇండియా నెంబర్ వన్ హీరోయిన్ గా అవతరించింది. ఇప్పటి వరకు ఏ సౌత్ హీరోయిన్ కూడా ఇంత భారీ మొత్తంగా రెమ్యునరేషన్ అందుకోలేదనే చెప్పకోవాలి.



## మాస్ లుక్స్‌తో భయపెడుతున్న అంజలి

విశ్వంభర, సినిమా: యాభైకి పైగా సినిమాల్లో నటించిన అంజలి ఇటీవలే గ్యాంగ్స్ ఆఫ్ గోదావరిలో ఓ మాస్ పాత్రలో మెప్పించింది. త్వరలో ఓ వెబ్ సిరీస్‌తో రాబోతుంది. జీ 5, ఫిక్సల్ పిక్చర్స్ ఇండియా బ్యానర్స్‌పై ప్రశాంతి మలిశెట్టి నిర్మాణంలో ముఖేష్ ప్రజాపతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న వెబ్ సిరీస్ ‘బహిష్కరణ’. ఈ సిరీస్‌లో అంజలి మెయిన్ లీడ్ చేస్తుంది. విలేజ్ రివేంజ్ డ్రామా జానర్‌లో తెరకెక్కుతున్న ఈ బహిష్కరణ సిరీస్‌లో 6 ఎపిసోడ్స్ ఉండనున్నాయి. తాజాగా ఆదివారం అంజలి పుట్టిన రోజు సందర్భంగా ‘బహిష్కరణ’ మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ మోషన్ పోస్టర్‌లో.. అంజలి వేట కొడవలి పట్టుకుని కోపంగా చూస్తూ కూర్చుంది. పక్కనే ఓ చెక్క కుర్చీ మంటల్లో కాలిపోతుంది. దీంతో మరోసారి అంజలి ఓ మాస్ పాత్రలో అలరించబోతుందని తెలుస్తుంది. ఇక ఈ ‘బహిష్కరణ’ వెబ్ సిరీస్‌లో రవీంద్ర విజయ్, శ్రీతేజ్, అనన్య నాగళ్ల, షణ్ముక్, చైతన్య సాగిరాజు, మహ్మద్ బాషా, బేబీ చైత్ర.. పలువురు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. త్వరలోనే ఈ సిరీస్ జీ 5 ద్వారా ప్రేక్షకుల ముందుకు రానుంది.



## జూనియర్ ఎన్టీఆర్ సినిమాలో యానిమల్ విలన్?

**విశ్వంభర, సినిమా:** ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబినేషన్లో తెరకెక్కే మూవీలో యానిమల్ ఫేమ్ బాబీ డియోల్ నటించనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలోని శక్తివంతమైన విలన్ పాత్ర కోసం ఆయనను ప్రశాంత్ నీల్ కలిసినట్టు టాక్ నడుస్తోంది. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం ఎన్టీఆర్ దేవర, వార్ సినిమాలతో బిజీగా ఉన్నారు. ప్రశాంత్ నీల్ ‘సలార్’ పార్ట్2 తెరకెక్కించే పనిలో ఉన్నారు. ఇవి పూర్తయ్యాక ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుందని సమాచారం. అటు బాలీవుడ్ నివేదికల ప్రకారం, ఈ చిత్రంలో హీరోయిన్ పాత్ర కోసం బాలీవుడ్ స్టార్ బ్యూటీ దీపికా పదుకునేను తీసుకునే ఆలోచనలో టీమ్ ఉన్నట్లుగా తెలుస్తోంది.ఒకవేళ ఇదే నిజమైతే, ప్రధాన తారాగణం లో దీపికా కూడా చేరితే..ఈ చిత్రంపై ఉన్న హైప్ ఇంకా రెట్టింపు అవుతుంది.



# రక్తదానం చేయడం వల్ల ఎన్ని ప్రయోజనాలో తెలుసా?

**విశ్వంభర, ఫీచర్:** అనారోగ్యం మరియు ప్రాణాంతక ప్రమాదాల కారణంగా, ప్రతిరోజూ వేలాది మందికి రక్తం అవసరమవుతుంది. బ్లడ్ బ్యాంకులు ఎల్లప్పుడూ అవసరమైన మొత్తాన్ని పూర్తి చేయలేవు. ముఖ్యంగా, మహమ్మారి కారణంగా, అవసరాలు చాలా రెట్లు పెరిగాయి. మంచి సమారిటన్‌లకు సహాయం అందించి కొన్ని ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత ఉంది. రక్తదానం ఒక గొప్ప కారణం అయితే, రక్తదానం వల్ల ప్రయోజనాలు ఉన్నాయి. అయినప్పటికీ, మీరు స్వచ్ఛందంగా ముందుకు వచ్చే ముందు రక్తదానం ప్రక్రియ మరియు ఇతర అంశాల గురించి మీరు బాగా తెలుసుకోవడం కూడా చాలా ముఖ్యం. ఈరోజు రక్తదాతల దినోత్సవం కాబట్టి.. రక్తదానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి మరింత తెలుసుకుందాం

**1. రక్తదానం వల్ల కలిగే ప్రయోజనాలు**

**దాత ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది :**

చాలా మంది రక్తదానం చేయడానికి భయపడుతున్నారు. రక్తదానం చేస్తే బలహీనమవుతామని భావిస్తారు. దీనికి విరుద్ధంగా, రక్తదానం దాతకి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇది ఇతరుల ప్రాణాలను కాపాడడమే కాకుండా, దాత ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది.

**గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది**

మీరు రక్తదానం చేసినప్పుడు మీ మొత్తం హృదయ ఆరోగ్యం మెరుగుపడుతుంది. ప్రత్యేకించి, రక్తదానం రక్తంలో ఇనుము పరిమాణాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది కాబట్టి పురుషులు ఎక్కువ ప్రయోజనం పొందుతారు. (మగవారికే ఎందుకు అని మీరు ఆశ్చర్యపోతుంటే, ఋతు చక్రంలో స్త్రీలు రక్తం కోల్పోతారు కాబట్టి). ఇనుము యొక్క పెరిగిన స్థాయి అనేక గుండె జబ్బులకు దారితీస్తుంది, అయితే రక్తదానం చేయడం ద్వారా గుండెపోటు మరియు స్ట్రోక్ వచ్చే అవకాశాలను వరుసగా 88% మరియు 33% వరకు తగ్గించవచ్చు.

**ఫిట్‌నెస్‌ను మెరుగుపరుస్తుంది**

ప్రతి పింట్ రక్తం (450ml) దాత శరీరంలో 650 కేలరీలను బర్న్ చేస్తుంది కాబట్టి సిఫార్సు చేసిన వ్యవధిలో రక్తదానం చేయడం వల్ల మీ ఫిట్‌నెస్ మెరుగుపడుతుంది. అయితే, బరువు తగ్గించే మార్గంగా రక్తదానం చేయడాన్ని ఆరోగ్య నిపుణులు సూచించడం లేదు.

**క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది**

మిల్లర్‌కీస్టోన్ బ్లడ్ సెంటర్ ప్రకారం, స్థిరమైన రక్తదానం క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

**రోగనిరోధక వ్యవస్థను మెరుగుపరుస్తుంది**

రక్తదానం చేసిన తర్వాత మీ ప్లీహము పునరుజ్జీవింపబడినందున రక్తదానం మీ రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది.

**రక్తదానం చేసే విధానం ఏమిటి?**

రక్తదానం యొక్క మొత్తం ప్రక్రియ, మీరు సైట్‌కు చేరుకున్న సమయం నుండి మీరు బయలుదేరే సమయం వరకు, దాదాపు ఒక గంట సమయం పడుతుంది, అయితే అసలు విరాళం దాదాపు 10 నిమిషాలు పడుతుంది. మీరు స్వచ్ఛందంగా రక్తదానం చేస్తే, మొత్తం ప్రక్రియ గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యం.

### విరాళానికి ముందు

- మీరు మునుపటి రాత్రి బాగా నిద్రపోయారని నిర్ధారించుకోండి
- రక్తదానం చేయడానికి 34 గంటల ముందు పుష్కలంగా నీరు/రసం త్రాగండి మరియు గణనీయమైన మరియు ఆరోగ్యకరమైన ఏదైనా తినండి
- సైట్‌కు చేరుకున్న తర్వాత, దాత ఫారమ్‌ను పూరించమని మిమ్మల్ని అడుగుతారు, అందులో మీ గురించి, మీ ఆరోగ్యం, విరాళాల చరిత్ర మొదలైన వాటి గురించి కొన్ని ప్రశ్నలు ఉంటాయి.
- దాత ఆరోగ్యంగా ఉన్నారని నిర్ధారించడానికి శరీర ఉష్ణోగ్రత, రక్తపోటు, పల్స్ మరియు రక్తంలో హిమోగ్లోబిన్ కంటెంట్ తనిఖీ చేయబడుతుంది

**విరాళం తర్వాత**

- బయలుదేరే ముందు కనీసం 10 నిమిషాలు విశ్రాంతి తీసుకోండి. తేలిక పాటి స్నాక్స్, రిఫ్రెష్ డ్రింక్ తాగండి.
- తదుపరి 2448 గంటల్లో సాధారణం కంటే ఎక్కువ ద్రవాలు త్రాగండి
- తర్వాతి 30 నిమిషాల పాటు ధూమపానం చేయవద్దు
- రక్తం ఇచ్చిన తర్వాత కనీసం 8 గంటల తర్వాత ఆల్కహాల్ తీసుకోకుండా ఉండండి
- మీకు కళ్లు తిరగడం అనిపిస్తే, పడుకోండి లేదా మోకాళ్ల మధ్య తల పెట్టుకుని కూర్చోండి
- మీరు దానం చేసిన ప్రదేశం నుండి రక్తస్రావం అయినట్లయితే, చేయి పైకెత్తి, కొన్ని నిమిషాల పాటు ఒత్తిడి చేయండి

# చల్లటి నీటిని తాగడం వల్ల ఇన్ని నష్టాలా?

- రక్తనాళాలు.. జీర్ణక్రియపై ప్రభావం
- బరువు తగ్గాలనుకునే వాళ్లు అస్సలు తాగొద్దు
- కూల్ వాటర్ శ్వాసకోస సంబంధిత వ్యాధులకు మూలం

**విశ్వంభర, ఫీచర్ :**

ఎండాకాలంలో వేడి నుంచి ఉపశమనం పొందేందుకు చల్లటి నీటిని తాగుతుంటాం. వేసవి నెలల్లో హైడ్రేటెడ్ గా ఉండటం చాలా ముఖ్యం. అయితే చల్లటి నీరు మీ శరీరానికి హాని కలిగిస్తుంది. మీరు త్రాగే నీటి ఉష్ణోగ్రత మీ శరీరం, దాని ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. తరచూ చల్లటి నీటిని తాగడం వల్ల కలిగే నష్టాలను తెలుసుకోండి. చల్లటి నీరు త్రాగడం వల్ల జీర్ణక్రియపై ప్రభావం పడుతుంది. చల్లటి నీరు లేదా ఇతర శీతల పానీయాలు వల్ల రక్తనాళాలను సంకోచించవచ్చు. జీర్ణవ్యవస్థకు అంతరాయం కలిగిస్తాయి. ఫలితంగా, శరీరం జీర్ణక్రియకు బదులుగా శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడంపై దృష్టి పెడుతుంది. చల్లటి నీరు తాగడం వల్ల హృదయ స్పందన రేటు తగ్గుతుంది. నరాలను ఉత్తేజపరుస్తుంది. రోజంతా చల్లటి నీటిని తాగడం వల్ల శరీరంలోని అన్ని స్వచ్ఛంద చర్యలను నియంత్రించే నాడి అయిన వాగస్ నరాల మీద తీవ్ర ప్రభావం చూపుతుంది. చల్లటి నీరు త్రాగడం వల్ల కలిగే స్పష్టమైన పరిణామాలలో ఒకటి గొంతు నొప్పి, దగ్గు. ఆ నీటిని తాగినప్పుడు.. అది శ్లేష్మం ఏర్పడటానికి కారణమవుతుంది. ఇది శ్వాస సమస్యలు, దగ్గు, జలుబు, గొంతు నొప్పికి కారణమవుతుంది. బయటి నుంచి వచ్చిన తర్వాత చల్లని నీరు లేదా ఇతర శీతల పానీయాలు తాగడం వల్ల వెన్నుపాములోని నరాలు చల్లబడి మెదడుపై ప్రభావం చూపుతుంది. దీంతో తలనొప్పికి మొదలవుతుంది. ఇది కొంతమందిలో సైనస్ సమస్యలను కూడా పెంచుతుంది. చల్లటి నీరు శరీరంలోని అదనపు కొవ్వును కరిగించడాన్ని కష్టతరం చేస్తుంది. ఇది కొవ్వును పెంచుతుంది. రిఫ్రిజిరేటర్ నీరు తాగడం వల్ల శరీరంలోని కొవ్వును పటిష్టం చేసి బరువు తగ్గకుండా చూస్తుంది.



Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com